ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి




# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY





తెలుగుదిన పత్రికలో రిపోర్టర్లు కావలెను
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను
సంప్రదించవలసిన ఫోన్ నంబర్: 9440897445, 8074636674



ఆదివారం 07 జూన్ 2026 | సంపుటి: 28 సంచిక: 68 | Sunday 07 June 2026 | Vol.No 28 Issue No .68 | హైదరాబాద్ Hyderabad | పేజీలు: 12+12 | వెల: రూ.1.00 | PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA | www.visionandhra.in


## అష్టదరిద్రులు అడ్డంపడ్డా
# అభివృద్ధి ఆగదు

- ఎవరెంత ఏడ్చినా.. ఆర్ఆర్ఆర్ నిర్మిస్తాం
- వ్యవసాయాన్ని పండగ చేయడమే మా లక్ష్యం
- వరి వేస్తే ఉరి అనే రోజులు పోయాయి
- కాళేశ్వరం లేకున్నా లక్ష టన్నుల ధాన్యం పండింది
- ఇంతకాలం ఎక్కడ నీళ్లున్నా కాలేశ్వరం అంటూ ప్రచారం
- ధాన్యం కొనకుంటే మోడీ సంగతి తేలుస్తాం
- అభివృద్ధి నిరోధకంగా బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు
- కోహెడ పండ్ల మార్కెట్‌కు శంకుస్థాపనలో సిఎం రేవంత్ రెడ్డి









రంగారెడ్డి,జూన్6 :రంగారెడ్డి జిల్లాలోని కోహెడలో నిర్మించనున్న సమీకృత పండ్ల మార్కెట్ మనకు అంతర్జాతీయస్థాయి గుర్తింపు తీసుకొస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. స్థానికంగా పండ్ల మార్కెట్‌తో పాటు ఇంటిగ్రేటెడ్ సబ్‌రిజిస్ట్రార్ కాంప్లెక్స్‌కు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రసంగించారు. నగరంలోని పండ్ల మార్కెట్‌ను కోహెడకు తరలించినప్పుడు తాత్కాలిక టెంట్లు వేశారు. గాలివాన వచ్చినప్పుడు రైతులకు గాయాలయ్యాయి. ఇంటిగ్రేటెడ్ పండ్ల మార్కెట్ నిర్మిస్తానని నాడు ఎంపీగా ఉన్నప్పుడు హామీ ఇచ్చాను. పండ్లు, కూరగాయలు అన్నీ లభించేలా ఈ మార్కెట్‌ను నిర్మిస్తున్నాం అన్నారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో దారుణమైన పరిస్థితులు ఉన్నాయి. తాగేందుకు నీళ్లు ఉండవు.. కూర్చునేందుకు స్థలం ఉండదు. అందుకే అన్ని వసతులతో కూడిన ఇంటిగ్రేటెడ్ సబ్‌రిజిస్ట్రార్

మిగతా2లో..

## వైట్ కాలర్ జాబ్స్‌కు ప్రత్యామ్నాయం...
# బ్లూకలర్ జాబ్స్

- పరిస్థితులకు అనుగుణంగా యూత్ స్కిల్ అలవర్చుకోవాలి
- జలవనరులను కాపాడేందుకే హైడ్రా ఏర్పాటు
- డ్రగ్స్ నివారణకు ఈగిల్ ఫోర్సస్ ఏర్పాటు
- సిఎం రేవంత్ రెడ్డి వెల్లడి





హైదరాబాద్,జూన్6 : ఉపాధి విషయంలో.. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా యువత ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించాలని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆయా రంగాల్లో స్కిల్స్ పెంచుకుంటే అవకాశాలను అందిపుచ్చుకోవచ్చన్నారు. ఏఐ కారణంగా వైట్ కాలర్ జాబ్‌లు పోతున్నాయని అందరూ ఆందోళన చెందుతున్నారు. వైట్ కాలర్ జాబ్‌లకు ప్రత్యామ్నాయం బ్లూ కాలర్ జాబ్స్. యువతరం వాటిపై దృష్టి

మిగతా2లో..

## సెమీ కండక్టర్ పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలం

మలేషియా ప్రతినిధి బృందంతో మంత్రి శ్రీధర్ బాబు



హైదరాబాద్,జూన్6 : తెలంగాణలో సెమీ కండక్టర్ పరిశ్రమల ఏర్పాటుకు పూర్తి అనుకూల పరిస్థితులు ఉన్నాయని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. మలేషియా కంపెనీలు తెలంగాణలో భారీగా పెట్టుబడులు పెట్టేలా ముందుకు రావాలని

మిగతా2లో..

## పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు

- ఇరాన్ డ్రోన్లను కూల్చిన అమెరికా సైన్యం
- హార్ముజ్ జలసంధి వద్ద మళ్లీ ఉద్రిక్తతలు



టెహ్రాన్,జూన్6 :పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు మళ్లీ ముసురుతున్నాయి. హార్ముజ్ జలసంధి లక్ష్యంగా ఇరాన్ ప్రయోగించిన నాలుగు డ్రోన్లను అమెరికా సైన్యం కూల్చివేసింది. దీనికి ప్రతీకారంగా, ఇరాన్ తీరప్రాంతంలోని నిఘా రాడార్ కేంద్రాలపై అమెరికా వైమానిక దాడులకు దిగింది. ఈ పరిణామం ఇరు

మిగతా2లో..

## అన్నామలైకి భారీ ఫాలోయింగ్

- 'వుయ్ ద లీడర్స్' ఉద్యమానికి భారీ మద్దతు
- ఒక్కరోజులోనే 14 లక్షలమంది ఫాలోవర్లు చేరిక



చెన్నై,జూన్6 : తమిళనాడు రాష్ట్ర భాజపా మాజీ అధ్యక్షుడు కె.అన్నామలై పార్టీకి రాజీనామా చేసిన 24గంటల్లోనే 14లక్షలకు పైగా ప్రజలు ఆయనతో చేరారు. తాను చేపట్టే 'వుయ్ ద లీడర్స్' ఉద్యమంలో చేరాలని కోరుతూ అన్నామలై ఆన్‌లైన్ లింక్ ను

మిగతా2లో..

## వర్షాకాలం వస్తోంది జాగ్రత్త

- ముందస్తు చర్యలకు సిద్ధం కండి
- ధాన్యం కొనుగోళ్లు, సిఎం పర్యటనలపై జాగ్రత్తలు
- 208 పరీక్షా కేంద్రాల్లో నీట్ పరీక్ష
- సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలతో జాగ్రత్త
- జిల్లాల కలెక్టర్లకు సిఎస్ దిశానిర్దేశం



హైదరాబాద్,జూన్6 : తెలంగాణలో వర్షాల హెచ్చరికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాని, ముందస్తు చర్యలకు దిగాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా వర్షాల పరిస్థితులు, వరి కొనుగోళ్లు, ముఖ్యమంత్రి జిల్లాల పర్యటనల ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. శనివారం సచివాలయంలో జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమిక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై దిశానిర్దేశర చేశారు. ఈ సమావేశంలో ఈ సమావేశంలో వర్షాల ప్రభావంపై ప్రత్యేకంగా చర్చించిన సీఎస్, అన్ని జిల్లాల యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో

మిగతా2లో..

## ప్రభుత్వ భూములను పెద్దలకు దోచిపెడుతున్న రేవంత్

- భూదందాలో సిఎం కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ ప్రముఖులు
- తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపణలు



హైదరాబాద్,జూన్6 : రూ.లక్ష కోట్ల ప్రభుత్వ భూమిని రేవంత్ రెడ్డి సర్కార్ పెద్దలకు అప్పగిస్తోందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వ్యాఖ్యానించారు. శనివారం నాడు మీడియాతో మాట్లాడుతూ.. సీఎం కుటుంబ సభ్యులు, ప్రభుత్వ పెద్దలు, కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు భూదందాలో చురుకుగా ఉన్నారని ఆరోపించారు. అయితే ఈ ప్రభుత్వ భూములను సుప్రీంకోర్టు వరకు వెళ్లి తాము కాపాడుతామని స్పష్టం చేశారు. హైడ్రా..పేదల కాలనీల్లో

మిగతా2లో..

## కాంగ్రెస్ పాలనలో పాలమూరుకు ద్రోహం

- తెలంగాణ నీటిని ఎపికి దోచిపెట్టే కుట్ర
- సాగునీటి సలహాదారుడిగా ఆంధ్రాప్రాంత వ్యక్తి
- మీడియా సమావేశంలో మాజీమంత్రి శ్రీనివాసగౌడ్



మహబూబ్‌నగర్,జూన్6 : కాంగ్రెస్ పాలనలో అన్ని జిల్లాల కంటే ఎక్కువ నష్టం మహబూబ్‌నగర్ కు జరిగిందని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. తెలంగాణ నీటిని ఆంధ్రాకు దోచిపెట్టే కుట్రలు జరుగుతున్నాయని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఆంధ్రా వ్యక్తిని సాగునీటి సలహాదారుగా పెట్టి తెలంగాణకు అన్యాయం చేశారని మండిపడ్డారు. ఏపీకి నీళ్లు తీసుకుపోయి పాలమూరును ఎండబెడతారంట అని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే టెండర్లు పిలిచి పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. నిన్న మంత్రి, ముఖ్యమంత్రి మాటలకు ప్రజల నుంచి స్పందన లేదని తెలిపారు. ఇప్పటికైనా చిల్లర మాటలను సీఎం రేవంత్ రెడ్డి మానుకోవాలని హితవుపలికారు. పాత చింతకాయ పచ్చడిలా రేవంత్ రెడ్డి ప్రసంగం ఉందని ఎద్దేవా చేశారు. మహబూబ్‌నగర్‌లో శనివారం ఉదయం మాజీ మంత్రి లక్ష్మారెడ్డితో కలిసి శ్రీనివాస్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ.. సీఎం పర్యటన గురించి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రజలు ఆశతో ఎదురు చూశారని తెలిపారు. కానీ ఉమ్మడి

మిగతా2లో..

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే

- ఇదే తమ మొదటి డిమాండ్‌గా కొనసాగిస్తాం కూడా
- ప్రవేశ పరీక్షల అవకతవకలకు బాధ్యత వహించాల్సిందే
- కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే డిమాండ్
- జంతర్ మంతర్ వద్ద ధర్నా... ధర్నాలో పాల్గొన్న పర్యావరణవేత్త వాంగ్‌చుక్



న్యూఢిల్లీ,జూన్6 : నీట్ తదితర ప్రవేశ పరీక్షలు, రిక్రూట్మెంట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, విద్యార్థులు ఎదుర్కొంటున్న కష్టనష్టాలను పరిష్కరించేందుకు ప్రస్తుత విద్యా వ్యవస్థను సంస్కరించాలని కాక్రోచ్ జనతా పార్టీ డిమాండ్ చేసింది. తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తెచ్చేందుకు ఢిల్లీలోని జంతర్

మిగతా2లో..

## కలసి ఉంటే కలదు సుఖం దంపతులకు ప్రశంసాపత్రాలు అందజేసిన డీజీపీ సి.వి. ఆనంద్, సిపి సుమతి

విజన్ ఆంధ్ర(06)మల్కాజిగిరి : కుటుంబ సామరస్యం, మహిళల భద్రత, వైవాహిక బంధాల పరిరక్షణ లక్ష్యంగా మల్కాజిగిరి కమిషనరేట్ మహిళా భద్రత విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన మీ సురక్ష కలసి ఉంటే కలదు సుఖం కార్యక్రమం విజయ వంతంగా జరిగింది. కుటుంబ సలహా కేంద్రాల సీడీఈడబ్ల్యు ఎఫ్‌సీసీ, సహకారంతో తిరిగి కలిసిన 150కు పైగా దంపతులు, వారి కుటుంబ సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు, తెలంగాణ డీజీపీ సి.వి. ఆనంద్ మాట్లాడుతూ మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు, షీ టీమ్స్, భరోసా కేంద్రాలు, మహిళా పోలీస్ స్టేషన్లు, కుటుంబ సలహా కేంద్రాల ద్వారా మహిళల భద్రత మరింత బలోపేత మైందని, కౌన్సెలింగ్ సేవల ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా

మిగతా2లో..





## మద్యనిషేధ హామీని గాలి కొదిలేసిన జగన్

- సిపిఎస్ రద్దు చేస్తామని మోసం చేసిన వైసిపి
- జాబ్ క్యాలెండర్ పేరుతోనూ మోసం చేశారు
- టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌లతో భేటీ చంద్రబాబు విమర్శలు



అమరావతి,జూన్6 : మద్యపానం నిషేధం చేస్తామని హామీ ఇచ్చి గొడ్డలి పార్టీ చేతులెత్తేసిందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు విమర్శించారు. వైసీపీ హయాంలో సీపీఎస్ వారం రోజుల్లో రద్దు చేస్తామని చెప్పి ఎందుకు పక్కన పెట్టేసిందని ప్రశ్నించారు. ఈ మేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర

మిగతా2లో..

## రష్యాలో కొనసాగుతున్న లోకేశ్ పర్యటన

- యాండెక్స్ ప్రతినిధులతో సమావేశం



మాస్కో,జూన్6 : ఆంధ్రప్రదేశ్ ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ రష్యాలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన.. ప్రముఖ టెక్ సంస్థ యాండెక్స్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో అమరావతి, విశాఖపట్నంలో స్మార్ట్ ట్రాఫిక్

మిగతా2లో..

## రష్యాలో కొనసాగుతున్న లోకేశ్ పర్యటన

మేనేజ్‌మెంట్ వ్యవస్థల అమలుపై కీలక చర్చలు జరిగాయి. ప్రిడిక్టివ్ ట్రాన్సిట్ షెడ్యూలింగ్, పబ్లిక్ సేఫ్టీ అనలిటిక్స్, ఏఐ ఆధారిత ట్రాఫిక్ మానిటరింగ్ సిస్టమ్స్‌ను రెండు నగరాల్లో ప్రవేశపెట్టే అవకాశాలను పరిశీలించినట్లు సమాచారం. ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ఆధునిక టెక్నాలజీ వినియోగంపై ప్రత్యేకంగా చర్చలు జరిగాయి. లాస్ట్ మైల్ రవాణా ఖర్చులను తగ్గించే మార్గాలపై కూడా లోకేష్ సూచనలు చేశారు. అలాగే క్విక్ కామర్స్, డెలివరీ ఫ్లీట్లలో అటోనమస్ వెహికల్స్ వినియోగంపై యాండెక్స్ బృందంతో చర్చించారు. విశాఖలో ఏర్పాటు చేయనున్న ఏఐ డేటా సెంటర్‌కు సాంకేతిక భాగస్వామ్యం, అలాగే హై-పెర్ఫార్మెన్స్ క్లౌడ్ ఫ్రేమ్‌వర్క్‌ల వినియోగంపై కూడా సమావేశంలో చర్చలు జరిగినట్లు తెలిసింది. స్థానిక పరిపాలనలో ఏఐ మోడల్స్ వినియోగంపై సమావేశంలో చర్చలు జరిపారు. రష్యాలోని స్బేర్ సిటీలో యాండెక్స్ ఉన్నతస్థాయి బృందంతో కూడా మంత్రి లోకేష్ భేటీ అయ్యారు. ఐదవ రోజు పలు కీలక సంస్థలతో ఆయన వరుస సమావేశాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం.

## ప్రభుత్వ భూములను పెద్దలకు దోచిపెడుతున్న రేవంత్

దాడులు చేసి ఆ భూములను పెద్దలకు అప్పగిస్తోందని మండిపడ్డారు. శ్రీఆదిత్య కంపెనీ రివర్ బెడ్‌పైన ప్రాజెక్టు కడుతోందని.. ఆ కంపెనీ వెనుక ఓ ఎంపీ ఉన్నారన్నారు. శ్రీ ఆదిత్య కంపెనీకి బీఆర్ఎస్ హయాంలోనే పర్మిషన్ ఇచ్చారని.. దాన్ని ముట్టుకునే దమ్ము ప్రభుత్వానికి ఉందా అని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డికి నీళ్లపై అవగాహన లేదని కవిత విమర్శించారు. మహారాష్ట్ర సీఎం అపాయింట్‌మెంట్ ఇవ్వకపోతే ఏపీ సీఎం ఇవ్వరా? అని ప్రశ్నించారు. ఏపీ సీఎంతో మాట్లాడి 200 టీఎంసీల నీళ్లు తెచ్చి ఆ తర్వాత బనకచర్ల గురించి మాట్లాడాలన్నారు. అప్పుడు కేటీఆర్ పాలన నడిచిందని.. ఇప్పుడు కూడా కేటీఆర్ పాలనే నడుస్తోందన్నారు. అప్పుడు కేటీఆర్ అంటే కేసీఆర్, తన్నీరు హరీష్ రావు, రామారావు.. ఇప్పుడు కేటీఆర్ అంటే కొండల్ రెడ్డి, తిరుపతి రెడ్డి, రేవంత్ రెడ్డి అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్, బీజేపీ పరస్పర సహకారంతో ఒరిగేదేమీ లేదని కవిత విమర్శించారు. తెలంగాణ బరాబర్ ప్రజల జాగీరే అని.. పవన్ కల్యాణ్ జాగీర్ కాదని కవిత స్పష్టం చేశారు. ఆంధ్రా విషకోరల నుంచి తెలంగాణను కాపాడుకున్నామన్నారు. ఇక్కడకు వచ్చి రాజకీయం చేస్తామంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. పవన్‌కు మద్దతు ఇస్తే నాలుగు ఓట్లు వస్తాయని బీజేపీ భావిస్తోందని.. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ఉన్న 8 సీట్లు పోతాయన్నారు. పవన్ కళ్యాణ్ 10 ఎకరాలు శిఖం భూమిని కొనుగోలు చేశారని.. కోడికుంట సర్వే నంబర్ 706లో శిఖం భూమి ఉందన్నారు. రిజిస్ట్రేషన్ సమయంలో అనేక తప్పులు జరిగాయని.. ఆ భూమిని పవన్ తిరిగి ఇచ్చేయాలన్నారు. శిఖం భూమిలో వేసిన కంచెను పవన్ తొలగించాలని కవిత డిమాండ్ చేశారు.

## కలసి ఉంటే కలదు సుఖం దంపతులకు ప్రశంసాపత్రాలు
## అందజేసిన డీజీపీ సి.వి. ఆనంద్, సిపి సుమతి

దాదాపు 6,700 మంది దంపతులను తిరిగి కలిసినట్లు వెల్లడించారు, మహిళా భద్రత విభాగం డీజీపీ చారు సిన్హా మాట్లాడుతూ కుటుంబ బంధాలు బలపడాలంటే పరస్పర గౌరవం, నమ్మకం, అవగాహన అవసరమని పేర్కొన్నారు, తెలంగాణ రాష్ట్ర న్యాయ అకాడమీ అధిపతి ఎస్.ఎన్. శ్రీదేవి కుటుంబ వివాదాల పరిష్కారంలో కౌన్సెలింగ్ మధ్యవర్తిత్వం కీలకమని తెలిపారు, మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి.సుమతి మాట్లాడుతూ కమిషనరేట్ పరిధిలోని ఎనిమిది కుటుంబ సలహా కేంద్రాలు ఇప్పటి వరకు 9,700కు పైగా కేసులను పరిష్కరించి, 32 వేలకుపైగా కౌన్సెలింగ్ సమావేశాలు నిర్వ హించాయని వెల్లడించారు, ఈ సందర్భంగా తిరిగి కలిసిన దంపతులకు ప్రశంసా పత్రాలు అందజేయడంతో పాటు ఉత్తమంగా పనిచేసిన కుటుంబ సలహా కేంద్రాలు, కౌన్సెలర్లు, సిబ్బందిని సన్మానించారు, కుటుంబ సామరస్యం, మహిళల భద్రత, శాంతియుత వివాద పరిష్కారానికి కట్టుబడి పని చేస్తామని ప్రతిజ్ఞతో కార్యక్రమం ముగిసింది

## కాంగ్రెస్ పాలనలో పాలమూరుకు ద్రోహం

జిల్లా ప్రజలకు సీఎం ఇచ్చింది ఏమీ లేదని విమర్శించారు. రేవంత్ రెడ్డి వచ్చి కేసీఆర్ కట్టిన పంప్‌హౌస్‌లు, రిజర్వాయర్లను పరిశీలించిన వెళ్లారని తెలిపారు. కర్ణాటక జల దోపిడీకి మనం నిధులు ఇవ్వడమేంటని ఆయన ప్రశ్నించారు. బనకచర్ల ప్రాజెక్టును సీఎం ఎందుకు వ్యతిరేకించడం లేదని నిలదీశారు. ఇప్పటికే జూరాలకు చుక్కనీరు వస్తలేదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని ప్రాజెక్టులను పడావు పెడుతున్నదని విమర్శించారు. కర్ణాటకలో చర్చలు కొలిక్కి రాకుండానే బ్యారేజి కమ్ బరాజ్‌లపై ఎలా ఏరియల్ సర్వే చేశారని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు చంద్రబాబు ఎన్‌వోసీ ఇస్తే బనకచర్లపై సీఎం రేవంత్ రెడ్డి ఆలోచిస్తానని అంటున్నారని శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. తెలంగాణ జల హక్కులపై చంద్రబాబు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. మీరు తిరిగే రిజర్వాయర్‌లు కట్టింది కేసీఆర్ కాదా అని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. పాలమూరు ప్రాజెక్టు నిర్మాణానికి త్తటెడు మట్టిని కూడా రేవంత్ ప్రభుత్వం తీయలేదని విమర్శించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును డిజైన్ చేసింది 45 కిలోమీటర్ల కాలువలు అని.. అందులో41 కిలోమీటర్ల కాలువలు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే పూర్తయ్యాయని తెలిపారు. మొత్తం రూ.33,500కోట్ల పనులు పూర్తి చేశామని పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వం చేసిన పనులను కాంగ్రెస్ చేసిందని చెప్పుకుంటారా అని సీఎం రేవంత్ రెడ్డిపై మండిపడ్డారు. పాలమూరు-రంగారెడ్డి పనుల జాప్యానికి కారణం కాంగ్రెస్ ప్రభుత్వమని శ్రీనివాస్ గౌడ్ స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ పోరాడుతూనే ఉంటుందని అన్నారు.

## సెమీ కండక్టర్ పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలం

సూచించారు. ప్రపంచ స్థాయి 'సెమీ కండక్టర్ ఎకోసిస్టం' అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా పని చేస్తోందని వెల్లడించారు. హైదరాబాద్‌ను చిప్ డిజైన్, ఎలక్ట్రానిక్స్, అధునాతన సాంకేతిక రంగాల్లో అంతర్జాతీయ కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. సెమీ కండక్టర్, ఏఐ, ఇన్నోవేషన్, లైఫ్ సైన్సెస్, బయోటెక్నాలజీ, ఏరోస్పేస్ వంటి రంగాల్లో అపార అవకాశాలు ఉన్నాయని మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. తెలంగాణను 'గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ డెస్టినేషన్'గా మార్చేందుకు అంతర్జాతీయ భాగస్వామ్యాలకు ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. పెనాంగ్‌కు ఉన్న సెమీ కండక్టర్ అసెంబ్లీ, టెస్టింగ్, ప్యాకేజింగ్ అనుభవం తెలంగాణకు ఉపయోగపడు తుందని మంత్రి శ్రీధర్ బాబు అభిప్రాయం వ్యక్తం చేశారు. తెలంగాణ– మలేషియా మధ్య సాంకేతిక, పెట్టుబడి సహకారాన్ని బలోపేతం చేయాలని ఇరుపక్షాలు అంగీకరించాయి. మలేషియా ప్రతినిధి వైబీ జగదీప్ సింగ్ దియో తెలంగాణతో కలిసి పనిచేయడానికి ఆసక్తి వ్యక్తం చేశారు.

## పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు

దేశాల మధ్య కుదిరిన తాత్కాలిక కాల్పుల విరమణను తీవ్ర సంక్షోభంలోకి నెట్టింది. హోర్ముజ్ జలసంధి గుండా వెళ్లే అంతర్జాతీయ వాణిజ్య నౌకలకు ఇరాన్ డ్రోన్ల వల్ల తక్షణ ముప్పు పొంచి ఉందని అమెరికా సెంట్రల్ కమాండ్ స్పష్టం చేసింది. ఆత్మరక్షణ చర్యల్లో భాగంగానే జలసంధిలోని ఒక ద్వీపంతో పాటు ఇరాన్ తీరంలోని కీలక రాడార్ సైట్‌లపై తాము దాడులు చేసినట్లు సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. మరోవైపు, ప్రపంచ ఇంధన సరఫరాకు గుండెకాయ లాంటి హోర్ముజ్ జలసంధిపై పట్టు సాధించేందుకు ఇరాన్ ప్రయత్నిస్తుండగా, అందుకు ప్రతిగా అమెరికా ఇరాన్ రేవులపై ఆంక్షలు, దిగ్బంధనాన్ని విధిస్తోంది. ఈ వారంలోనే కువైట్ ప్రధాన విమానాశ్రయంలోని ప్యాసింజర్ టెర్మినల్‌పై ఇరాన్ డ్రోన్లు దాడి చేశాయి. ఈ ఘటనలో ఒకరు మరణించగా, డజన్ల కొద్దీ ప్రయాణికులు గాయపడ్డారు. దీనివల్ల ఎయిర్‌ఫీల్డ్ తాత్కాలికంగా మూతపడింది. ఈ దాడితో తీవ్ర ఆగ్రహానికి గురైన అమెరికా, తాజా ఘర్షణతో ఇరాన్‌కు గట్టి హెచ్చరికలు పంపింది. రాడార్ సైట్‌లపై దాడులతో పాటు, హిందూ మహాసముద్రంలో ప్రయాణిస్తున్న ఇరాన్ లింక్డ్ చమురు ట్యాంకర్‌ను అమెరికా సైన్యం తమ ఆధీనంలోకి తీసుకుంది. ఆంక్షల పరిధిలో ఉన్న చమురును విక్రయించడం ద్వారా ఇరాన్ లాభపడకుండా అడ్డుకునేందుకు అమెరికా ఈ చర్య చేపట్టింది. అలాగే, ఇరాన్ ఇంధన రంగానికి సహాయం చేస్తున్న పలువురు వ్యక్తులు, సంస్థలు, ట్యాంకర్లపై అమెరికా కొత్తగా మరికొన్ని ఆర్థిక ఆంక్షలను విధించింది. ఇరాన్–అమెరికా ఘర్షణ కేవలం జలసంధికే పరిమితం కాలేదు. అమెరికా మధ్యవర్తిత్వంతో ఇజ్రాయెల్, లెబనాన్ ప్రభుత్వాల మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇరాన్ మద్దతున్న హెజ్‌బొల్లా ఉగ్రవాద సంస్థ తిరస్కరించింది. ఈ క్రమంలో శుక్రవారం ఇజ్రాయెల్ సైన్యం దక్షిణ లెబనాన్‌లోని పలు ప్రాంతాలపై బాంబుల వర్షం కురిపించింది. ఈ దాడుల్లో 9 మంది ప్రాణాలు కోల్పోయారు. దక్షిణ లెబనాన్‌లోని ఎక్కువ భాగాన్ని ఇజ్రాయెల్ ఇప్పటికే తన ఆధీనంలోకి తెచ్చుకుంది. మరోవైపు, హోర్ముజ్ జలసంధి తెరవాలన్నా, శాశ్వత కాల్పుల విరమణ కుదరాలన్నా లెబనాన్‌లో ఇజ్రాయెల్ దాడులు ఆగాలని ఇరాన్ పట్టుబడుతోంది.

## అష్టదరిద్రులు అడ్డంపడ్డా అభివృద్ధి ఆగదు

ఆఫీసులు నిర్మిస్తున్నాం. అంతర్జాతీయ సదుపాయాలు కల్పించుకుంటేనే.. మనది అంతర్జాతీయ నగరం అవుతుంది. ఎవరెంత ఏడ్చినా.. ఆర్ఆర్ఆర్ ఆగదు. అభివృద్ధి కూడా ఆగదు. వ్యవసాయం దండగ కాదు.. పండగ అని నిరూపిస్తున్నాం. కాళేశ్వరం కూలేశ్వరం అయినా.. దేశంలోనే అత్యధిక వరి పండిస్తున్నాం. వరి వేస్తే.. ఉరే అని చెప్పిన రోజులు కావు ఇవి. వరి రైతులకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తున్నాం అని గుర్తు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధికి అష్టదరిద్రులు అడ్డం పడుతున్నారని ధ్వజమెత్తారు. కాళ్లలో కట్టెలు పెట్టినా.. మూసీలో పడి దొర్లినా వాళ్లను పట్టించుకోమని విమర్శించారు. అసూయ పడేవాళ్లు, అజీర్ణం చేసుకునేవాళ్లు ఎప్పుడూ ఉంటారని ఎద్దేవా చేశారు. రూ.2,284 కోట్లతో 239 ఎకరాల్లో ఫ్రూట్ మార్కెట్ నిర్మిస్తున్నారు. చుక్కనీరు ఎత్తిపోయకుండా లక్షల మెట్రిక్ టన్నుల పంట పండలేదా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎక్కడ నీళ్లున్నా కాళేశ్వరం నీళ్లు అనేవారని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం కడితే కూలేశ్వరం అయిందని విమర్శించారు. కేసీఆర్ హయాంలో కాళేశ్వరాన్ని రూ.లక్ష కోట్లు వెచ్చిస్తే గోదావరి పాలయ్యాయని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో విధ్వంసం చేస్తే.. మేం వికాసం వైపు నడిపిస్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్, బీజేపీ నేతలు అసూయ, పగ తమపై చూపండని.. కానీ ప్రజలపై కాదని చెప్పారు. సమస్యలు వస్తే పారిపోమని.. నిలబడి కొట్లాడి పరిష్కరించుకుంటామని అన్నారు. ఫామ్‌హౌస్ కేడీతోనైనా, ఢిల్లీలో మోదీతోనైనా కొట్లాడేందుకు సిద్ధమని వ్యాఖ్యానించారు.

చేతకాకపోతే దిగిపొమ్మంటున్నారని.. తాము అల్లాటప్పాగా రాలేదని చెప్పారు. కిషన్‌రెడ్డి, బండి సంజయ్ సంగతి చెబుతామని హెచ్చరించారు. మర్యాద తప్పితే.. పొలిమేరలు కూడా దాటనివ్వమని వార్నింగ్ ఇచ్చారు. మోదీని చూపి భయపెట్టాలనుకుంటే.. ఇక్కడెవరూ భయపడేవారు లేరని చెప్పుకొచ్చారు ఈనెల 15 తర్వాత వడ్లు కొనకపోతే కేంద్రం సంగతి చూస్తామని హెచ్చరించారు. మాకు మాటలే కాదని.. చేతలు కూడా తెలుసునని అన్నారు. కేంద్రం నుంచి నిధులు ఎలా తెచ్చుకోవాలో తమకు తెలుసునని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్ నగరం వేగంగా విస్తరిస్తోందని వ్యాఖ్యానించారు. భూముల ధరలు బాగా పెరిగాయని పేర్కొన్నారు. రియల్ ఎస్టేట్ పెరగడంతో వ్యవసాయం కుంటుపడిందని చెప్పుకొచ్చారు. హైదరాబాద్‌లో 1.34 కోట్ల మంది నివసిస్తున్నారని తెలిపారు.ఒకప్పుడు హైదరాబాద్ చుట్టూ కూరగాయలు పండేవని వెల్లడించారు. గడ్డిఅన్నారం నుంచి ఫ్రూట్ మార్కెట్‌ని ఇక్కడికి తరలించారని ప్రస్తావించారు. రేకుల షెడ్లు వేస్తే.. అవి గాలి దుమారానికి ఎగిరిపోయాయని అన్నారు. అంతర్జాతీయ స్థాయిలో మార్కెట్ నిర్మిస్తామని హామీ ఇచ్చామని చెప్పారు. పండ్ల మార్కెట్ కోసం మనం చేసిన ప్రయత్నాన్ని అడ్డుకోవాలని చూశారని ధ్వజమెత్తారు. అందరి అవసరాలు తీర్చేలా మార్కెట్ నిర్మాణం చేయబోతున్నామని స్పష్టం చేశారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌తో ఏటా రూ.8 వేల కోట్ల ఆదాయం వస్తుందని తెలిపారు. మన ప్రాంతంలో రైతులు అన్ని రకాల పండ్లు పండించాలని ఆకాంక్షించారు. ఫార్మా సిటీ వద్దని ఫ్యూచర్ సిటీ నిర్మాణం చేయబోతున్నామని వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ స్థాయి కంపెనీలను ఇక్కడికి తీసుకురాబోతున్నామని వివరించారు. కాలుష్యం లేని పరిశ్రమలే

ఈ ప్రాంతానికి వస్తాయని వెల్లడించారు. ఫ్యూచర్ సిటీ, మార్కెట్, ఆర్ఆర్ఆర్ వద్దంటూ అడ్డం పడుతున్నారని చెప్పుకొచ్చారు. వరంగల్ ఎయిర్‌పోర్టు వద్దని అడ్డుకుంటోందని ఆగ్రహించారు. గతంలో కావాలని మనం పోరాడితే.. ఇప్పుడు అష్టదరిద్రులు అడ్డం పడుతున్నారని దుయ్యబట్టారు. అభివృద్ధి చేద్దామంటే అడ్డుపడుతున్నారు.. ధర్నాలు చేస్తున్నారని ఫైర్ అయ్యారు. 2034 వరకు ప్రజాపాలన ఉంటుందని స్పష్టం చేశారు. ఔర్ ఏక్ బార్.. కాంగ్రెస్ సర్కార్.. తమ నినాదమని ఉద్ఘాటించారు. అభివృద్ధి పనులు చేసుకుంటూ ముందుకెళ్తామని చెప్పుకొచ్చారు. ఎంతమంది అడ్డం పడినా అభివృద్ధి పనులు ఆగవని తేల్చిచెప్పారు. సదుపాయాలు ఉంటేనే అంతర్జాతీయ స్థాయి నగరం అవుతుందని తెలిపారు. 'కారు' పూర్తిగా చెడిపోయి కార్ఖానాలో ఉంది. ఎన్ని మరమ్మతులు చేసినా.. చెడిపోయిన ఆ కారు ఇక పనికిరాదు. కేసీఆర్ కుర్చీ వేసుకొని కూర్చొని.. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మిస్తానని చెప్పారు. కానీ.. గెలిచిన తర్వాత పట్టించుకోలేదు. మేం అభివృద్ధి చేస్తుంటే.. అధికారంలోకి రాగానే ఫ్యూచర్ సిటీ రద్దు చేస్తామని బీఆర్ఎస్ చెబుతోంది. కాలుష్యం వెదజల్లే ఫార్మాసిటీ వద్దని.. ఫ్యూచర్‌సిటీ నిర్మిస్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన 500 కంపెనీలు తీసుకురావాలని యత్నిస్తున్నాం. బీఆర్ఎస్ నేతలు దశాబ్దంలోనే శతాబ్దానికి సరిపడా విధ్వంసం చేశారు. తెలంగాణలో పండిన ధాన్యాన్ని కొనలేని మోదీ గద్దె దిగాలి. రాహుల్ గాంధీని ప్రధాని చేసి.. మొత్తం ధాన్యాన్ని కేంద్రంతో కొనిపిస్తా. పాలమూరు– రంగారెడ్డికి జాతీయ హోదా తెస్తా. మెట్రో విస్తరణకు, ఆర్ఆర్ఆర్‌కు వెంటనే నిధులు తీసుకొస్తా అని సీఎం అన్నారు.

## వైట్ కాలర్ జాబ్స్‌కు ప్రత్యామ్నాయం...
# బ్లూకలర్ జాబ్స్

సారించాలి. అందుకు అవసరమైన స్కిల్స్ పెంచుకోవాలని సీఎం తెలిపారు. జలవనరుల కబ్జాను అడ్డుకునేందుకే హైడ్రాను ఏర్పాటు చేసినట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. నేడు ఎవరైనా చెరువులు, కుంటల వంటివాటి జోలికి వెళ్లాలంటే భయపడుతున్నారని చెప్పారు. బెంగళూరులో ఓ సదస్సులో పాల్గొన్న సీఎం.. హైడ్రా, ఈగల్ ఫోర్స్‌పై మాట్లాడారు. ధనికులు విలాస భవనాలు, ఫామ్ హౌస్‌ల కోసం చెరువులను ఆక్రమిస్తున్నారు. అంతేకాకుండా తమ భవనాల వ్యర్థాలను చెరువుల్లో కలుపుతున్నారు. ఈ కబ్జాలను అరికట్టేందుకే సీనియర్ ఐపీఎస్ నేతృత్వంలో 3 వేలమందితో హైడ్రా ఏర్పాటు చేశాం. ఇవాళ ఎవరు ఆక్రమణలకు పాల్పడినా.. ఆ కట్టడాలను నేలమట్టం చేస్తున్నాం. డ్రగ్స్ నివారణకు ఏర్పాటు చేసిన ఈగల్ ఫోర్స్ దేశంలోనే ఉత్తమమైనది. హైడ్రా, ఈగల్ ఫోర్స్‌లను దేశమంతా ఆసక్తిగా చూస్తోందన్నారు. తనను మభ్యపెట్టడం అంత ఈజీ కాదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పరిపాలనలో కామన్ సెన్స్ అనేదే ముఖ్యమని.. కామన్ సెన్స్‌తో సమస్యలు

పరిష్కారం చేసేవే ఎక్కువ అని తెలిపారు. తాను కేసీఆర్ మీడియా పీపుల్స్‌ను కూడా మీడియా సమావేశానికి పిలుస్తానన్నారు. వాళ్ళ మైండ్ సెంట్ ఏంటో తెలుసుకుంటానని చెప్పారు. తనకు వేరే ఏ పని లేదని.. 16 నుంచి 18 గంటలు పని చేస్తానన్నారు. తాను ఫుట్‌బాల్ ఆడతానని.. అందుకే మెస్సీని తీసుకువచ్చినట్లు తెలిపారు. యువతను క్రీడల వైపు మళ్లించాలనేది తన లక్ష్యమని చెప్పారు. తాను కొద్ది మంది జర్నలిస్టులతో రాత్రి సమయంలో మాట్లాడతానని, పాలనపై ఫీడ్ బ్యాక్ తీసుకుంటా అన్నారు. తనకు వ్యతిరేకంగా వార్తలు రాసినా చూస్తానని, దాని నుంచి కూడా కొంత సమాచారం వస్తుందన్నారు. పేదలు చెరువు పరిసరాలు ఆక్రమించుకున్నారు అంటే అర్థం చేసుకుంటానని.. కానీ పెద్ద వాళ్ళు కూడా చెరువులను అక్రమిస్తే ఎట్లా? అని ప్రశ్నించారు. హైడ్రా వచ్చాక.. ఎవరైనా ఇప్పుడు ధైర్యం చేస్తారా అడగండి. చెరువు కబ్జా చేయడానికి ఆలోచన చేస్తారేమో అని నిలదీశారు. ఓ వైపు క్యాస్టిజం వద్దంటం. మరో వైపు.. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు వేరే హాస్టల్స్ పెడుతుంటామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. అందుకే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ పెడుతున్న. అందరూ అందులో చదువుకోవాలి. సుప్రీంకోర్టు ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ అమలు చేసింది మేమే. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అమలు చేయలేదు. ఓబీసీ జనాభా లెక్కలు కూడా లేవు. తెలంగాణలో

ఆ లెక్కలు కూడా తేల్చేశాం. వెనకబాటు తనం, ఆర్థిక పరమైన అంశమే కాదు. విద్యా, సామాజిక అంశాలు. మేము పేద విద్యార్థులు చదువుకునే పాఠశాలల్లో బ్రేక్ ఫాస్ట్ కూడా ఏర్పాటు చేస్తున్నాం. మేము పిల్లని ఇంటి నుంచి స్కూల్ వరకు వాహనాలు కూడా ఏర్పాటు చేస్తాం. ఈ ఏడాది ప్రభుత్వం స్కూల్స్‌లో లక్ష మంది విద్యార్థుల సంఖ్య పెరిగింది. ట్రాన్స్పోర్టేషన్, బ్రేక్ఫాస్ట్, ఏర్పాటు చేస్తున్నాం. మా నాన్న రైతు. అందుకే మేము గోచి కడతాం పంచెలు, దోతీలు కూడా కడతాం. మా ఆహార్యం అలాగే ఉంటుంది.ఫ్రెండ్లీ మ్యాచ్ లాగే.. నా పొరుగు రాష్ట్రాలతో ఉంటా. హైడ్రా లాంటి ఆలోచన అన్ని రాష్ట్రాలకు అవసరం లేదు. మెట్రో పాలిటన్ సిటీలకు అవసరం. మహిళా రిజర్వేషన్‌కి మేం హక్కుదారులం. మహిళను రాష్ట్రపతి, ముఖ్యమంత్రులను చేసింది మేమే. సోనియా గాంధీ మహిళలకు రిజర్వేషన్ కోసం ప్రయత్నం చేశారు. మోడీ పొలిటికల్ ఫార్ములా వాడుతున్నారు. మేము నియోజకవర్గాల పెంపు, మహిళా రిజర్వేషన్‌లకు వ్యతిరేకం కాదు. మోడీ చేస్తున్న ఆలోచనకి వ్యతిరేకం. తెలంగాణ, కర్ణాటకలో కూడా బీజేపీ ఎంపీలు గెలిచారు. కానీ కేంద్ర కేబినెట్‌లో ప్రధాన కేంద్ర మంత్రి పదవులు లేవు. ఢిల్లీలో దక్షణాది ఎంపీలు సెకండ్ గ్రేడ్ పీపుల్స్ లాగా చూడొద్దు అంటున్నాం.' అని సీఎం వ్యాఖ్యానించారు.

## మద్యనిషేధ హామీని గాలి కొదిలేసిన జగన్

కార్యాలయంలో శిక్షణ పొందుతున్న క్లస్టర్ ఇన్‌చార్జ్‌లతో సీఎం చంద్రబాబు సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడారు. జాబ్ క్యాలెండర్ అమలు చేస్తామని గొడ్డలి పార్టీ మాట తప్పిందని ధ్వజమెత్తారు. ఇంతటితో ఆగకుండా వ్యవస్థలను విధ్వంసం చేసిందని మండిపడ్డారు. వైసీపీ హయాంలో చెప్పినవి చేయకపోగా తమ ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీ-2025పై బురద జల్లుతోందని ఆగ్రహించారు. మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్యపై ఎలా దుష్ప్రచారం చేసి లబ్ధి పొందారో... డీఎస్సీ విషయంలోనూ దుష్ప్రచారంతో లబ్ధిపొందాలనుకున్నారని దుయ్యబట్టారు.డీఎస్సీ నిర్వహణపై ఆధారాలతో సహా జగన్ అండ్ కోకు కౌంటర్ ఇచ్చామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన కౌంటర్‌తో గొడ్డలి పార్టీ నేతలు డిఫెన్సులో పడ్డారని చెప్పుకొచ్చారు. దుష్ప్రచారం చేయడం, ఫేక్ రాజకీయాలు చేయడం గొడ్డలి పార్టీ విధానం, సిద్ధాంతమని విమర్శించారు. అధికారంలో ఉన్నామని... సహనం, ఓపిక అవసరమని.. కానీ గొడ్డలి పార్టీ ఆగడాలు శ్రుతిమించితే వదిలిపెట్టమని హెచ్చరించారు. మంచి ఆలోచనలు చేసే వాళ్లకు మంచి వాళ్లే

సహాయపడతారని అన్నారు. చెడు ఆలోచనలు చేసే వాళ్ల చుట్టూ గొడ్డలి బ్యాచ్ జమ అవుతుందని ఎద్దేవా చేశారు. ఇకపై టీడీపీకి ఓటమి లేదని, రాదని తెలిపారు. ఆ స్థాయిలో జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రజలతో మంచిగా ఉంటున్నామని, ప్రజాస్వామ్యాన్ని గౌరవిస్తున్నామని.. సంక్షేమ పథకాలు – అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు స్వేచ్ఛను ఇచ్చామని చెప్పుకొచ్చారు. ముఖ్యంగా ఆత్మవిమర్శ చేసుకుంటున్నామని.. అందుకే టీడీపీకి ఓటమి రాదని పేర్కొన్నారు. పార్టీ పదవులు మొదలుకుని టికెట్ల కేటాయింపుల వరకు నిరంతరం సర్వేలు చేయిస్తున్నామని తెలిపారు. ప్రజలు, కార్యకర్తల అభిప్రాయాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటున్నామని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. రాష్ట్రం, పార్టీ శ్రేయస్సు కోసం తప్పులు చేసిన వాళ్లని వదిలించుకుంటానని స్పష్టం చేశారు. ఎన్నికల్లో కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఏం ప్రచారం చేశారో... అవన్నీ తమ ప్రభుత్వం చేస్తోందని అన్నారు. తమ ప్రభుత్వం చేస్తున్న మంచిని గడప గడపకు వెళ్లి చెప్పాలని దిశానిర్దేశర చేశారు. ఆనాడు చెప్పిన వాటిని ఈనాడు నెరవేరుస్తున్నామనే విషయాన్ని ప్రజలకు గుర్తు చేయాలని అన్నారు. మంగళగిరిలో టీడీపీ గెలిచి చాలా కాలమైందని... 2019 ఎన్నికల్లో నారా లోకేశ్ పోటీ చేసినా ఓడిపోయారని ప్రస్తావించారు. ఆ తర్వాత

పట్టుపట్టి పనిచేశారని.. 2024లో అద్భుత విజయం సాధించారని ప్రశంసించారు. గెలిచిన తర్వాత కూడా మంగళగిరిలో లోకేశ్ చక్కగా పని చేస్తున్నారని.. ఇప్పుడు మంగళగిరి టీడీపీకి కంచుకోటగా మారిందని చెప్పుకొచ్చారు. యుద్ధాన్ని గెలిపించే బాధ్యత తనదని... తనతో పాటు అలుపెరగకుండా యుద్ధం చేసే బాధ్యత టీడీపీ శ్రేణులదని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి కేంద్రంలోనూ గతానికి మించి ఓట్లు రావాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. కార్యకర్తలను ఆదుకునేందుకు పార్టీ పరంగా చేయాల్సిందంతా చేస్తామని స్పష్టం చేశారు. కార్యకర్తలకు అన్నిరకాలుగా అండగా ఉంటామని... ప్రభుత్వం చేసే అభివృద్ధిని అందిపుచ్చుకునేలా కార్యకర్తలు ఆలోచించాలని అన్నారు. భవిష్యత్తు రాజకీయాలకు కూటమితోనే వెళ్తున్నామని.. వెళ్తామని స్పష్టం చేశారు. దీనికి అనుగుణంగా కార్యకర్తలు క్షేత్రస్థాయిలో వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల ముందు బీజేపీతో పొత్తులో ఉన్నా కూడా ఓట్లు చీలకూడదనే.. టీడీపీతో కలుస్తానని పవన్ కల్యాణ్ చెప్పారని అన్నారు. ఏపీ సార్వత్రిక ఎన్నికల్లో కూటమిగా వెళ్లడంతోనే 94 శాతం స్ట్రైక్‌రేట్‌తో గెలిచామని ప్రస్తావించారు. పార్టీ అగ్రనేతలు మొదలుకుని... కార్యకర్తల వరకు ప్రతి ఒక్కరూ బ్రాడ్ మైండ్‌తో ఆలోచించాలని సీఎం చంద్రబాబు మార్గనిర్దేశర చేశారు.

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే

మంతర్ వద్ద సీజేపీ శనివారంనాడు భారీ నిరసన ప్రదర్శన నిర్వహించింది. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఈ నిరసనలకు నాయకత్వం వహించగా, ప్రముఖ విద్యావేత్త, యాక్టివిస్ట్ సోనమ్ వాంగ్‌చుక్, పార్టీ మద్దతుదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఇది సుదీర్ఘ పోరాటమని, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్ ఆరంభం మాత్రమేనని సీజేపీ స్పష్టం చేసింది. సీజేపీ మద్దతుదారులను ఉద్దేశించి అభిజీత్ దీప్కే మాట్లాడుతూ, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసేంత వరకూ నిరసనలు కొనసాగుతాయని ప్రకటించారు. ఇంకెంతమంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకునేంత వరకూ అధికారులు వేచిచూస్తారని నిలదీశారు. తమ డిమాండ్ల నెరవేరేంత వరకూ ఈ

ఉద్యమం కొనసాగుతుందన్నారు. నిరసనలకు దిగితే జైలులో పెడతారేమోనని తన తల్లి భయపడినట్టు దీప్కే చెప్పారు. 'తమ పిల్లలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళం విప్పితే ఏమవుతుందోనన్న భయం ఈ దేశంలోని ప్రతి తల్లికి ఉంది. ఈ ప్రభుత్వానికి భయపడి ఎంతకాలం బతకాలని ఆయన ప్రశ్నించారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించాలని నెలరోజుల నుంచి డిమాండ్ చేస్తున్నప్పటికీ చర్చలు తీసుకోవడం లేదని, దీనికి బదులు ఇతర అంశాలపైనే వాళ్లు దృష్టి పెట్టారని అన్నారు. సీజేపీ అకౌంట్లు హ్యాక్ చేయడం, పోస్టులు డిలీట్ చేయడం చేస్తున్నారని చెప్పారు. పోస్టులను డిలీట్ చేయవచ్చు కానీ, తమను ఏమార్చలేరని అన్నారు.

పేపర్ లీక్‌లు, విద్యావ్యవస్థలో తప్పిదాల కారణంగా ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల పేర్లను ఆయన చదవి వినిపించారు. విద్యార్థుల మృతికి సీజేపీ సంతాపం ప్రకటించింది. జంతర్‌మంతర్ నిరసనల్లో పాల్గొనేందుకు ఆయన అమెరికాలోని బోస్టన్ నుంచి ఢిల్లీకి వచ్చారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్రను చేత్తో పట్టుకుని కనిపించారు. జంతర్ మంతర్ వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు తమ విద్యాశాఖ మంత్రిగా ఆయన ఉండాలని కోరారు. అయితే తనకు రాజకీయాల్లో ప్రవేశించాలనే ఆలోచన లేదని వాంగ్‌చుక్ స్పష్టం చేశారు. యువకులే ఆ బాధ్యత చేపట్టాలన్నారు. రాజకీయవేత్తలు, ప్రభుత్వ అధికారుల పిల్లలు ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే చదవాలని తాను కోరుకుంటు న్నట్టు చెప్పారు. సీజేపీ నిరసనలకు ప్రభుత్వం అనుమతించడాన్ని ఆయన స్వాగతించారు. నిరసన తెలపడం తనకు ఇష్టం లేకున్నా న్యాయం కోసమే ఆ పని చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం ఉన్న విద్యావ్యవస్థలో మార్పు జరగాలని అన్నారు. కాగా, తదుపరి నిరసన ప్రదర్శనను జూన్ 23న న్యూఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో నిర్వహించే ఆలోచనలో సీజేపీ ఉంది. ఈ కార్యక్రమంలో వందలాదిమంది యువత పాల్గొని కాక్రోజ్ జనతాపార్టీకి మద్దుతగా నిలిచారు.

# అన్నామలైకి భారీ ఫాలోయింగ్

సామాజిక మాధ్యమాల్లో షేర్ చేయడంతో పెద్దఎత్తున స్పందన వస్తోంది. శుక్రవారం నుంచి శనివారం సాయంత్రానికి 14లక్షలకు పైగా ప్రజలు అందులో చేరారు. ఇంకా సభ్యత్వాలు కొనసాగుతున్నాయి. ఇదే పేరుతో ఆయన 2020లోనే స్వచ్ఛంద సంస్థను స్థాపించారు. శుక్రవారం అన్నామలై మాట్లాడుతూ.. నైతిక రాజకీయాల కోసం ఏపీజే అబ్దుల్ కలాం కేంద్రాన్ని కోయంబత్తూర్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. త్వరలో కొత్త పార్టీ పెట్టనున్నట్లు ప్రకటించారు. ఐపీఎస్ ఉద్యోగానికి రాజీనామా చేసి మంచి ఉద్దేశంతో నాడు భాజపాలో చేరానని, అదే ఉద్దేశంతో నేడు కొత్త పార్టీ వైపు అడుగులు వేస్తున్నట్లు తెలిపారు. ఒక సామాన్యుడు రాజకీయాల్లోకి రావడం చాలా పెద్ద విషయమని అన్నారు. నేతల దగ్గరకు ప్రజలకు తీసుకువెళ్లడం కాకుండా.. రాజకీయాలనే ప్రజల వద్దకు తీసుకువెళ్లడమే తన ఆలోచన అని పేర్కొన్నారు. సంప్రదాయ, వంశపారంపర్య రాజకీయాలను అంతం చేయడానికి తనతో కలసిరావాలని యువతను కోరారు. వియ్ ది పీపుల్‌ను ప్రారంభించిన ఒక్క రోజులోనే కొత్తగా 14 లక్షల మంది వాలంటీర్లుగా తమ పేర్లను రిజిస్టర్ చేసుకున్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల బరిలోకి దిగడమే తన లక్ష్యమని అన్నామలై ఇప్పటికే స్పష్టం చేశారు. సామాన్యుల ప్రయోజనాలే కేంద్రంగా రాజకీయాలు ఉండాలని చెప్పారు. అసలైన మార్పునకు దారితీసే రాజకీయాల అవసరం ఉందని అన్నారు. భవిష్యత్తు తరాలకు గట్టి పునాదులు వేసేందుకు తాను ప్రయత్నిస్తున్నానని చెప్పారు. వ్యక్తి పూజకు, కుటుంబరాజకీయాలకు తావులేదని చెప్పారు. తన ఉద్యమానికి వాలంటీర్లే జీవనాడి అని అన్నారు. కొత్త తరం నాయకులను వెలుగులోకి తీసుకొచ్చేందుకు, క్షేత్రస్థాయిలో అసలైన మార్పు కోసం వాలంటీర్లు ప్రయత్నించాలని పిలుపునిచ్చారు. విద్య, ఆరోగ్యం, పర్యావరణం.. ఇలా తమకు నచ్చిన రంగాన్ని వాలంటీర్లు ఎంచుకుని చేతనైన మేరకు తాముంటున్న చోట మేలి మార్పులు తీసుకురావాలని కోరారు. రాబోయే రోజులు మరింత మెరుగ్గా ఉండేలా తాను చేస్తున్న ప్రయత్నాలను చేయూతను ఇవ్వాలని పిలుపునిచ్చారు.

## వర్షాకాలం వస్తోంది జాగ్రత్త

ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. లోతట్టు ప్రాంతాలు, వరద ముప్పు ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రైతులు తమ ధాన్యాన్ని సులభంగా విక్రయించేలా అవసరమైన సదుపాయాలు కల్పించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న వరి కొనుగోళ్లను వేగవంతం చేసి, రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు మార్గనిర్దేశర చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమన్వయంతో పనిచేయాలని జిల్లా యంత్రాంగానికి సీఎస్ సూచించారు. వర్షాల పరిస్థితులపై నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే స్పందించేలా అన్ని శాఖలు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. వర్షాల హెచ్చరికలు, వరి కొనుగోళ్లు, సీఎం పర్యటనల నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం మరింత అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. రైతులకు, ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లాల పర్యటనల ఏర్పాట్లపైనా సీఎస్ అధికారులతో చర్చించారు. సీఎం పర్యటనలు విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. భద్రతా ఏర్పాట్లు, ప్రజాసభల నిర్వహణ, రవాణా సౌకర్యాలు, వసతి ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు ఉండకూడదని స్పష్టం చేశారు.

### 208 పరీక్షా కేంద్రాల్లో నీట్ పరీక్ష

జూన్ 21వ తేదీన జరగనున్న నీట్ పరీక్ష ఏర్పాట్లపై తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు శనివారం సచివాలయంలో జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 208 పరీక్షా కేంద్రాల్లో నీట్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 24 నగరాల్లో 72,956 మంది విద్యార్థులు నీట్‌కు హాజరు కానున్నారని చెప్పుకొచ్చారు. పరీక్షా కేంద్రాల్లో భద్రత, విద్యుత్, తాగునీరు, రవాణా ఏర్పాట్లు పూర్తి చేయాలని సీఎస్ ఆదేశించారు. పరీక్షల నిర్వహణలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సీఎస్ సూచించారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలపై అప్రమత్తంగా ఉండాలని పోలీసులకు దిశానిర్దేశర చేశారు. నీట్ ప్రశ్నాపత్రాల రవాణాకు తొలిసారిగా భారత వైమానిక దళం సేవలు వినియోగిస్తున్నట్లు వివరించారు. ఈ పరీక్షల భద్రతకు ఈసారి ప్రత్యేక భద్రతా ప్రోటోకాల్స్ అమలు చేస్తున్నామని సీఎస్ రామకృష్ణారావు పేర్కొన్నారు.

# సంపాదకీయం

## ఆర్థిక మోసాలకు అడ్డుకట్ట ఏదీ ?

ఆర్థిక కుంభకోణాలు, మోసాలను పసిగట్టలేక పోతున్నారు. దేశంలో ఎవరు ఎలా దోచేస్తున్నారో గుర్తించడం లేదు. అధికారంలో ఉన్నవారిది ఒక ర కమైన దోపిడీ, ఆర్థికంగా ఉన్నవారిది మరో రకమైన దోపిడీ అన్నట్లుగా కాలం నడుస్తోంది. అధికారంలో ఉండి ఆర్థిక మోసాలకు పాల్పడ్డ వారిని ఏమీ చేయడం లేదు. వారు అక్రమాలకు పాల్పడ్డట్లు రుజువులున్నా బోను ఎక్కించడం లేదు. తమ అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఇష్టారాజ్యంగా చేస్తున్న పనులపై నిఘా లేకుండా పోయింది. అజమాయిషీ లేదు. విచారణలు లేవు. తెలంగాణలో కాళేశ్వరం కథ కంచికి చేరింది. లక్షకోట్లు పెట్టి ఓ ప్రాజెక్ట్ కడితే అందులో అవతవకలు, ఆర్థిక మోసాలు జరిగాయన్న వారే దానిపై విచారణ జరిపించడం లేదు. ఇ- కార్ రేసులో నేరుగా విదేశీ సంస్థకు డబ్బులు చెల్లించినా కిమ్మనడం లేదు. ఎపిలో రుషికొండపై జగన్ ప్యాలెస్‌లు కట్టుకుంటే చర్యలు లేవు. మద్యం కుంభకోణానికి పాల్పడితే దిక్కులేదు. భూకుంభకోణ్యాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదు. ఇప్పటికే దేశంలో అనేక ఆర్థిక మోసాలు జరిగాయి. విజయ్ మాల్యా, నీరవ్ మోడీ, లలిత్ మోడీ వంటివారు దేశం బయటనే ఉన్నారు. వారిపై ఎలాంటి చర్యలు లేవు. దేశంలో కొందరు బ్యాంకులకు ఎగనామం వేస్తున్నా పట్టింపు లేదు. ఇవన్నీ కూడా ఇతరకుల ఆదర్శంగా నిలుస్తున్నాయని భావించాలి. తాజాగా రాజేష్ ఎక్స్‌పోర్ట్ లిమిటెడ్ (ఆర్ఇఎల్) భారీ ఆర్థిక అరాచకం దేశంలోనే కాదు అంతర్జాతీయ కార్పొరేట్ రంగాన్ని షేక్ చేస్తోంది. ఇలాంటి వారు మోసం చేస్తున్నా..గుర్తించలేక పోయారు. ఎల్ఐసి లాంటి సంస్థ ఇందులో పెట్టుబడులు పెట్టి ఇప్పుడు భారీగా నష్టపోయింది. ఆర్థిక మోసాలను ఎంత చాకచక్యంగా చక్కబెట్టవచ్చో 'లక్కీ భాస్కర్' మూవీలో చూపించారు. 1980లనాటి షేర్ల స్కామ్ కింగ్ పిన్ బిగ్‌బుల్ హర్షద్ మెహతా షేర్ మార్కెట్‌ను ఎలా మోసం చేశడో గుర్తుండే ఉంటుంది. వ్యవస్థలోని లొసుగులను తమకు అనుకూలంగా మార్చుకొంటున్న పలువురు భారీ అక్రమాలకు బరితెగిస్తున్నారు. వారి చేతుల్లో ఎంతోమంది అమాయకులు మోసపోతున్నారు. సహారా ఇండియా, అగ్రిగోల్డ్, లీఫిన్ ఇండియా లాంటి సంస్థలు కూడా ఎంతగా మోసం చేశాయో చూసాం. ఇటీవల నల్లగొండ, కర్నూలు జిల్లాలో మైక్రో ఫైనాన్స్ మోసం బయటపడింది. అయినా ప్రభుత్వాలు కళ్లు తెరవడం లేదు. కఠిన నిర్ణయాలు తీసుకోవడం లేదు. చిట్టీల పేరుతో గ్రామాలు మొదలు పట్టణ్యాల వరకు కోట్లల్లో మోసలు చేస్తూనే ఉన్నారు. తాజాగా బెంగళూరుకు చెందిన ప్రముఖ బంగారం, ఆభరణాల దిగ్గజం ఆర్ఇఎల్ తన వాస్తవ ఆదాయాన్ని రూ.15.15 లక్షల కోట్లు అధికంగా చూపించి, తన షేర్ వాల్యూను భారీగా పెంచుకొని, మదుపరులను, అలాగే ప్రభుత్వ వ్యవస్థలను మోసగించినట్లు ప్రాథమికంగా నిర్ధారణ అయింది. ఈ విషయాన్ని సెక్యూర్టీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డు ఆఫ్ ఇండియా సెబి విచారిస్తే తప్ప వెలుగులోకి రాలేదు. ఆర్ఇఎల్ స్కాం దేశ కార్పొరేట్ చరిత్రలో అతిపెద్ద కుంభకోణంగా చెబుతున్నారు. ఇలాంటి స్కామే 2009లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సత్యం కంపెనీలో జరిగింది. రూ.7,800 కోట్ల మేర కంపెనీ బ్యాలెన్స్‌షీట్‌లో తేడా వచ్చింది. ఎక్కువ ఆదాయం చూపించి సత్యం కంపెనీ షేర్ విలువను పెంచుకుందని ఆరోపణలొచ్చాయి. ఈ కేసులో సత్యం కంపెనీ అధినేత రామలింగరాజుకు ఏడేళ్ల జైలు శిక్ష పడింది. అమెరికాకు చెందిన హిండెన్‌బర్గ్ రిసెర్చ్ సంస్థ అదానీ కంపెనీ ఆర్థిక మోసాలను ఆధారాలతో సహా 2003 జనవరిలో బయటపెట్టడం పెను సంచలనం అయింది. ఆదానీ గ్రూపు తమ షేర్ విలువను పెంచుకునేందుకు గ్రూపు ఆదాయాన్ని అధికంగా చూపించడంతోపాటు పలు ఆర్థిక అవకతవకలకు పాల్పడిందన్నది ప్రధాన అభియోగం. దాంతో అదానీ ఆర్థిక సామ్రాజ్యం రూ.లక్షల కోట్ల మేర పతనమైంది. తూతూ మంత్రంగా సెబి దర్యాప్తు సాగింది. చివరికి అదానీ గ్రూపుపై 'హిండెన్‌బర్గ్'వి ఆధారాల్లేని ఆరోపణలుగా కొట్టిపారేసింది. ఉదారవాద ఆర్థిక విధానాలే ఆర్థిక స్కాంలకు మూలం. ఓ సామాన్యుడు సెబీకి లేఖ రాయడం, అది విచరణ చేయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఆర్ఇఎల్ కంపెనీ ప్రమోటర్, ప్రస్తుత ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ అయిన రాజేష్ మెహతాను సెక్యూర్టీస్ మార్కెట్ నుంచి తాత్కాలికంగా నిషేధించింది. ఆర్ఇఎల్ అక్రమాలను కేంద్ర ప్రభుత్వ సంస్థలుకానీ, నిఘా విభాగాలు కానీ గుర్తించలేకపోవడం వ్యవస్థీకృతంగా ఉన్న జాడ్యంగా చూడాలి. ఒక సాధారణ ఇన్వెస్టర్ 2025లో ఇ-మెయిల్‌లో చేసిన ఫిర్యాదుతో తీగ లాగితే డొంక కదిలింది. సెబి రంగంలోకి దిగి దర్యాప్తు చేపట్టినా, కంపెనీకి సంబంధించిన ఆడిట్ రిపోర్టులను చూపించమని పలు మార్లు నోటీసులిచ్చినా ఆర్ఇఎల్ యాజమాన్యం సహకరించలేదు. అందుకే సెబి ఆ సంస్థ స్కాంపై నివేదిక వెల్లడించాల్సి వచ్చింది. రార్పొరేట్ స్కాంలన్నింటిలో దండలో దారంలో కనిపించేది విదేశాల్లో ఆ సంస్థలు ఏర్పాటు చేసే అనుబంధ షెల్, సూట్‌కేస్ కంపెనీలు, వాటి ద్వారా ఈ దేశంలో అక్రమాలు. ఆర్ఇఎల్ కూడా అదే చేసింది. సిట్జర్లాండ్ నుంచి కథ నడిపించింది. ప్రపంచంలోనే అతిపెద్ద గోల్డ్ రిఫయినరీ 'వాల్కంబీ'ని 2015లో కొనుగోలు చేసింది. సంస్థ ఆదాయాన్ని రూ.వందల కోట్లను వేలు లక్షల కోట్లుగా తప్పుడు పద్ధతుల్లో చూపించింది. సంస్థ సి.ఎం.డి. రాజేష్ మెహతా తన వ్యక్తిగత ఖాతాలకు సంస్థ నిధులను భారీగా నిబంధనలకు విరుద్ధంగా మళ్లించారు. సంస్థలో కీలక స్థానాల్లో ఉన్న మరి కొంత మంది సైతం ఇదే పని చేశారు. ఈ కఠోర విషయాలను సెబినే వెల్లడించింది. కంపెనీ కార్పొరేట్ గవర్నెన్స్ లోపభూయిష్టంగా ఉందని ఇప్పుడు గుర్తించడం ప్రభుత్వ వ్యవస్థల పనితీరులో డొల్లతనానికి నిదర్శనం. ఇలాంటివి ఇంకా ఎన్ని జరుగుతున్నాయో తెలియదు. బయటపడితే తప్ప తెలుసుకోలేం. ప్రజలు అనేక విధాలుగా ఇప్పుడు మోసపోతున్నారు. ఈ క్రమంలో పకడ్బందీ చర్యలతో ఆర్థిక మోసాలకు కళ్లెం వేయాలి. కేవలం సైబర్ మోసాలే కాకుండా ఇలాంటి బడా మోసాలపైనా దృష్టి సారించాలి.

# రోడ్డు భద్రతపై అవగాహన

## వనపర్తి జిల్లా అదనపు ( స్థానిక సంస్థల) కలెక్టర్ ఖీమ్యా నాయక్



కొత్తకోట 06.(విజన్ ఆంధ్ర): కొత్తకోట: ప్రజా పాలన ప్రగతిబి ప్రణాళిక కార్యక్రమాంలో కొత్తకోట మున్సిపాలిటీలో శనివారం 4,5,6 7, వార్డులలో గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వనపర్తి జిల్లా అదనపు స్థానిక సంస్థల కలెక్టర్ కీమ్యా నాయక్ మాట్లాడారు అరులైన లబ్ధిదారులు ఎన్ ఎఫ్ బి ఎస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని అదేవిధంగా బడిబాట కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలో ఉచిత పాఠ్యపుస్తకాలను యూనిఫాములను మధ్యన భోజనం అందజేస్తూ ప్రభుత్వ బడుల్లో విద్యకు ప్రాధాన్యత ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. అలాగే బాల్య వివాహాల నిర్మూలన రహదారి ప్రమాదాల నివారణ మహిళలు పిల్లల భద్రత వంటి అంశాలపై అవగాహన కల్పించారు. మున్సిపల్ చైర్స్ పర్సన్ పి అరుణ శ్రీనివాస్ మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని సృజన చేసుకోవాలని తడి చెత్త పొడి చెత్త వేరుగా చేసి మున్సిపల్ ట్రాక్టర్ వచ్చినప్పుడు అందులో వేయాలన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పరిశుభ్రతమైన పట్టణ నిర్మాణానికి సహకరించాలని కోరారు. ఫ్రీ పై మరి విద్య ప్రాముఖ్యతను వివరిస్తూ చిన్నారులను ప్రభుత్వ పాఠశాలలో ఫ్రీ ప్రైమరీ తరగతుల్లో చేర్పించాలని సూచించారు. వార్డులలో మురుగు కాలువల పూడిక తీర్థవత పరిశుభ్రత పనులు నీటి నిలువల నీరు నిలిచిపోయిన ప్రాంతాల నివారణ చర్యలు పరిశుద్ధ నిర్వహణ రోడ్డు మరమ్మత్తులు వీధి దీపాల నిర్వహణ వనమహోత్సవం లో భాగంగా మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో మదనపురం మార్కెట్ యార్డ్ చైర్మన్ పి ప్రశాంత్, మున్సిపల్ వైస్ పర్సన్ పి పల్లవి కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు ఎన్ జే బోయెజ్, అఖిల సుభాష్, మంజుల రామకృష్ణ, యాదవ్. గాయత్రి, సత్యం సాగ రూ.పి రవీందర్ రెడ్డి, అబ్దుల్ నబీ, మురళి యాదవ్, భీమా చంద్రకాంత్, సంజివుదు, సుధారాణి, అజ్మత్ కానం, అయ్యన్న, నాయకులు, పెంటన్న యాదవ్, చీర్ల యాదయ్య సాగర్, సాయిలు యాదవ్, సంద వెంకటేష్, రాచాల వెంకటేష్, మున్సిపల్ సిబ్బంది వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నీట్ పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

## జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



గద్వాల జూన్ 06 (విజన్ ఆంధ్ర బ్యూరో): ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నీట్ పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. నీట్ (యుజీ)-2026 పునఃపరీక్ష నిర్వహణకు సంబంధించి ఢిల్లీ నుంచి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ తెలంగాణ ఇన్చార్జి అభిషేక్ సింగ్, హైదరాబాదు నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీట్ పరీక్ష దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న అత్యంత కీలకమైన పరీక్ష అని పేర్కొన్నారు. గతంలో జరిగిన పరిణామాల నేపథ్యంలో ఈసారి పరీక్ష నిర్వహణలో గోప్యత, భద్రత, పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రశ్నపత్రాల రవాణా, భద్రపరిచే ప్రక్రియ, పరీక్షా కేంద్రాల నిర్వహణ తదితర అంశాల్లో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2.95 లక్షల మంది అభ్యర్థులు 208 పరీక్షా కేంద్రాల్లో పరీక్షకు హాజరుకానున్నట్లు వివరించారు. హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల్లో అధిక సంఖ్యలో కేంద్రాలు ఉన్నందున ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ ధృవీకరణ పరికరాలు, విద్యుత్, తాగునీరు, వైద్య సదుపాయాలు తదితర ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. అభ్యర్థుల గుర్తింపు ప్రక్రియను కట్టుదిట్టంగా అమలు చేయడంతో పాటు పరీక్షా కేంద్రాల వద్ద శాంతిభద్రతల పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం రబీలో వరి ధాన్యం కొనుగోలు దాదాపుగా పూర్తయిందని మిగిలిన జిల్లాల్లో కూడా రెండు రోజుల్లో పూర్తి చేయాల్సిందిగా సిఎస్ ఆదేశించారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు ఈనెల 9న పెరేడ్ గ్రౌండ్ లో ముఖ్యమంత్రి చేతుల మీదుగా బస్సులను పంపిణీ చేయడం జరుగుతుందని, అన్ని జిల్లాల నుంచి ఈ కార్యక్రమంలో సంఘాల సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొనేలా చూడాలన్నారు. మహిళా సంఘాల సభ్యుల ద్వారా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫార్మ్ కుట్టించాలని, ఇప్పటికే ఆలస్యమైనందున ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత శాఖల జిల్లా అధికారులతో కలిసి వీసీ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ నీట్ పరీక్షను జిల్లాలో సజావుగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈనెల 9న మహిళా సంఘాలకు హైదరాబాదులో జరిగే బస్సుల పంపిణీ కార్యక్రమంలో జిల్లా నుంచి బయలుదేరే సభ్యులకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లా మహిళా సమాఖ్య తరపున ఎలక్ట్రికల్ స్కూటీలు, ఆటో, సైకిల్స్ కొనుగోలు చేసి గట్టు మండలంలోని మహిళా సంఘాల సభ్యులకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, డిఆర్డిఓ ముషాహిదా బేగం, ఏపీడి శ్రీనివాస్, డీఎవో వీరప్ప, పౌర సరఫరాల శాఖ అధికారి స్వామి కుమార్, నీట్ పరీక్ష సిటీ కోఆర్డినేటర్ దేవేందర్ రెడ్డి, పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

### - జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్




గద్వాల జూన్ 06 (విజన్ ఆంధ్ర బ్యూరో): ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. శనివారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి సెన్సెస్, సాదా బైనామా, ఎస్ఐఆర్ అంశాలపై జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియ జూన్ 25 నుంచి ప్రారంభమవుతుందని ఈ లోగానే బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకం పూర్తయ్యేలా రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడాలన్నారు. ఆయా పోలింగ్ స్టేషన్ల బూత్ లెవెల్ అధికారులు తమ విధులను సక్రమంగా నిర్వహించేలా పై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తూ ఉండాలన్నారు. అక్టోబర్ 1న ఫైనల్ ఓటర్ జాబితా ముద్రించి, ప్రకటించడం జరుగుతుందని, ప్రక్రియ మొత్తం సజావుగా జరిగేలా సంబంధిత అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని ఆదేశించారు. జనాభా గణన 2027 లో భాగంగా మొదట ఇండ్ల గణన చేపట్టినందున ఏ ఒక్క ఇంటిని వదలకుండా నిర్దేశిత సమాచారాన్ని సేకరించాలన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి వివిధ భూ సమస్యలపై ప్రజలు పెద్ద ఎత్తున కలెక్టరేట్ కు వస్తున్నారని, ఆయా మండలాల్లోనే సంబంధిత అధికారులు వారి సమస్యలను పరిష్కరించాల్సి ఉందన్నారు. పెండింగ్ లో ఉన్న సాదా బైనామాల పరిష్కారానికి మండలాల వారీగా సంబంధిత తహసిల్దార్లతో కలెక్టర్ మాట్లాడారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధుమోహన్, ఆర్డీవో శ్రీనివాసరావు, సిపిఓ పాపయ్య, వివిధ మండలాల తహసిల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు.

# 7న ఒంటిమిట్ట లో యోగాంధ్ర-2026 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి


## జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి



కడప,జూన్ 06: (విజన్ ఆంధ్ర) ఈ నెల 7వ తేదీన ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి దేవస్థానం ప్రాంగణంలో.నిర్వహించే "యోగాంధ్ర -2026" కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని. జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పిలుపునిచ్చారు. రెండు వారాల పాటు "యోగాంధ్ర- 2026"పై నిర్వహించే వివిధ కార్యక్రమాల నిర్వహణపై. శనివారం జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సంబందిత శాఖల అధికారులకు దిశా నిర్దేశం చేశారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ12వ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం. పర్యాటక / ప్రసిద్ధ ప్రదేశాలలో యోగ ప్రదర్శనల కార్యక్రమాల నిర్వహణలో భాగంగా ఈ నెల 7వ తేదీన ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి దేవస్థానం ప్రాంగణంలో. యోగాంధ్ర-2026 ప్రారంభోత్సవ కార్యక్రమం జరగనుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు విరివిగా పాల్గొనేలా ప్రజల్లో అధికారులు ప్రజలను ప్రోత్సహించాలన్నారు. ఈనెల 7వ తేదీ నుండి 21వ తేదీ వరకు "యోగాంధ్ర- 2026" పక్షోత్సవాల్లో నిర్వహించే అన్ని కార్యక్రమాలను పక్కాగా నిర్వహించాలన్నారు. ముఖ్యమైన పర్యాటక కేంద్రాలను గుర్తించి అక్కడ యోగ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతోందన్నారు. యోగా శిక్షణ కోసం జిల్లాలోని ప్రజలందరూ రిజిస్ట్రేషన్ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని సంబందిత అధికారులను ఆదేశించారు. జూన్ 21వ తేదీన జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని.కోటి మందితో యోగాసనాలు వేయించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం రూపుదిద్దుకుందన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలి

### - జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా




నిర్మల్ జిల్లా,జూన్ 06,(విజన్ ఆంధ్ర); ఎస్ఐఆర్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్వహణపై జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయి అధికారులకు ఎస్ఐఆర్ ప్రక్రియ పై అవగాహన కల్పించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పై సంబంధిత అధికారులు అందరికీ పూర్తిస్థాయిలో అవగాహన ఉండాలన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్వహణలో ఎటువంటి లోటుపాట్లకు తావు ఉండరాదని చెప్పారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియను మొత్తం పారదర్శకంగా నిర్వహించి, నిజమైన ఏ ఒక్క ఓటరు కూడా తమ ఓటు హక్కు కోల్పోకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, మిగిలి ఉన్న వారి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వెంటనే పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కిషోర్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఇతర అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

# పంటల అవశేషాలను కాల్చడం తగదు

## జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



గద్వాల జూన్ 06( విజన్ ఆంధ్ర బ్యూరో): పంటల అవశేషాల దహనం వలన భూమి సారం కోల్పోతుందనీ, వాయు కాలుష్యంతో ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో శనివారం కలెక్టర్ ఛాంబర్ లో పంటల అవశేషాలను కాల్చకుండా రైతులకు అవగాహన కల్పించే కరపత్రాలను అధికారులతో కలిసి కలెక్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పంట కోత అనంతరం పొలాల్లో మిగిలిపోయే వరి మొండికాలు, ఇతర పంట అవశేషాలను తగులబెట్టడం వల్ల నేలలోని నత్రజని, భాస్వరం, పొటాషియం వంటి విలువైన పోషకాలు నష్టపోవడంతో పాటు పంటలకు మేలు చేసే వానపాములు, సూక్ష్మజీవులు నశించి భూమి సారశక్తి తగ్గిపోతుందన్నారు. అవశేషాల దహనం ద్వారా కార్బన్ డైయాక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్, మీథేన్ వంటి హానికర వాయువులు విడుదలై వాయు కాలుష్యాన్ని పెంచడమే కాకుండా శ్వాసకోశ వ్యాధులు, కంటి మంటలు, గుండె సంబంధిత సమస్యలు వస్తాయన్నారు. అంతేకాకుండా జీవవైవిధ్యానికి నష్టం కలగడంతో పాటు గ్లోబల్ వార్మింగ్ ప్రభావాలు మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. రైతులు పంట అవశేషాలను తగులబెట్టకుండా కంపోస్ట్ ఎరువుగా మార్చడం, మల్చింగ్ పద్ధతిని అనుసరించడం, హ్యాపీ సీడర్ వంటి యంత్రాలను వినియోగించడం ద్వారా భూమి సారాన్ని కాపాడుకుంటూ పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని ఈ సందర్భంగా కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మధుమోహన్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప, ఇతర అధికారులు, తదితరులున్నారు.

## ధోబీఘాట్ అభివృద్ధికి తగిన చర్యలు,: మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డి



అల్వాల్, జూన్ 6, (విజన్ ఆంధ్ర): ధోబీఘాట్ అభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు అల్వాల్ డివిజన్ మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శనివారం అల్వాల్ లోని ధోబీ ఘాట్‌లో బోర్‌వెల్ నిర్మాణ పనులకు ఆమె కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... స్థానికులు అభ్యర్థన మేరకు ఈ దోభిఘాట్ లో నూతనంగా బోరు నిర్మాణం చేపట్టి నీటి సౌకర్యాన్ని కల్పించడం జరిగిందన్నారు. అల్వాల్ డివిజన్సం సమగ్రా భివృద్ధికి, ప్రజల సంక్షేమానికి తాను కట్టుబడి ఉన్నానని ఆమె స్పష్టం చేశారు. ప్రజలకు అవసరమైన కనీస సౌకర్యాలను కల్పనకు తాన నిరంతరం కృషి చేస్తానని ఆమె హామీనిచ్చారు.ఈ కార్యక్రమంలో అరుణ్, అంజయ్య, మహేష్, యాదగిరి, ప్రేమ్, సాజిద్, సత్యనారాయణ, వర్ణిక, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని జెడ్సీకి బిఆర్ఎస్ నాయకుల వినతి



మల్కాజిగిరి , అల్వాల్, జూన్ 6,(విజన్ ఆంధ్ర): వెంకటాపురం డివిజన్ లో పలు ప్రాంతాల్లో నెలకున్న సమస్యలు పరిష్కరించాలని బిఆర్ఎస్ నాయకులు అనిల్ కిశోర్ గౌడ్ కోరారు. ఈ మేరకు శనివారం ఆయన, మల్కాజిగిరి జెడ్‌సి ని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..,రాంచంద్రయ్య కాలనీ పార్కులో పిల్లల పరికరాలు, బోర్‌వెల్ ఏర్పాటు చేయాలన్నారు. అలాగే బోరాని కాలనీ మజీద్ నుండి స్మశాన వాటిక వరకు సిసి రోడ్డు వేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు విజయ్ శేఖర్, మోసిన్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు

## ప్రాణప్రయస్థితిలో ఉన్న రోగికి అండగా నిలిచిన రైట్ హ్యాండ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు



పోరుమామిళ్ల, జూన్ 6 (విజన్ ఆంధ్ర) పోరుమామిళ్ల మండలానికి చెందిన మహబూబ్ బి అను మహిళకు శస్త్ర చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ హాస్పిటల్లో చేరగా చికిత్స నిమిత్తం అత్యవసరంగా బి పాజిటివ్ బ్లడ్ అవసరం రాగా రోగి కుటుంబ సభ్యులు పోరుమామిళ్ల పట్టణానికి చెందిన రైట్ హ్యాండ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులను సంప్రదించారు వెంటనే స్పందించిన ట్రస్టు సభ్యులు షేక్ నాయబ్ రసూల్ మరియు పురం ప్రసాద్ లు పోరుమామిళ్ళకు చెందిన కలసపాటి సుధాకర్ ద్వారా బి పాజిటివ్ రక్తాన్ని రోగికి అందించి అండగా నిలిచారు. సుధాకర్ ఇప్పటికే ఆరు సార్లు రక్తదానం చేసి తన సేవా భావాన్ని చూపించడంతో ట్రస్ట్ ప్రతినిధులు సుధాకర్ ను అభినందించారు అదేవిధంగా అత్యవసర పరిస్థితుల్లో రక్తం కావలసినవారు 8125991900 ను సంప్రదించాలని వారు తెలిపారు

## గర్భిణీలు, ప్రసవించిన తల్లులు మరియు శిశువుల వివరాలను యు- విన్ పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలి



హన్మకొండ జిల్లా ప్రతినిధి జూన్ 06 ( విజన్ ఆంధ్ర ) :జిల్లాలోని అన్ని ప్రభుత్వ మరియు ప్రైవేట్ వైద్య సంస్థలు గర్భిణీలు, ప్రసవించిన తల్లులు మరియు నవజాత శిశువులకు అందిస్తున్న సేవలను యు- విన్ పోర్టల్ లో తప్పనిసరిగా నమోదు చేయాలని జిల్లా వైద్య & ఆరోగ్య శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించినట్లు జిల్లా వైద్య & ఆరోగ్య అధికారి డా. సాంబశివరావు తెలిపారు.జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి ( డి ఎం హెచ్ ఓ ) కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా. ప్రకాష్ మాట్లాడుతూ, గర్భిణీల నమోదు, ప్రసవ వివరాలు, జనన సమయంలో ఇచ్చే టీకాలు మరియు తదుపరి వ్యాక్సినేషన్ వివరాలను సకాలంలో యు- విన్ పోర్టల్‌లో నమోదు చేయడం ద్వారా టీకాల కవరేజ్‌ను సమర్థవంతంగా పర్యవేక్షించవచ్చని తెలిపారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు ప్రతిరోజూ జరిగే డెలివరీలు, నవజాత శిశువులకు అందించే సేవలు, జనన టీకాలు మరియు వ్యాక్సినేషన్ సెషన్ల వివరాలను అదే రోజు యు- విన్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. టీకాలు పొందిన ప్రతి లబ్ధిదారుడి వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలని, పెండింగ్ ఎంట్రీలు లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ డెమో అనిల్ కుమార్ వైద్య ఆరోగ్య శాఖ సంబంధిత సిబ్బంది ప్రైవేట్ ఆసుపత్రిలో యజమాన్యం పాల్గొన్నారు పాల్గొన్నారు.

## పర్యావరణ కాలుష్యంపై ప్రజల్లో అవగాహన



మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా జూన్ 6, (విజన్ ఆంధ్ర ప్రతినిధి): 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా, ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల కలిగే పర్యావరణ కాలుష్యంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కూకట్‌పల్లి, సమతా నగర్ ప్రాంతంలో ప్లాస్టిక్ లిట్టర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో రిషి యూబీఆర్ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాల దుష్ప్రభావాలు, పర్యావరణ పరిరక్షణ అవసరం, పరిశుభ్రమైన పరిసరాల నిర్వహణ, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాల్సిన అవసరంపై ప్రజలకు అవగాహన కల్పించారు. పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ కాలుష్య నియంత్రణ, ప్రజల్లో పర్యావరణ చైతన్యం పెంపొందించేందుకు తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి నిరంతరం కృషి చేస్తోంది. ర్యాలీలో కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థినులు తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ,మేడ్చల్ ప్రాంతీయ కార్యాలయం అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 100 మంది విద్యార్థినులు పాల్గొని పర్యావరణ పరిరక్షణ సందేశాన్ని ప్రజలకు చేరవేశారు.

## మణికంఠ నగర్ కాలనీలో అక్రమ నిర్మాణాలు

**- రెండు ప్లాట్ల స్థలంలో మూడు భవనాలు నిర్మాణం**

**- బిల్డర్ల అత్యాశ కాలనీవాసులకు శాపం**

**- బిల్డర్ల ఆగడాలపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన మణికంఠ నగర్ వాసులు**

వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 06 ( విజన్ ఆంధ్ర ) : బిల్డర్ల అత్యాశ మణికంఠ నగర్ వాసులకు శాపంగా పరిణమించిందని కాలనీవాసులు గగ్గోలు పెడుతున్నారు. రెండు ప్లాట్ల స్థలాన్ని కొనుగోలు చేసి మూడు భవనాలు నిర్మించి విక్రయించి సొమ్ము చేసుకోవాలనుకోవడం దుర్మార్గమని వారు మండిపడ్డారు. శనివారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలో గల మణికంఠ నగర్ కాలనీకి చెందిన వాస్తవ్యులు అక్రమ భవన నిర్మాణాలను అడ్డుకోవాలని జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని వారు జిల్లా ప్రతినిధి మాచన్నగారి గైబులు





ముదిరాజ్ తో మాట్లాడారు. బిల్డర్లు రెండు ప్లాట్లు కొనుగోలు చేసి ఆ స్థలములోనే మూడు భవనాలు నిర్మించి సొమ్ము చేసుకోవాలని చూస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్కువ స్థలంలో ఎక్కువ భవనాలు నిర్మించడం వలన అండర్ డ్రైనేజీ రోడ్డు సమస్యలు తీవ్రంగా ఉంటాయని వారు హెచ్చరించారు. మున్సిపల్ అధికారులు సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో సందర్శించి పరిశీలించి బిల్డర్ల ఆగడాలను అరికట్టాలని వారు విజ్ఞప్తి చేశారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని రెండు ప్లాట్ల కొనుగోలు స్థలములోనే రెండు భవనాలు మాత్రమే నిర్మించాలని వారు కలెక్టర్ ను కోరారు. ఈ కార్యక్రమంలో మణికంఠ నగర్ కాలనీ అధ్యక్షుడు ఈ రవీందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి బి మహాత్మ, ఉపాధ్యక్షుడు శివకుమార్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి కే బన్సిలాల్, కోశాధికారి కే సత్యం, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ హన్మి రెడ్డి వి.వేణు తదితరులు పాల్గొన్నారు.

## అనుమతి లేకుండా అనాథ ఆశ్రమాలను నిర్వహిస్తే కఠిన చర్యలు

***అనుమతి లేకుండా అనాథ ఆశ్రమాలను నిర్వహిస్తే కఠిన చర్యలు: మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా రిజిస్ట్రేషన్ పొంది ఉండవలెను.***

మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా జూన్ 6, (విజన్ ఆంధ్ర ప్రతినిధి): బాలల న్యాయ చట్టం 2015 ప్రకారం 0 నుండి 18 సంవత్సరాల లోపు బాల బాలికలకు ఆశ్రయం కల్పిస్తున్నటువంటి ప్రతి అనాథ శరణాలయం, స్వచ్ఛంద సంస్థ తప్పనిసరి గా మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ పొంది ఉండవలెను. పిల్లలకు ఆశ్రమం కల్పిస్తూ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ పొందనటువంటి అనాథ శరణాలయం స్వచ్ఛంద సంస్థలపై బాలల న్యాయ చట్టం 2015 సెక్షన్ 42 ప్రకారంగా ఒక సంవత్సరం జైలు శిక్ష లక్ష రూపాయల వరకు జరిమానా విధించడం జరుగుతుందని. కావున మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలో ఏదైనా అనాథ శరణాలయం, బాలలకు ఆశ్రయం కల్పిస్తూ ఇప్పటివరకు రిజిస్ట్రేషన్ చేయించుకోనట్లయితే, వెంటనే సంబంధిత మహిళా శిశు సంక్షేమ శాఖ వారిని సంప్రదించి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ పొందవలసిందిగా జిల్లా సంక్షేమ అధికారిని శారద ఒక ప్రకటనలో తెలిపారు .జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బంది, పోలీస్ శాఖ వాళ్ళ సహాయంతో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో రిజిస్ట్రేషన్ అయిన అన్ని స్వచ్ఛంద సంస్థలను అనాథ ఆశ్రయాలను పరిశీలన చేయడం జరుగుతుందని.అదే సమయంలో అనుమతులు లేకుండా నడిపిస్తున్నటువంటి అనాథ ఆశ్రమాలను గుర్తిస్తూ వాటిపైన కూడా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇట్టి విషయంపై మరిన్ని వివరాలు కొరకు బాల రక్ష భవన్ కోఆర్డినేటర్ లేదా, జిల్లా బాలల రక్షణ సంరక్షణ అధికారి ని ఈ క్రింది నెంబర్లకు సంప్రదించాల్సిందిగా కోరారు.సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు: 82478 14647, 8520043943.

## వేణుమాధవ్ నళిని నారాయణ్ దంపతుల దాతృత్వం..

**- సదాశయ ఫౌండేషన్ కు సౌండ్ సిస్టం వితరణ..**

**- డాక్టర్ వేణుమాధవ్ ను అభినందించిన అదనపు కలెక్టర్ వై.వి.గణేష్**

నెల్లికుదురు. జూన్ 6, విజన్ ఆంధ్ర: నేత్ర అవయవ దానాలతో పాటు ఇతర సామాజిక సేవకు పాటుపడుతున్న సదాశయ ఫౌండేషన్ కు నెల్లికుదురు మండలం మేచరాజపల్లి కి చెందిన మన ఊరు–మన గుడి ట్రస్ట్ చైర్మన్, వరంగల్ జిల్లా సదాశివ ఫౌండేషన్ అధ్యక్షులు నాళ్ళ వేణుమాధవ్ నళినీ నారాయణ్ దంపతులు సౌండ్ సిస్టం వితరణ చేశారు. ఈ సందర్భంగా దాత వేణుమాధవ్ మాట్లాడుతూ.. సదాశయ సంస్థ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు శ్రవణ్ కుమార్ కోరిక మేరకు ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని వరంగల్ అదనపు కలెక్టర్



ఛాంబర్ లో అడిషనల్ కలెక్టర్ వై.వి.గణేష్ చేతుల మీదుగా సౌండ్ సిస్టం ను శ్రవణ్ కుమార్ ప్రభృతులకు అందజేసినట్లు తెలిపారు.

**వేణు మాధవ్ కు అదనపు కలెక్టర్ ప్రభృతుల అభినందన..**

గత 18 సంవత్సరాలుగా నేత్ర,శరీర అవయవ దానాలతో పాటు, పర్యావరణ పరిరక్షణ, రక్తదాన శిబిరాలు, ఉచిత వైద్య శిబిరాలు వంటి అనేక సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఒక మంచి సేవా సంస్థను ఎంచుకొని సౌండ్ సిస్టం ను వితరణ చేయడం పట్ల దాత వేణుమాధవ్ నళిని నారాయణ్ దంపతులను వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ వై.వి గణేష్ అభినందించారు. అడిషనల్ కలెక్టర్ తో పాటు శ్రవణ్ కుమార్, సంపత్ కుమార్ గ్రీన్ గిఫ్ట్ అందజేసి శాలువాతో సత్కరించారు. సంస్థ జాతీయ అధ్యక్షులు శ్రావణ్ కుమార్ తో పాటు ప్రధాన కార్యదర్శి లింగమూర్తి,వరంగల్ ఉమ్మడి జిల్లాల కో ఆర్డినేటర్ దళపతి, సలహాదారులు ప్రొ.లక్ష్మారెడ్డి,గౌరవ అధ్యక్షులు కె.పురుషోత్తం,హన్మకొండ జిల్లా అధ్యక్షులు శంకర్ రావు, ఉపాధ్యక్షులు ఆర్తి సంపత్ కుమార్ ,కె.రాంచంద్రారెడ్డి,వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమారస్వామిలు సౌండ్ సిస్టం వితరణ పట్ల హర్షం వ్యక్తం చేస్తూ దాత వేణు మాధవ్ నళిని నారాయణ్ దంపతులను ప్రశంసించారు.

## నీట్ పునః పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేయాలి

**- జిల్లా కలెక్టర్ దీపక్ తివారి**

వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 06 ( విజన్ ఆంధ్ర ) : జూన్ 21న నిర్వహించే నీట్ పున పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయం నుండి నీట్ పునః పరీక్ష, యోగా దినోత్సవం, వరి ధాన్యం సేకరణ, మహిళా సమాఖ్యల ద్వారా కొనుగోలు చేసిన బస్సులను ఆర్టీసీకి అద్దెకు ఇవ్వడం రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా పరేడ్ గ్రౌండ్ లో ప్రారంభోత్సవం, పాఠశాల విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ , ఆసుపత్రుల అభివృద్ధి సొసైటీ సమావేశాలు తదితర అంశాలపై ఉన్నతాధికారులతో కలిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. (వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడుతూ... జూన్ 21న నిర్వహించే పరీక్షను ఏంటిఏ ( నేషనల్ టెస్టింగ్



ఏజెన్సీ ) మార్గదర్శకాలకు అనుగుణంగా చేపట్టాలన్నారు. అందుకు అనుగుణంగా జిల్లాలోని (5) పరీక్షల కేంద్రాల్లో అన్ని సదుపాయాలు సమకూర్చుకోవాలని కలెక్టర్ అధికారులకు తెలిపారు. రుతుపవనాల ప్రభావంతో వర్షాలు రావడం వల్ల వరి ధాన్యం తడిసే ప్రమాదం ఉందని, దానికి తగ్గట్టుగా జాగ్రత్తలు తీసుకొని వరి ధాన్యాన్ని త్వరితగతిన మిల్లులకు, గోదాములకు చేరవేయాలని ఆయన పౌరసరఫరాల అధికారులను ఆదేశించారు. అవసరాలను బట్టి ట్రాన్స్ పోర్ట్ లారీల సంఖ్యను పెంచుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని మొత్తం 19 మండల మహిళా సమాఖ్యల ద్వారా 19 బస్సులను కొనుగోలు చేసి ఆర్టీసీకి అద్దెకు ఇవ్వడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ప్రతి నెల మహిళా సమాఖ్యలు స్థిరమైన ఆదాయం పొందుతూ మహిళల ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు అందిస్తుందని ఆయన తెలిపారు. జనవరి 9న పరేడ్ గ్రౌండ్ లో జరిగే రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యక్రమంలో భాగంగా అద్దె బస్సులను ప్రారంభించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే మహిళా సమాఖ్య సభ్యులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, త్రాగునీరు సదుపాయంతో పాటు ఆశా వర్కర్ ప్రతి బస్సులో ఉండే విధంగా చూసుకోవాలని కలెక్టర్ సూచించారు. కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఉమా శంకర్ ప్రసాద్, అదనపు కలెక్టర్ ( రెవెన్యూ ) కే వెంకటాచారి, డిఆర్డిఓ శ్రీనివాస్, జిల్లా పౌర సరఫరాల అధికారి సుదర్శన్, జిల్లా మేనేజర్ మోహన్ కృష్ణ, జిల్లా విద్యాధికారి మహమ్మద్ అబ్దుల్ ఘని, నీట్ సిటీ కోఆర్డినేటర్ కే.సాయి లత, చీఫ్ సూపరింటెండెంట్ డి.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## ట్రాన్స్‌జెండర్ సమాజ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్**

హన్మకొండ జిల్లా ప్రతినిధి జూన్ 6 ( విజన్ ఆంధ్ర ) : హనుమకొండ జిల్లాలో నివసిస్తున్న ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ సభ్యులకు గుర్తింపు, సంక్షేమ పథకాల అందుబాటు మరియు సామాజిక భద్రత కల్పించే ఉద్దేశంతో నిర్వహించిన ట్రాన్స్‌జెండర్ ఐడెంటిటీ కార్డుల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అర్హులైన ట్రాన్స్‌జెండర్ సభ్యులకు గుర్తింపు కార్డులను అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి విశ్వజ, ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ రాష్ట్ర అధ్యక్షురాలు ఓరుగంటి లైలా, రాష్ట్ర సలహాదారుడు ఇ.వి. శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ, ట్రాన్స్‌జెండర్ సమాజానికి కూడా సమాజంలోని ఇతరుల మాదిరిగానే సమాన హక్కులు, అవకాశాలు లభించాల్సిన అవసరం ఉందన్నారు. వారికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, విద్య, ఉపాధి, ఆరోగ్య సేవలు సులభంగా చేరేలా జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీకి సంబంధించిన సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి జిల్లా పరిపాలన ఎల్లప్పుడూ సహకరిస్తుందని హామీ ఇచ్చారు. ట్రాన్స్‌జెండర్ గుర్తింపు కార్డులు వారికి అధికారిక గుర్తింపును కల్పించడంతో పాటు వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందేందుకు ఎంతో



దోహదపడతాయని పేర్కొన్నారు. రాష్ట్ర సలహాదారుడు ఇ.వి. శ్రీనివాస్ రావు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ట్రాన్స్‌జెండర్ సమాజ సంక్షేమం కోసం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. ట్రాన్స్‌జెండర్‌లకు విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. సమాజంలోని ప్రతి ఒక్కరికీ సమాన గౌరవం, సమాన అవకాశాలు లభించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.అలాగే వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ సభ్యులకు రాజకీయ, సామాజిక రంగాలలో ప్రాధాన్యత కల్పిస్తూ జిల్లా కాంగ్రెస్ పార్టీలో కార్యదర్శి పదవి ఇవ్వడం అభినందనీయమని అన్నారు. ఇది ట్రాన్స్‌జెండర్ సమాజానికి మరింత ఆత్మవిశ్వాసాన్ని కల్పించడమే కాకుండా ప్రజా జీవితంలో వారి భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ సభ్యులు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలో సభ్యులుగా చేరి సామాజిక సేవా కార్యక్రమాలలో భాగస్వాములు కావడం సంతోషకరమని తెలిపారు.ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ రాష్ట్ర అధ్యక్షురాలు ఓ. లైలా మాట్లాడుతూ, ట్రాన్స్‌జెండర్‌ల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు కృతజ్ఞతలు తెలిపారు. గుర్తింపు కార్డుల పంపిణీ ద్వారా కమ్యూనిటీ సభ్యులకు ప్రభుత్వ పథకాల లబ్ధి మరింత సులభంగా అందుతుందని అన్నారు. ట్రాన్స్‌జెండర్‌ల సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం, ప్రజాప్రతినిధులు, సామాజిక సంస్థలు కలిసి పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ సభ్యులు రింషా, హనీ, జిల్లా సంక్షేమ శాఖ సిబ్బంది వెంకటరమణ, రవికృష్ణ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తూ ప్రభుత్వం మరియు జిల్లా యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రజల ఆశీస్సులు ఎమ్మెల్యే పై ఎప్పుడు ఉండాలి

**- మేయర్ ధర్ని మధుకర్**

**- ముగిసిన ఉచిత అంబలి పంపిణీ**

మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 06,(విజన్ ఆంధ్ర ) : మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ఆధ్వర్యంలో కొక్కిరాల రఘుపతి రావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పంపిణి చేసిన ఉచిత అంబలి కార్యక్రమం శనివారం ముగిసింది.ఈ ముగింపు కార్యక్రమానికి మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య మహేష్, పార్టీ పట్టణ అధ్యక్షులు తూముల నరేష్ హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మంచిర్యాల బస్టాండ్, మార్కెట్, ఐబీ చౌరస్తా, హమాలీవాడ, సిసిసి కార్నర్, శ్రీరాంపూర్ కాలనీ ఏరియాల్లో మరియు లక్సెట్టిపేట టౌన్ లో వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసిన ఉచిత అంబలి పంపిణీ కేంద్రాలను ముగింపు చెయ్యడం జరిగిందని అన్నారు.వేసవిలో ప్రజల దాహర్తిని తీర్చడానికి చల్లటి మినరల్ వాటర్ తోపాటు అంబలి పంపిణి చేయడంతో ప్రజలు ఎంతో సంతోషిస్తున్నారని అన్నారు. ప్రతి వేసవిలో ప్రజలకోసం ఆలోచిస్తు కొక్కిరాల రఘుపతి రావు ట్రస్ట్ పేరిట సేవా కార్యక్రమం చేపట్టడం హర్షించదగ్గ విషయమని అన్నారు.ప్రజల ఆశీస్సులు ఎమ్మెల్యే పై ఎల్లప్పుడూ ఉండాలని వారు కోరారు. అంబలి పంపిణీ కేంద్రాలను మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ లో 41రోజులు, లక్సెట్టిపేట్ మున్సిపాలిటీ పరిధిలోని ఉత్కూర్ చౌరస్తా వద్ద



37 రోజులు పంపిణీ చేయడం జరిగిందని పేర్కొన్నారు.ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు మంచిర్యాల నియోజకవర్గం అభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తున్నారని, మంచిర్యాల ప్రజల కోసం అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారని అన్నారు, ఈ అంబలి కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పిసిసి ఉపాధ్యక్షులు చిట్ల సత్యనారాయణ, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, సర్పంచ్లు, వార్డు మెంబర్లు, ప్రజాప్రతినిధులు నాయకులు, మహిళా నాయకురాలు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బడిఈడు పిల్లలు బడులో ఉండాలి

ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 6. విజన్ ఆంధ్ర : కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఆసిఫాబాద్ మండలం లోని పాడిబండ గ్రామ పంచాయతీ లోని వట్టివాగు



గ్రామంలో గ్రామ సర్పంచ్ ఆత్రం.ఈశ్వరి దీనకర్, పి ఏం ఆర్ సి ఏ సి ఏం ఓ పూర్కా ఉద్దవ్ ఆధ్వర్యంలో ఎస్ సి ఆర్ పి లు రాథోడ్ రవీందర్, కూద్మేత అనంత్ ఉపాధ్యాయులు కుమరం మాధవ్ రావ్ ఆచార్య జయశంకర్ బడి బాట కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులతో సమావేశం నిర్వహించడం జరిగింది కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఆసిఫాబాద్ ఆశ్రమ పాఠశాల బాలికలు స్కూల్ కాంప్లెక్స్, ఫరిది లో ఆచార్య జయశంకర్ బడి బాట కార్యక్రమంలో భాగంగా బడి బాట కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈసందర్బంగా ఏ సి ఏం ఓ పూర్కా ఉద్దవ్ విద్యార్థుల తల్లి తండ్రులతో మాట్లాడుతూ ఈవిద్య సంవంత్సరం లో తప్పకుండ బడి ఈడు పిల్లలు, మరియు బడి బయట పిల్లలు అందర్నీ ప్రభుత్వ ఆశ్రమ పాఠశాల ప్రభుత్వ గిరిజన ప్రాథమిక పాఠశాల లో అడ్మిషన్ చేయించాలని అదే విధంగా ప్రతి విద్యార్థి పాఠశాల లో ఉండే విధంగా మా ఉపాధ్యాయులు గ్రామాన్ని మ్యాపింగ్ చేసి ప్రతి ఇంటికి వచ్చి ప్రతి విద్యార్థి కీ పాఠశాల కు వచ్చే విదంగా కార్యక్రమం నిర్వహిస్తారని అంగన్వాడీ సెంటర్ లో ఉన్నా బడి ఈడు పిల్లలను నమోదు చేసుకుంటామని చెప్పారు ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన ఆంగ్ల మాద్యమంలో విద్యా అందిస్తుందని ఈసందర్బంగా విద్యార్థుల కు ఉచితంగాబి బిపాఠ్యపుస్తకాలు రెండు జతలు ఏకరూప దుస్తులు అందించడం జరిగింది అదే విధంగా ప్రభుత్వ పాఠశాల లో సన్నబియ్యం తో భోజనం మరియు అట పాటలతో విద్యా అందించడమే కాకుండా విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అన్ని విధాలా జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందని అదే విధంగా గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఆంగ్ల మాద్యమంలో విద్యను అందించి గిరిజన విద్యార్థుల కు మంచి భవిష్యత్తును అందిస్తున్నామన్నారు గిరిజన ప్రాథమిక పాఠశాల గిరిజన ఆశ్రమ పాఠశాల లో గిరిజన విద్యార్థుల భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందన్ని చెప్పారు కార్యక్రమం లో స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కుమరం మాధవరావ్, మాజీ ఏం పి టీ సి ఉయిక శంకర్, ఆత్రం దీనకర్, ఆత్రం వినోద్, ఉయిక జంగు, కొట్నాక్ సాగర్, అంగన్వాడీ లు పంచాయతీ సెక్రటరీ గ్రామస్తులు సిడాం కైలాష్ నైతం కైలాష్, ఆత్రం, యస్వంత్ రావ్,ఎస్ హెచ్ జి సంఘం సభ్యులు యూవత తదితరులు పాల్గొన్నారు

## పర్యావరణాన్ని రక్షించడం మన బాధ్యత

**- సర్పంచ్ గుగులోతు సుజాత వాసు**



నెల్లికుదురు. జూన్ 6, విజన్ ఆంధ్ర: పర్యావరణాన్ని పరిరక్షించడం మనందరి బాధ్యత అని సర్పంచ్ గుగులోతు సుజాత వాసు అన్నారు మండలంలోని సౌలతండ గ్రామపంచాయతీలో శనివారం జరిగిన పర్యావరణం పరిరక్షణ మరియు ప్రజా పాలనలో భాగంగా గ్రామ సర్పంచ్ గుగులోతు సుజాతవాసు గ్రామ సభకు అధ్యక్షత నిర్వహించారు. గ్రామసభలో ఎర్రబెల్లి గూడెం పి.హెచ్.సి డాక్టర్ రవళి దోమల నివారణ తలవ సేమియా మరియు మేనరకు పెళ్లిళ్ల గురించి వివరించగా ఏఈఓ ధరణిస్ పంట మార్పిడి ఆయిల్ ఫామ్ మరియు పచ్చి రొట్టె జిలుగులు ఎరువుల వాడకం తగ్గించడం గురించి తెలియజేయడం జరిగింది. అలాగే ఇరిగేషన్ ఏ ఈ ప్రణయ్ కుమార్ భూగర్భ జలాలు పెంపొందించడం ఇంకుడు గుంతల నిర్వహణ గురించి తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పేదలకు ప్రతి ఒక్క ప్రభుత్వ పథకాలు అందే విధంగా కృషి చేస్తానని అలాగే ప్రతి ఒక్కరూ భూగర్భ జలాలు మొక్కలు నాటడం గురించి అందరికీ అవగాహన కల్పించి ప్రతి ఒక్కరు ఒక మొక్క నాటాలని గ్రామ ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ

**- జిల్లా కలెక్టర్ కె.హరిత**

ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 6, విజన్ ఆంధ్ర : జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక ఉచిత నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె.హరిత ఒక ప్రకటనలో



తెలిపారు. లిజి ఎం ఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థలి సహకారంతో మార్కెట్ అవసరాలకు అనుగుణంగా జిల్లాలోని అర్హులైన నిరుద్యోగులకు హైదరాబాద్ లో 3 నెలల ప్రత్యేక ఉచిత నైపుణ్య శిక్షణ, ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పించడం జరుగుతుందని తెలిపారు. డ్రైవాల్ & ఫాల్స్ సీలింగ్ టెక్నీషియన్, వెల్డింగ్ & ఫ్యాబ్రికేషన్ టెక్నీషియన్, ఆటోమొబైల్స్ & టూవీలర్ టెక్నీషియన్, రిఫ్రిజిరేషన్ & ఎయిర్ కండిషన్ టెక్నీషియన్, అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, ఎక్స్కవేటర్ ఆపరేటర్, గెస్ట్ సర్వీస్ అసోసియేట్ (ఎఫ్ & బి), ఫ్రంట్ ఆఫీస్ ఎగ్జిక్యూటివ్ (యువతులకు మాత్రమే) కోర్సులు అందించడం జరుగుతుందని, అభ్యర్థులు 3 ఆధార్ కార్డు ప్రతులు, రేషన్ కార్డు, పాస్పోర్ట్ సైజు ఫోటో, విద్యార్హత ధ్రువపత్రాలు కలిగి ఉండాలని తెలిపారు. జైనూర్, సిర్పూర్ – యు, లింగాపూర్ మండలాలకు చెందిన అభ్యర్థులకు జైనూర్ మండల కేంద్రంలోని కె.ఆర్.కె. ఫంక్షన్ హాల్ లో ఈ నేల 9వ తేదీ ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు, కెరమెరి మండలానికి చెందిన అభ్యర్థులకు కెరమెరి మండల కేంద్రంలోని మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఈ నెల 9వ తేదీన మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు, తిర్యాణి మండలానికి చెందిన అభ్యర్థులకు తిర్యాణి మండల కేంద్రంలోని మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఈ నెల 10వ తేదీన ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు అర్హులైన నిరుద్యోగ యువతీ యువకుల నుండి దరఖాస్తుల స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా కార్యక్రమాన్ని రూపకల్పన చేయడం జరిగిందని, జిల్లాలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## మలబార్ గ్రూప్ ఆధ్వర్యంలో 'హంగర్ ఫ్రీ వరల్డ్' కార్యక్రమం

**-ప్రపంచ ఆకలి దినోత్సవం సందర్భంగా భోజనం పంపిణీ**



హైదరాబాద్, జూన్ 06 (విజన్ ఆంధ్ర) : ప్రపంచ ఆకలి దినోత్సవం సందర్భంగా మలబార్ గ్రూప్‌కు చెందిన 'హంగర్ ఫ్రీ వరల్డ్' కార్యక్రమం, ప్రతిరోజు భోజన పంపిణీ ద్వారా వీధి నిరాశ్రయులు, బలహీన వర్గాల జీవితాల్లో వచ్చిన మార్పులను వెల్లడించింది. థనల్ సంస్థ సహకారంతో అమలవుతున్న ఈ కార్యక్రమం ద్వారా లబ్ధిదారులకు ఆహారంతో పాటు వైద్య సహాయం, ఆశ్రయం, పునరావాసం, కుటుంబాలతో పునః కలయిక వంటి అవకాశాలు కల్పించినట్లు నివేదిక పేర్కొంది. ఈ సందర్భంగా మలబార్ గ్రూప్ చైర్మన్ ఎం.పీ.అహమ్మద్ మాట్లాడుతూ నిరంతరంగా అందించే ఒక భోజనం విశ్వాసాన్ని పెంపొందించి, పునరావాసం, ఆరోగ్య సేవలు, గౌరవప్రదమైన జీవితం పునరుద్ధరణకు మార్గం చూపుతుందని అన్నారు. ప్రస్తుతం ఈ కార్యక్రమం భారత్‌లోని 20 రాష్ట్రాలతో పాటు 9 దేశాల్లో అమలవుతూ, 1.43 లక్షల మందికి పైగా లబ్ధిదారులను చేరుకుందని తెలిపారు. ఆకలి నిర్మూలన, ఆరోగ్యం, విద్య, మహిళా సాధికారత వంటి రంగాల్లో మలబార్ గ్రూప్ తన సామాజిక బాధ్యత కార్యక్రమాలను కొనసాగిస్తోందని తెలిపారు.

## వరి కొనుగోలు ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలి..




సూర్యాపేట జూన్ 06:(విజన్ ఆంధ్ర) : జూన్ 9న హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్ లో నిర్వహించనున్న మండల మహిళా సమాఖ్య ఆర్టిసి బస్సుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అన్నారు.మరో రెండు రోజుల్లో రుతుపవనాలు తెలంగాణ రాష్ట్రాన్ని తాకనున్న నేపథ్యంలో జిల్లాలో వరి కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు కలెక్టర్లను అదేశించారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు వరి కొనుగోలు ప్రక్రియ, జూన్ 9న జరిగే మండల మహిళా సమాఖ్య సభ్యులకు ఆర్టీసీ బస్సుల ప్రారంభోత్సవ కార్యక్రమంపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అదనపు కలెక్టర్ బి హరి సింగ్ తో కలిసి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ హాజరయ్యారు. జిల్లాలోని అన్ని కొనుగోలు కేంద్రాల నుంచి తూకం వేసిన వడ్లు వెనువెంటనే లారీల్లో మిల్లులు, గోదాములకు తరలించాలన్నారు. రెండు మూడు రోజుల్లో కొనుగోలు ప్రక్రియ పూర్తి అయ్యే విధంగా చూడాలని సూచించారు.జూన్ 9వ తేదీన హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్ లో మండల మహిళా సమాఖ్యలకు ఆర్టీసీ బస్సుల పంపిణీ కార్యక్రమం జిల్లాల్లోని అన్ని బస్సులు ఆయా మండలాల నుంచి మహిళా సంఘాల సభ్యులను తీసుకొని సాయంత్రం 4 గంటల లోపల హైదరాబాద్ లోని పరేడ్ గ్రౌండ్ కి చేరుకునే విధంగా చూడాలని సూచించారు. మహిళలకు మార్గమధ్యలో భోజనాలు, తాగు నీరు, తదితర మౌలిక సదుపాయాలు కల్పించే విధంగా ప్రణాళికలు చేసుకోవాలన్నారు. నీట్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించాలని, కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎక్కడా కూడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అన్ని జాగ్రత్తలు పాటించాలన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జడ్పీ సీఈఓ శిరీష, డిఆర్డిఓ సన్యాసయ్య, డిపిఓ యాదగిరి, డీఏవో శ్రీధర్ రెడ్డి, డిఎం సివిల్ సప్లై శ్రీధర్ రెడ్డి, డిఎస్ఓ మోహన్ బాబు, డిఎంహెచ్ఓ వెంకట రమణ, ఆర్డిఓ వేణుమాధవ్, డీఈవో అశోక్, డిఐఇఓ సులోచన రాణి సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పండ్ల మార్కెట్ ప్రారంభో త్సవానికి తరలిన రైతులు




నారాయణపేట, జూన్ 6 (విజన్ ఆంధ్ర) : ముఖ్యమంత్రి చేతులమీదుగా అంతర్జాతీయ సమీకృత ,పండ్ల మార్కెట్ రంగారెడ్డి జిల్లా" కోయిడ" లో ప్రారంభోత్సవం చేస్తున్న సందర్భంగా నారాయణపేట నుండి రైతులు తరలి వెళ్లారు. వ్యవసాయ మార్కెట్ చైర్మన్ సదాశివారెడ్డి ఆధ్వర్యంలో 60 మంది రైతులు కార్యక్రమానికి బయలుదేరారు. ఇందులో భాగంగా మార్కెట్ కార్యదర్శి భారతి, మార్కెట్ సూపర్డెంట్ లక్ష్మణ్, భారతీయ కిసాన్ సంగ్ నాయకులు వెంకోబ, కమిటీ సభ్యులు,రైతులు మార్కెట్ డైరెక్టర్లు ,సిబ్బంది దడవైలు పాల్గొనగా నారాయణపేట జిల్లా నుండి వెంకోబా,అనంత్ రెడ్డి, శరణయ్య స్వామి ,శాస మూల బాలప్ప, ఆకుల వెంకటప్ప ,ప్రభు మీ స్కిన్ గౌడుగు లక్ష్మీనారాయణ, జాజాపురం లక్ష్మీకాంత్ తింగనోళ్ల బుగ్గప్ప, ఓబులాపురం మైపాల్ రెడ్డి, పగిడిమారి నరసింహారెడ్డి, శాసనపల్లి ఘన్ప శ్రీనివాస్, బాపనపల్లి రాము ,షేర్నపల్ల కూర రాములు ,వీరప్ప, వెంకటప్ప , దామరిగిద్ద సుభాష్ కురువ బాలప్ప మల్లేష్ గౌడ్ మరికల్ ఎల్లప్ప తదితర రైతులు ఉన్నారు.

## డబుల్ బెడ్ రూంలో లబ్ధిదారుల ఎంపికను పారదర్శకంగా నిర్వహించాలి

**- జిల్లా కలెక్టర్ దీపక్ తివారి**




వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 06 ( విజన్ ఆంధ్ర ) : డబుల్ బెడ్ రూమ్ ల లబ్ధిదారుల ఎంపికను పారదర్శకంగా చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ తెలిపారు. శనివారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో తాండూరు నియోజకవర్గంలోని డబుల్ బెడ్ రూమ్ ల ఎంపిక ప్రక్రియపై జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కే. వెంకటాచారి, తాండూర్ శాసనసభ్యులు బుయ్యని మనోహర్ రెడ్డి, హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాథోడ్ దశరథ సింగ్, మునిసిపల్ చైర్ పర్సన్ పట్లోళ్ల నీరజ బాల్ రెడ్డి ల సమక్షంలో రాండమైజేషన్ ద్వారా ఇండ్ల కేటాయింపు పై కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ... తాండూర్ నియోజక వర్గంలో డబుల్ బెడ్ రూముల నిమిత్తం 8333 దరఖాస్తులు వచ్చాయని , 1001 డబుల్ బెడ్ రూమ్ ల నిర్మాణాలు వివిధ దశలో ఉన్నాయన్నారు ప్రస్తుతం 581 ఇండ్లు లబ్ధిదారులకు కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ఇండ్ల కేటాయింపులు ఎలాంటి అవకతవకలు తావు ర్యాండమైజేషన్ ద్వారా లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని ఆయన తెలిపారు. ర్యాండమైజేషన్ ద్వారా ఎంపికైన లబ్ధిదారుల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హత ఉన్నట్లు అయితే మాత్రమే ఇండ్ల కేటాయింపు జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. అర్హత లేకుండా ఇండ్ల కేటాయింపు జరిగిందని తెలిసిన పక్షంలో ఫిర్యాదులను స్వీకరించి మరో దఫా విచారణ చేపడతామని కలెక్టర్ తెలిపారు.

# ఆహార పదార్థాల్లో కల్తీ ని నియంత్రించాలి

**- డా". పల్లెపాడు దామోదర్**



హన్మకొండ జిల్లా ప్రతినిధి జూన్ 6 ( విజన్ ఆంధ్ర ) : ఆహార పదార్థాల్లో కల్తీ ని నియంత్రించాలని దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి అధ్యక్షుడు డా. పల్లెపాడు దామోదర్ అన్నారు. అంతర్జాతీయ ఆహర నాణ్యతా పరిరక్షణ ఉత్సవాలు ప్రారంభం సందర్భంగా నేడు హన్మకొండ లోని వివిధ వ్యాపార సంస్థలు, హోటల్లు, సూపర్ మార్కెట్లలో వినియోగదారులను చైతన్యవంతులు చేసే కార్యక్రమంలో పల్లెపాడు దామోదర్ మాట్లాడుతూ, వంట నూనెలు, కారంపొడి అల్లం పేస్టు లలో ఆహార కల్తీ ఎక్కువగా జరుగుతున్నదని, వంట నూనెల్లో నాసిరకం నూనెల కల్తీ వలన గుండే సంబంధిత వ్యాధులు, కారం పొడి లో హానికరమైన రంగులు, తౌడిమల పొడి కల్తీ వలన క్యాన్సర్, ఉదర సంబంధిత వ్యాధులు, అల్లం పేస్ట్ లో అల్లం సగం మిగతా ఆలుగడ్డ పిండి ఉండటం పై డా. పల్లె పాడు దామోదర్ ఆందోళన వ్యక్తం చేశారు. వంట నూనెల్లో బ్లెండెడ్ అనుమతుల పేరిట నాసిరకం నూనెలను కలపడం, రిఫైన్డ్ డబల్ రిఫైండ్ పేరిట అధిక ధరలను వసూలు చేయడం పై వినియోగదారులు చైతన్యవంతులు కావాలని అన్నారు పల్లె పాడు దామోదర్ తెలిపారు. నేటి కార్యక్రమంలో పాల్గొన్న వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి మాట్లాడుతూ, నిత్యావసర సరుకులను అమ్మకం చేస్తున్న చేస్తున్న బహుల జాతి సంస్థలు తమ ఇష్టానుసారం ఎమ్మార్పీని ముద్రించి, మరొకవైపు 30% 40% గా డిస్కౌంట్ ఇవ్వడం మరియు ఒకటి కొంటే మరొకటి ఉచితం గా ప్రచారం చేస్తూ, వంట నూనెలను అధిక ధరలకు అమ్మకం చేస్తున్నాయని అన్నారు. 500 గ్రా. కారంపొడి ఒకటి ఉంటే మరొకటి ఉచితమని తెలుపుతూ నాసిరకం కల్తీ ఆహార పదార్థాలను అమ్ముతున్నాయని, కాబట్టి వినియోగదారులు డిస్కౌంట్లు, ఉచిత బహుమతులు పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఈ సందర్భంగా నేటి కార్యక్రమంలో పాల్గొన్న ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ బ్రహ్మాజీ మాట్లాడుతూ వినియోగదారులు చైతన్యవంతులై, ఆహారభారతల అమ్మకాల్లో కల్తీ పట్ల ఏమాత్రం అనుమానం వచ్చినా ఫిర్యాదు చేయాలని అన్నారు. నేడు వినియోగదారుల మండల ప్రతినిధులు ఇచ్చిన ఫిర్యాదులపై సత్వరమే చర్యలు చేపడతామని అన్నారు లేబరేటరీ కి పంపనున్నట్లు హామీ ఇచ్చారు. కొందరు అవగాహన లేని ఇంటర్నెట్ సెంటర్లు తాత్కాలిక ఫుడ్ లైసెన్స్ జారీ పేరిట ఇప్పటివరకు గత నెలలో "685" లైసెన్స్ లను జారీ అయినట్లు తెలిపారు. ఆన్లైన్ ఫుడ్ సప్లై గురించి జారీ చేసిన తాత్కాల్ ఫుడ్ లైసెన్సులలో అధికారుల ప్రమేయం లేకుండానే లైసెన్సు జారీపై వినియోగదారులు చైతన్యవంతులై ఆన్లైన్ ఆహార పదార్థాలను తెప్పించుకోవాలని తెలిపారు. సరైన లైసెన్సులు ఉన్నప్పుడే తమకు వచ్చిన ఫిర్యాదులపై చర్యలకు వీలవుతుందని ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ బ్రహ్మాజీ అన్నారు. ఇంకా నేటి కార్యక్రమంలో సి.సి.ఐ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రావుల రంజిత్ కుమార్, వినియోగదారుల మండలి రాష్ట్ర కమిటీ కార్యదర్శి నల్ల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# మరో రెండు రోజుల్లో రుతుపవనాలు రాష్ట్రాన్ని తాకనున్న నేపథ్యంలో జిల్లాలో వరి కొనుగోలు ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలి

**- జూన్ 9న హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్ లో నిర్వహించనున్న మండల మహిళా సమాఖ్య ఆర్టిసి బస్సుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి తగిన చర్యలు**

**- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు**



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 6 (విజన్ ఆంధ్ర): మరో రెండు రోజుల్లో రుతుపవనాలు తెలంగాణ రాష్ట్రాన్ని తాకనున్న నేపథ్యంలో జిల్లాలో వరి కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతంగా పూర్తి చేయాలని లిరాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావులి కలెక్టర్లను అదేశించారు. శనివారం, లిరాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావులి వరి కొనుగోలు ప్రక్రియ, జూన్ 9న జరిగే మండల మహిళా సమాఖ్య సభ్యులకు ఆర్టీసీ బస్సుల ప్రారంభోత్సవ కార్యక్రమంపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి లిఅదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.అనిల్ కుమార్ తొ కలిసి జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ హాజరయ్యారు. జిల్లాలోని అన్ని కొనుగోలు కేంద్రాల నుంచి తూకం వేసిన వడ్లు వెనువెంటనే లారీల్లో మిల్లులు, గోదాములకు తరలించాలన్నారు. రెండు మూడు రోజుల్లో కొనుగోలు ప్రక్రియ పూర్తి అయ్యే విధంగా చూడాలని సూచించారు. జూన్ 9వ తేదీన హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్ లో మండల మహిళా సమాఖ్యలకు ఆర్టీసీ బస్సుల పంపిణీ కార్యక్రమం జిల్లాల్లోని అన్ని బస్సులు ఆయా మండలాల నుంచి మహిళా సంఘాల సభ్యులను తీసుకొని సాయంత్రం 4 గంటల లోపల హైదరాబాద్ లోని పరేడ్ గ్రౌండ్ కి చేరుకునే విధంగా చూడాలని సూచించారు. మహిళలకు మార్గమధ్యలో భోజనాలు, తాగు నీరు, తదితర మౌలిక సదుపాయాలు కల్పించే విధంగా ప్రణాళికలు చేసుకోవాలన్నారు. నీట్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించాలని, కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎక్కడా కూడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అన్ని జాగ్రత్తలు పాటించాలన్నారు. యోగా డేను నిర్వహించాలని, పిల్లలకు యూనిఫాంలు త్వరగా కుట్టించాలని, సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డిఆర్ఓ నాగలక్ష్మి, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, డీఎస్ఓ రమేష్, డీఎం సివిల్ సప్లై నరసింహారావు, ఇంటర్మీడియట్ అధికారి మదర్,ఇతర సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పరిసరాలను పరిశుద్ధత పాటించాలి

**- జిల్లా కలెక్టర్ ప్రియాంక**

మరికల్, జూన్ ,6 (విజన్ ఆంధ్ర) : గ్రామంలో ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రత పాటించాలని వర్షాకాలంలో వ్యాధుల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని మొక్కలు నాటడం ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా వాతావరణం కాపాడాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక అన్నారు శనివారం మరికల్ మండలం పెద్ద చింతకుంట గ్రామ పంచాయతి ఆవరణలో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామ సభ నిర్వహించారూ ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా మండల స్థాయి అధికారులు రోడ్డు భద్రత వర్షాకాలం నేపథ్యంలో ఇంకుడు గుంతలు ఏర్పాటు పరిసరాల పరిశుభ్రత సాలిడ్ వేస్ట్ మరియు జల సంరక్షణ పాఠశాలలో సౌకర్యాలు సహా తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు సాలిడ్ వేస్ట్ మెరిట్ లో భాగంగా తడి పొడి చెత్త సుప్రీంకోర్టు గైడెన్స్ ప్రకారం తడి పొడి చెత్త తో పాటు శానిటరీ మెడికల్ వేస్ట్ చెత్తతో ఇండ్లలో పొగ అయ్యే నాలుగు రకాల నిలువ చేసే విషయాలలో సర్పంచులు కార్యదర్శులు ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని అన్నారు ఉపాధి హామీ పథకంలో ఇంకుడు గుంతలు నిర్మాణం చేపట్టాలి ప్రతిరోజు మురుగు నీరు శుభం చేయాలన్నారు గ్రామస్తులకు ఎస్ఐఆర్ పట్ల సంపూర్ణ అవగాహన అవసరమన్నారు కొత్త ఓటరు నమోదు చేయాలని గతంలో గ్రామంలో నివాసం ఉండి ప్రస్తుతం వేరే గ్రామంలో వెళ్లినవారు చనిపోయిన ఓటులను తొలగించడం జరుగుతుందన్నారు ఈ ప్రక్రియ ఈ నెల 25 నుండి ప్రారంభిస్తామనరు కొత్త ఓటరు జాబితాలో ఆ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఉంటాయని ఏమైనా అభ్యంతరాలు ఉంటే అధికారులకు తెలియజేయాలన్నారు మన ఓటర్ల సంఖ్య అనుసంధానం చేయాల్సి ఉంటుందన్నారు అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు కార్యక్రమంలో జడ్పీ సీఈఓ శ్రీనివాసరావు డిఆర్డిఓ వెంకట్రాములు డిపిఓ సుధాకర్ రెడ్డి తహసిల్దార్ రామకోటి ఎంపీటీవో పృథ్వీరాజ్ ఎంపీ ఓ పావని సర్పంచ్ తిరుపతమ్మ కార్యదర్శి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.


# కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లుల చెల్లింపు పై ఈనెల 18న చలో హైదరాబాద్



హనుమకొండ జిల్లా ప్రతినిధి జూన్ 6 (విజన్ ఆంధ్ర ): రాష్ట్రవ్యాప్తంగా కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లుల చెల్లింపు జాప్యాన్ని నిరసిస్తూ ఈనెల 18న చలో హైదరాబాద్ మహాసభను విజయవంతం చేయాలని బిల్డర్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ వేములు సత్యమూర్తి పిలుపునిచ్చారు. శనివారం హనుమకొండ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న కాంట్రాక్టర్ల బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ, పెండింగ్ లో ఉన్న కాంట్రాక్టర్ల బిల్లులను ఎటువంటి ప్రభావాలు, సిఫారసులు లేకుండా, వివక్ష లేకుండా క్రమసంఖ్య ఆధారంగా చెల్లించాలని, ముందుగా పనులు చేసి, సంవత్సరాలుగా బిల్లుల కోసం ఎదురు చూస్తున్న కాంట్రాక్టర్ లకు ప్రాధాన్యత ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వానికి అనేక మార్లు వినతి పత్రాలు సమర్పించిన నిమ్మకు నిరుత్తినట్టే వ్యవహరిస్తున్నారన్నారు. ఆర్థిక ఇబ్బందులవల్ల, బిల్లుల చెల్లింపులు ఆలస్యం కారణంగా అనేకమంది కాంట్రాక్టర్లు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, కొందరు ఆత్మహత్యలకు పాల్పడగా మరికొందరు గుండెపోటులకు గురవుతున్నారన్నారు. ఈ పరిస్థితి నిర్మాణరంగం భవిష్యత్తుకు తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. కాంట్రాక్టర్లు మాత్రమే కాదు కాంట్రాక్టు పనులపై ఆధారపడి జీవిస్తున్న వేలాది మంది ఉద్యోగులు, ఇంజనీర్లు, సూపర్వైజర్లు, అకౌంటెంట్లు, యంత్రాల ఆపరేటర్లు, డ్రైవర్లు, కార్మికులు, నిర్మాణ సామాగ్రి సరఫరాదారులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఇది కేవలం కాంట్రాక్టర్ల సమస్య మాత్రమే కాదు, నిర్మాణరంగంపై ఆధారపడి జీవిస్తున్న లక్షల మంది కుటుంబాలకు సంబంధించిన అత్యంత కీలకమైన సమస్యని అని,దీనిని వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జూన్ 18న హైదరాబాద్ లో నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమంలో అధిక సంఖ్యలో కాంట్రాక్టర్లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ స్టేట్ చైర్మన్ బి. సుగుణాకర్ రావు , మాజీ స్టేట్ చైర్మన్ కటుకూరి దేవేందర్ రెడ్డి , మాజీ స్టేట్ చైర్మన్ యూ. సురేందర్ , స్టేట్ అడ్వైసర్ కె. ప్రభాకర్ రెడ్డి, జనగాం సెంటర్ పాస్ట్ చైర్మెన్ ఇమ్మడి దేవేందర్ రెడ్డి, వరంగల్ సెంటర్ చైర్మెన్ ఈ. మనోజ్ , జిల్లా నాయకులు,వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ గౌడ్, ఆదిల్,యాదవరెడ్డి, సతీష్, తోట రాజేష్,తదితరులు పాల్గొన్నారు.

## నోటి అనారోగ్యం చర్మ సమస్యలకు కారణం

**-ప్రముఖ ఆరోగ్య నిపుణురాలు డా.సోనియా దత్తా**



హైదరాబాద్, జూన్ 06 (విజన్ ఆంధ్ర) : నోటి ఆరోగ్యం, చర్మ సమస్యల మధ్య సన్నిహిత సంబంధం ఉందని ప్రముఖ ఆరోగ్య నిపుణురాలు డా.సోనియా దత్తా తెలిపారు. నోటి పరిశుభ్రత లోపించడం వల్ల బ్యాక్టీరియా పెరిగి శరీరంలో వాపు(ఇన్ఫ్లమేషన్) ఏర్పడుతుందని, ఇది మొటిమలు, కాంతిహీనత వంటి చర్మ సమస్యలకు దారితీయవచ్చని పేర్కొన్నారు. చర్మ సమస్యలను కేవలం పైపూత మందులతో నియంత్రించడంపై కాకుండా, నోటి ఆరోగ్యాన్ని మెరుగు పరచడంపైనా దృష్టి పెట్టాలని ఆమె సూచించారు. క్రమం తప్పకుండా దంతాలను శుభ్ర పరచుకోవడం, చిగుళ్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ద్వారా శరీర సమతుల్యత మెరుగుపడి చర్మ ఆరోగ్యానికి కూడా తోడ్పడుతుందని చెప్పారు. ఆయుర్వేద వనమూలికలు కలిగిన డాబర్ రెడ్ టూత్ పేస్ట్ వాడడం వల్ల దంత సంరక్షణ మెరుగు పడుతుందని శాస్త్రీయ ఆధారాల్లో తేలిందని తెలిపారు.

## అనాథ బాలికలకు నేరుగా పాలిటెక్నిక్ లో ప్రవేశం

నారాయణపేట , జూన్ 6 ( విజన్ ఆంధ్ర) :అనాథలు, తల్లిదండ్రులను కోల్పోయిన బాలికలు ఆర్థికంగా బలహీన వర్గాలకు చెందిన బాలికలకు ఎటు వంటి ప్రవేశ పరీక్ష లేకుండానే నేరుగా పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తు న్నట్లు జిల్లా సంక్షేమ అధికారి ఎల్. రాజేందర్ గౌడ్ తెలిపారు. హైదరాబాద్‌లోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహి ళా పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్న డిప్లొమా ఇన్ సివిల్ ఇంజినీరింగ్, డిప్లొమా ఇన్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రా నిక్స్ ఇంజినీరింగ్, డిప్లొమా ఇన్ కంప్యూటర్ ఇంజినీరిం గ్, డిప్లొమా ఇన్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజి నీరింగ్, డిప్లొమా ఇన్ సీపీ కండక్టర్ టెక్నాలజీ, డిప్లొమా ఇన్ ల్యాండ్ సర్వేయింగ్ తదితర కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నట్లు తెలిపారు.2026-27 విద్యా సంవత్స రంలో పదవ తరగతి పూర్తి చేసిన అర్హత కలిగిన బాలిక లు ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలని సూచించారు. ఎంపికైన విద్యార్థినులకు ఫీజు, వసతి, భోజన సౌకర్యాలు పూర్తిగా ఉచితంగా అందించబడతా యని తెలిపారు. దరఖా స్తుదారులు తల్లిదండ్రుల మరణ ధృవీకరణ పత్రం (అనాథలకు), హోమ్ హాస్టల్ బోనాఫైడ్ సర్టిఫికేట్, కుల ధృవీకరణ పత్రం, పదవ తరగతి మార్కుల మెమో, స్టడీ సర్టిఫికేట్ రెండు పాస్ పోర్ట్ సైజు ఫోటోలతో ఈ నెల 8వ తేదీ లోపు జిల్లా మహి ళా శిశు సంక్షేమ శాఖ కార్యాలయం, నారాయణ పేటలో దరఖాస్తు చేసుకో వాలని తెలిపారు.

## ఉచిత మెగా క్యాన్సర్, గైనకాలాజీ, శస్త్ర చికిత్స, శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి.



నారాయణపేట, జూన్ 6 (విజన్ ఆంధ్ర) : లయన్స్ క్లబ్ అఫ్ నారాయణ పేట్, గీత మల్టి స్పెషాలిటి హాస్పిటల్ మరియు క్యాన్సర్ హాస్పిటల్ మహబూబ్ నగర్ వారి ఆధ్వర్యంలో ఈనెల 10వ తేది బుధవారం రోజు ఉదయం 9గంటలనుండి మధ్యాహ్నం 3గంటలవరకు పట్టణంలోని గీత మల్టిస్పెషాలిటి హాస్పిటల్ లొ నిర్వహించే ఉచిత మెగా క్యాన్సర్ స్క్రినింగ్ తోపాటు గైనకాలజి శస్త్ర చికిత్స శిభీరాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ క్లబ్ పాస్ట్ గవర్నర్ హరి నారాయణ్ బట్టడ్ ప్రముఖ శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ గీత విశ్వనాథ్ కోరారు ఈశిభిరంలో రక్త పరీక్షలు గర్భశయ క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్,బోన్ స్క్రినింగ్ టెస్ట్ గైనకాలజీ శస్త్ర చికిత్స ఒపిడి ఉచితంగా చూడబడునని తెలిపారు ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు సరిత బట్టడ్ గీత మల్టి స్పెషాలిటి హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గీత ప్రముఖ ల్యాప్రో స్కోపిక్ శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ విశ్వనాథ్ లయన్స్ క్లబ్ కార్యదర్శి సాయినాథ్ సదానంద్ చారి సురేందర్ చారి తదితరులు పాల్గొన్నారు.


## ఊట్కూర్ లో 19 మీ.మీ వర్షపాతంనమోదు.

**- ముమ్మరంగాసాగుతున్నఖరీఫ్ సీజన్ పనులు.**



ఊట్కూర్, జూన్ 6 (విజన్ ఆంధ్ర) : ఊట్కూర్ మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ముమ్మరంగా ఖరీఫ్ సాగుపనులు కొనసాగుతున్నాయి. మండలంలో వారం రోజుల్లో మూడుసార్లు వర్షాలు కురవడంతో పలువురు రైతులు పత్తి విత్తనాలుపెట్టారు. ఊట్కూర్ మండలంలో శుక్రవారం రాత్రి19.0 మీ మీ వర్షపాతం నమోదైనట్లు ఏవో గణేష్ రెడ్డి, ఏ ఎస్ ఓ చేతన్ తెలిపారు. వర్షం కురవడంతో వానాకాలం పంటపై రైతులు గంపెడాశతో వ్యవసాయ పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. దుక్కులు దున్ని పొలాలు చదును చేసుకున్న రైతులు పత్తి విత్తనాలు పెట్టేందుకు పరుగులు తీస్తున్నారు. మండలంలోని 23 గ్రామపంచాయతీలలో గత ఏడాది 40, వేల ఎకరాల్లో పత్తిపంట సాగుచేయగా అధిక వర్షాలకు పత్తి పంట దెబ్బతిని రైతులు నష్టాలు, చవిచూశారు. ఈ ఏడాదైనా పత్తి పంట పండి తమ అప్పులు తీరుతాయని ఆశతో విత్తనాలు తీసుకువచ్చి తమ పొలాల్లో పెడుతున్నారు. అడపాదడప కురుస్తున్న వర్షాల కారణంగా పంటలపై అన్నదాతలు ఎంతో ఆశతో సాగు పనులు చేపడుతున్నారు. మండలంలో నల్లరేగడి ఎర్ర భూములు ఉండడంతో పత్తి పంటకు అనువుగా ఉంటుందని రైతులు ఈ పంటపై ఆసక్తి చూపుతున్నారు. దీంతో ఎరువులు విత్తనాల దుకాణాలు రైతులతో కిటకిటలాడుతున్నాయి.

## ఘనంగా మాజీ మార్కెట్ చైర్మన్ జన్మదిన వేడుకలు



నారాయణపేట, జూన్ 6 (విజన్ ఆంధ్ర) : మక్తల్ వ్యవసాయ మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ పి నరసింహగౌడ్ జన్మదినాన్ని పురస్కరించుకొని శనివారం మహబూబ్ నగర్ పట్టణంలోని మాజీ మంత్రివర్యులు శ్రీనివాస్ గౌడ్ నివాసంలో జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా వారిని మాజీ మంత్రి డాక్టర్ శ్రీనివాస్ గౌడ్ డాక్టర్ లక్ష్మారెడ్డి మక్తల్ మాజీ శాసనసభలు చిట్టెం రామ్మోహన్ రెడ్డి మాజీ పార్లమెంటు సభ్యుడు మన్యం శ్రీనివాసరెడ్డి షాద్ నగర్ మాజీ శాసనసభ్యులు అంజయ్య యాదవ్ దేవరకద్ర మాజీ శాసనసభ్యులు ఆల వెంకటేశ్వర్ రెడ్డి రాష్ట్ర కార్పొరేషన్ మాజీ రెండు తదితరులు వారిని శాలువాతో సన్మానించి స్వీట్స్ తినపెట్టి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ వారిని ఆశీర్వదించడం జరిగింది భవిష్యత్తులో ప్రజా జీవితంలో ప్రజల మనల్ని పొందడం కోసం ప్రజా సమస్యల పైన రాజులేని పోరాటం చేయాలని ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని రాజకీయంగా ఎదగాలని వారు మరోసారి మనసారా ఆశీర్వాదం ఇచ్చారు.

# వైరస్ సోకిన వీధి కుక్కలకు ప్రత్యేక చికిత్సలు..

**- బ్లూ క్రాస్ పర్యవేక్షణలో 1 94 కుక్కలకు వైద్య సేవలు..**

**- మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత..**

సూర్యాపేట జూన్ 06:(విజన్ ఆంధ్ర) : వైరస్ సోకిన వీధి కుక్కలను గుర్తించి చికిత్సలు అందించేందుకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించినట్లు మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత అన్నారు.శనివారం జిల్లా కేంద్రంలోని 25 వ వార్డు ముత్యాలమ్మ గుడి సమీపంలోబ్లూ క్రాస్ ఆఫ్ హైదరాబాద్ షెల్టర్ డైరెక్టర్, సి.ఎఫ్.ఓ ఎన్.ఎస్.కె కుమారి,బ్లూ క్రాస్ వ్యవస్థాపకురాలు అక్కినేని అమల ఆదేశాల మేరకు సూర్యాపేట జిల్లా బ్లూ క్రాస్ వాలంటీర్ ఆధ్వర్యంలో వైరస్ సోకిన కుక్కలకు వైద్య చికిత్సలు ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల మెంజ్ వైరస్ సోకి చర్మవ్యాధులతో బాధపడుతున్న వీధి కుక్కల చికిత్సకు బ్లూ క్రాస్ ఆఫ్ హైదరాబాద్ వ్యవస్థాపకులు అక్కినేని అమల వీధి కుక్కల చర్మవ్యాధులు,ప్రజల్లో నెలకొన్న ఆందోళనపై స్పందించి వైరస్ సోకిన కుక్కలకు వైద్య చికిత్సలు అందించేందుకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టినందుకు అభినందనీయమన్నారు.పట్టణంలో ఇప్పటివరకు 194 వైరస్ సోకిన కుక్కలను గుర్తించినట్లు తెలిపారు. వాటి చికిత్స కోసం సుమారు రూ.1.80 లక్షల విలువైన ఇంజెక్షన్లు, మందులను అమల హైదరాబాద్ నుంచి సూర్యాపేటకు పంపించారని జిల్లా బ్లూ క్రాస్ వాలంటీర్,కాంగ్రెస్ నాయకుడు నరేందర్ నాయుడు ఈ మందులను జిల్లా కేంద్రానికి తీసుకువచ్చారు. హైదరాబాద్‌కు చెందిన బ్లూ క్రాస్ వాలంటీర్లు లాలు,



నరేష్ ప్రత్యేక వైద్య బృందంతో కలిసి కుక్కలకు చికిత్సలు అందించేందుకు సూర్యాపేటకు చేరుకున్నారని తెలిపారు. శనివారం నుంచి పట్టణంలోని 48 వార్డులలో వైరస్ సోకిన కుక్కలను గుర్తించి దశలవారీగా వైద్య చికిత్సలు అందించనున్నట్లు తెలిపారు.ఇటీవల బ్లూ క్రాస్ బృందం ప్రత్యేక వలల సహాయంతో చర్మవ్యాధులతో బాధపడుతున్న కుక్కలను పట్టుకుని వాటి రక్త నమూనాలను సేకరించి పరీక్షా ఫలితాల ఆధారంగా తదుపరి కార్యాచరణ చేపడతామని పేర్కొన్నారు. ప్రస్తుతం బాధిత కుక్కలకు అవసరమైన వ్యాక్సిన్లు, మందులు అందజేస్తూ చికిత్స కొనసాగిస్తున్నట్లు తెలిపారు.వీధి కుక్కలను ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలించడం సమస్యకు శాశ్వత పరిష్కారం కాదని, జంతు జనన నియంత్రణ కార్యక్రమాలు, రేబిస్ నిరోధక టీకాలు, వైద్య చికిత్సల ద్వారానే సమస్యను సమర్థవంతంగా నియంత్రించవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో కమిషనర్ సి.హెచ్. హన్మంతరెడ్డి,వైస్ ఛైర్మన్ షఫీ ఉల్లా,మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్,వార్డు కౌన్సిలర్ కోడి శిరీష శివ, నాయకులు గుంటి సైదులు, అక్కినపల్లి జానయ్య , యాట వెంకన్న,పొలాగాని కృష్ణ,నరేందర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# హోమియో ఔషాదలా వాడకాన్ని పెంచి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

**- కాకర్ల లో మాస్టర్ ఈకే హోమియో వైద్య శిబిరం.**

**- హోమియో పతి వైద్యులు డా రాధాకృష్ణమూర్తి.**

**- ఉచితంగా మందులు పంపిణీ**

జూలూరుపాడు జూన్ 7 (విజన్ ఆంధ్ర ) జూలూరుపాడు మండల పరిధి కాకర్ల గ్రామంలో మాస్టర్ ఈకే శతాబ్ది సందర్భంగా మాస్టర్ ఈకే ఆధ్యాత్మిక సేవా సంస్థ కొత్తగూడెం వారి ఆధ్వర్యంలో ఉచిత హోమియో వైద్య సేవ శిబిరాన్ని శనివారం ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరంలో గ్రామంలోని దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న సుమారు 130 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి హోమియో మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ మందులను రోగులకు వ్యాధి నియంత్రణలోకి వచ్చేవరకు ఉచితంగా పంపిణీ చేయటం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా హోమియో డాక్టర్స్ జి రాధాకృష్ణమూర్తి, టీ రవికాంత్ లు మాట్లాడుతూ ప్రస్తుత ఆధునిక యుగంలో, మారిన ఆహారపు అలవాట్లు అనేక రకాల ఆరోగ్య సమస్యలకు ప్రధాన కారణం అన్నారు. దానితోపాటు ఆరోగ్య సమస్యల నివారణకు మనం వాడుతున్న ఇంగ్లీష్ మందుల వలన ఇతర ఆరోగ్య



సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని తెలిపారు. కాబట్టి మన ఆహారపు అలవాట్లు మార్చుకోవడంతోపాటు ఇంగ్లీష్ మందుల వాడకాన్ని తగ్గించి హోమియో మందులు వాడడం వలన ఆరోగ్యంతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలు దరిచేరే అవకాశం ఉండదని తెలిపారు. కావున ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉన్నవారైనా నిర్భయంగా హోమియో మందులను వాడుకోవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖాదరేంద్రబాబు, కే శ్రీనివాసరెడ్డి, పిఎస్ఎస్ మూర్తి, పి శ్రీధరరావు, టీ ధనలక్ష్మి, కోటేశ్వరరావు, కరుణ, వీరమల్లు, సిహెచ్ శ్రీమన్నారాయణ, గ్రామస్తులు రాచబంటి వెంకటనరసయ్య, కళ్యాణం వెంకటప్పయ్య, గోగుల వెంకటేశ్వర్లు, సున్నం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# నీట్ పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

నిజామాబాద్, జూన్ 06 :( విజన్ ఆంధ్ర) ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నీట్ పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అన్నారు. నీట్ (యూజీ)-2026 పునఃపరీక్ష నిర్వహణకు సంబంధించి ఢిల్లీ నుంచి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ తెలంగాణ ఇన్చార్జి అభిషేక్ సింగ్, హైదరాబాదు నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా వారు




మాట్లాడుతూ, నీట్ పరీక్ష దేశ వ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న అత్యంత కీలకమైన పరీక్ష అని పేర్కొన్నారు. గతంలో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో, ఈసారి నీట్ పరీక్ష నిర్వహణలో గోప్యత, భద్రత, పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రశ్నపత్రాల రవాణా, భద్రపరిచే ప్రక్రియ, పరీక్షా కేంద్రాల నిర్వహణ తదితర అంశాల్లో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 2.95 లక్షల మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారని, 208 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల్లో ఎక్కువ సంఖ్యలో కేంద్రాలు ఉన్నందున ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ ధృవీకరణ పరికరాలు, విద్యుత్, తాగునీరు, వైద్య సదుపాయాలు తదితర ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. అభ్యర్థుల గుర్తింపు ప్రక్రియను కట్టుదిట్టంగా అమలు చేయడంతో పాటు పరీక్షా కేంద్రాల వద్ద శాంతిభద్రతల పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం రబీలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సీ.ఎస్ సమీక్ష జరిపారు. నిజామాబాద్ తదితర జిల్లాల్లో ధాన్యం సేకరణ పూర్తయిందని, మిగిలిన జిల్లాల్లో కూడా రెండు రోజుల్లో పూర్తి చేయాల్సిందిగా సిఎస్ ఆదేశించారు.

మహిళా స్వయం సహాయక సంఘాలకు ఈ నెల 9న హైదరాబాద్ లోని పరేడ్ గ్రౌండ్ లో ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఆర్టీసీ అద్దె బస్సులను పంపిణీ చేయడం జరుగుతుందని, అన్ని జిల్లాల నుంచి ఈ కార్యక్రమంలో సంఘాల సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొనేలా చూడాలన్నారు. మహిళా సంఘాల సభ్యుల ద్వారా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫార్మ్ త్వరగా కుట్టించి ఇచ్చేలా చూడాలని సూచించారు. ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత శాఖల జిల్లా అధికారులతో కలిసి వీసీ లో పాల్గొన్న కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, నీట్ పరీక్షను జిల్లాలో సజావుగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులందరూ సమన్వయంతో పని చేయాలన్నారు. ఈ నెల 9న మహిళా సంఘాలకు హైదరాబాదులో జరిగే బస్సుల పంపిణీ కార్యక్రమంలో జిల్లా నుంచి బయలుదేరే సభ్యులకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ భుజంగరావు, డిఆర్డిఓ సాయన్న, డీఎవో వీరస్వామి, పౌర సరఫరాల శాఖ అధికారి శ్రీకాంత్ రెడ్డి, సివిల్ సప్లైస్ డీఎం ప్రవీణ్, జిల్లా సహకార శాఖ అధికారి శ్రీనివాస్, నీట్ పరీక్ష కేంద్రాల నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ వ్యర్థాల నిర్మూలనలో సూర్యాపేట మున్సిపాలిటీకి రాష్ట్రస్థాయి గౌరవం..

**- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

సూర్యాపేట జూన్ 06:(విజన్ ఆంధ్ర) : ప్లాస్టిక్ వ్యర్థాల నిర్మూలనలో సూర్యాపేట మున్సిపాలిటీ రాష్ట్రస్థాయిలో విశేష గౌరవాన్ని దక్కించుకుందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డులో నిర్వహించిన వార్డు సభలో జిల్లా ఎస్పీ నరసింహ, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మిదితో కలిసి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణ ప్రగతి, పారిశుధ్యం, ఓటరు నమోదు తదితర అంశాలపై ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడారు. సూర్యాపేటను ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీగా మార్చేందుకు వినూత్న ప్రయోగాలు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. పట్టణంలో సేకరించిన ప్లాస్టిక్ వ్యర్థాల నుండి ఇటుకలను తయారు చేస్తూ, దీనిని నిరంతరం కొనసాగే ఒక స్థిరమైన వ్యవస్థగా మార్చడం శుభపరిణామమని కొనియాడారు. ప్రజల భాగస్వామ్యం, శానిటేషన్ (పారిశుధ్య) సిబ్బంది కష్టం వల్లే ఈ విజయం సాధ్యమైందని ఆయన అభినందించారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం దేశంలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ చట్టం అమల్లోకి వచ్చిందని కలెక్టర్ గుర్తుచేశారు. ఈ నిబంధనల ప్రకారం తడి చెత్త మరియు పొడి చెత్తను విడివిడిగా సేకరించాలని, వీటితో పాటు శానిటరీ వేస్ట్ కూడా వేరు చేయాల్సిన అవసరం ఉందన్నారు. బయో మెడికల్ వ్యర్థాలను ప్రత్యేకంగా విభజించాలనే రూల్స్ వచ్చాయి.ఈ నియమాలను పక్కాగా అమలు చేయడంలో సూర్యాపేట మున్సిపాలిటీ రాష్ట్రంలోనే ముందు వరుసలో ఉందని, భవిష్యత్తులో పారిశుధ్య విభాగంలో మరిన్ని జాతీయ, రాష్ట్ర స్థాయి అవార్డులు సాధిస్తుందనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. వార్డుల్లోని ప్రతి సమస్యను పరిష్కరిస్తామని కలెక్టర్ ప్రజలకు హామీ ఇచ్చారు. పట్టణంలో ఇబ్బందిగా మారిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) సమస్యపై ఆయన తీవ్రంగా స్పందించారు. సంబంధిత ఏజెన్సీ అధికారులను పిలిపించి, పనులు త్వరగా పూర్తి చేయాలని, లేదంటే కఠిన చర్యలు ఉంటాయని స్ట్రాంగ్ వార్నింగ్.ఇచ్చినట్లు కలెక్టర్ వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన “99 రోజుల ప్రజా పాలన ప్రగతి నివేదిక“ కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ



పథకాలపై ప్రజల్లో విస్తృతంగా చైతన్యం కల్పిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ప్రజలకు అత్యంత ఆవశ్యకమైన విద్య, వైద్యం, శాంతి భద్రతల పరిరక్షణ, మహిళా అభివృద్ధి మరియు సంక్షేమ పథకాలను అధికారులు నేరుగా గ్రామాలు, మండలాలు, మున్సిపాలిటీల్లోని ప్రజల వద్దకే తీసుకెళ్తున్నారని చెప్పారు. ప్రజలతో మమేకమై ప్రభుత్వ పథకాలను ముందుకు తీసుకెళ్లేందుకు యంత్రాంగం శ్రమిస్తోందని పేర్కొన్నారు.కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో ప్రస్తుతం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. అర్హత ఉన్న ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం సాగుతోందని, ప్రజలందరూ ఈ స్పెషల్ రివిజన్‌కు పూర్తి స్థాయిలో సహకరించి తమ పేర్లను నమోదు లేదా సవరణలు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.

**మహిళల భద్రతకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు: జిల్లా ఎస్పీ నరసింహ**

రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమానికి, భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఎక్కడైనా మహిళల రక్షణకు ఇబ్బందులు ఎదురైతే పోలీస్ శాఖ ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోదని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ స్పష్టం చేశారు. మహిళల వేధింపులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, వరుసగా నేరాలకు పాల్పడితే అలాంటి వారిపై రౌడీ షీట్ ఓపెన్ చేసి ప్రత్యేక నిఘా ఉంచుతామని ఆయన హెచ్చరించారు.ప్రస్తుత సమాజంలో నేరాల సంఖ్య పెరుగుతుండటమే కాకుండా, వాటి స్వరూపం కూడా మారుతోందని ఎస్పీ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం మహిళలను ప్రత్యక్షంగానే కాకుండా, సోషల్ మీడియా వేదికగా పరోక్షంగా వేధింపులకు గురిచేస్తూ ఇబ్బందులు పెడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి సైబర్ వేధింపుల పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలని, పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అనేక సందర్భాల్లో మహిళలు బయటకు వచ్చి చెప్పుకోలేని, పోలీస్ స్టేషన్లకు వెళ్లడానికి సంకోచించే పరిస్థితులు ఉంటాయని ఎస్పీ అన్నారు. ఇలాంటి వారి కోసం ప్రభుత్వం వినూత్న సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చిందని వెల్లడించారు.. మహిళలు పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా నేరుగా డయల్ 100లేదా 112నంబర్లకు కాల్ చేయవచ్చున్నారు. సమాచారం అందిన వెంటనే పోలీసులే నేరుగా బాధితుల వద్దకు వచ్చి, అక్కడికక్కడే కేసు నమోదు చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఒకవేళ పోలీసులు సకాలంలో స్పందించకపోతే, బాధితులు నేరుగా తన ఆఫీస్ కు వచ్చి కలవాలని సూచించారు. సకాలంలో స్పందించని సిబ్బందిపై కూడా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

మహిళల రక్షణే ధ్యేయంగా సూర్యాపేట జిల్లాలో ప్రస్తుతం రెండు షీ టీమ్స్ మరియు ఒక భరోసా సెంటర్ నిరంతరం పనిచేస్తున్నాయని ఎస్పీ తెలిపారు. ఎలాంటి అపోహలు లేకుండా, వివక్షకు లేదా వేధింపులకు గురైన మహిళలు భరోసా కేంద్రాన్ని ఆశ్రయించి ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతూ, నేరస్థులకు కఠినంగా శిక్ష పడేలా చూస్తామని హామీ ఇచ్చారు.

ఇంట్లో అత్తమామలు లేదా భర్త చేతిలో గృహ హింసకు, ఇబ్బందులకు గురయ్యే మహిళలు సఖి సెంటర్లో ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా జిల్లాకు రెండు సఖి సెంటర్లను మంజూరు చేశారని ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.సఖి కేంద్రాల్లో వచ్చే ఫిర్యాదులపై డీఎస్పీ పర్యవేక్షణలో, నైపుణ్యం కలిగిన మహిళా కౌన్సిలర్ల ద్వారా భార్యాభర్తలకు కౌన్సిలింగ్ నిర్వహిస్తామని చెప్పారు. కౌన్సిలింగ్ తర్వాత కూడా ప్రవర్తన మార్చుకోని వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ నరసింహ స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్పర్సన్ షఫీ ఉల్లా,డియస్పి ప్రసన్నకుమార్, తహసిల్దార్ కృష్ణయ్య, ఫ్లోర్ లీడర్ వేణుగోపాల్ రావు, వార్డ్ కౌన్సిలర్ షేక్ జహీర్, మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి, డాక్టర్ అమూల్య, మున్సిపల్ కిరణ్ కుమార్ ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రైజింగ్ రాయలసీమ“తో అభివృద్ధికి కొత్త దిశ..

**- రాష్ట్ర మంత్రులు వై. సత్యకుమార్, టి.జి. భరత్ వెల్లడి**

**- రాబోయే 20 ఏళ్లలో కడప దేశానికే అభివృద్ధి కేంద్రంగా రాయలసీమ : జిల్లా కలెక్టర్**

**- పెట్టుబడులు, పరిశ్రమలే రాయలసీమ భవిష్యత్తుకు బలమైన పునాది**

**- రాయలసీమ అభ్యున్నతి కోసం “రైజింగ్ రాయలసీమ” సదస్సు**

**- పారిశ్రామిక వికాసం, పెట్టుబడులు, నవకల్పనలపై మేధోమథనం**

కడప, జూన్ 6: (విజన్ ఆంధ్ర) రాయలసీమను కరువు, వలసల ప్రాంతంగా కాకుండా పరిశ్రమలు, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలకు కేంద్రంగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి వై. సత్యకుమార్, రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టి.జి. భరత్ స్పష్టం చేశారు.శనివారం కడపలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో రాయలసీమ ప్రాంత అభ్యున్నతి,



పారిశ్రామిక వికాసం, పెట్టుబడుల ప్రోత్సాహం, నవకల్పనలపై చర్చించేందుకు సమర్థ్ రీసెర్చ్ అండ్ రిసర్జెన్స్ ఆధ్వర్యంలో “రైజింగ్ రాయలసీమ – ఇండస్ట్రీ, ఇన్నోవేషన్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్” సదస్సు ఘనంగా నిర్వహించారు. ఈ సదస్సుకు రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి వై. సత్యకుమార్, రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టి.జి. భరత్, జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి లతో పాటు ప్రభుత్వ విప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, ఎమ్మెల్సీ రామ్ గోపాల్ రెడ్డి, ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అలాగే.ల్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ బి. జయరామిరెడ్డి, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్, సమర్థ్ కన్వీనర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాయలసీమలో అపారమైన సహజ, మానవ వనరులు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుంటూ సమగ్రాభివృద్ధి సాధించాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు.మేధావులు, పరిశోధకుల భాగస్వామ్యం సదస్సులో రాయలసీమ అభివృద్ధిపై సమగ్ర చర్చ ఈ సందర్భంగా రాయలసీమలో పరిశ్రమల స్థాపన, ఉపాధి అవకాశాల విస్తరణ, సహజ వనరుల సద్వినియోగం, పెట్టుబడుల ఆకర్షణ, విద్యాపరిశోధన రంగాల అభివృద్ధి, యువతలో నవకల్పనలను ప్రోత్సహించడం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. ప్రాంతీయ అభివృద్ధికి ప్రభుత్వ విధానాలు, భవిష్యత్ అవకాశాలపై నిపుణులు తమ అభిప్రాయాలు వెల్లడించారు.అలాగే వివిధ విశ్వవిద్యాలయాల ప్రొఫెసర్లు, పరిశోధకులు, రీసెర్చ్ స్కాలర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, మేధావులు, యువత పెద్ద సంఖ్యలో హాజరై రాయలసీమ భవిష్యత్ అభివృద్ధిపై తమ సూచనలు, అభిప్రాయాలు వెల్లడించారు.

# గోదావరి వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**- ప్రజల ప్రాణ రక్షణకు ముందస్తు చర్యలు చేపట్టాలి**

**- జిల్లా కలెక్టర్ అంకిత్**

కొత్తగూడెం బ్యూరో, జూన్ 07(విజన్ ఆంధ్ర) : గోదావరి వరదల నేపథ్యంలో ప్రజల ప్రాణాలు, ఆస్తులకు ఎలాంటి నష్టం జరగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. శనివారం ఐడీఓసీ కార్యాలయంలో భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, అదనపు కలెక్టర్ వేణుగోపాల్ తదితర అధికారులతో కలిసి గోదావరి వరదల సన్నద్ధతపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వరదల వల్ల ముంపునకు గురయ్యే గ్రామాలను ముందుగానే గుర్తించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ముంపు పరిస్థితులు ఏర్పడిన తర్వాత కాకుండా ముందుగానే ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించే విధంగా కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు. వరదల్లో చిక్కుకున్న ప్రజలను రక్షించేందుకు బోట్లు, నాటుపడవలు, లైఫ్ జాకెట్లు, తాడులు, టార్చ్‌లైట్లు, హ్యాండ్ మైకులు తదితర సామగ్రితో పాటు రెస్క్యూ బృందాలను సిద్ధంగా ఉంచాలని తెలిపారు. గోదావరి



నీటిమట్టాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పరిస్థితులకు అనుగుణంగా ప్రజలకు ముందస్తు హెచ్చరికలు జారీ చేయాలని సూచించారు. ముంపు గ్రామాల ప్రజల ఫోన్ నంబర్లను సేకరించి సమాచార వ్యవస్థను బలోపేతం చేయాలని, వరదల సమయంలో విద్యుత్, తాగునీరు, వైద్య సేవలు, నిత్యావసర వస్తువుల సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో 24 గంటల పాటు పనిచేసే ఫ్లడ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడంతో పాటు మండల, జిల్లా స్థాయిల్లో కూడా కంట్రోల్ రూములను సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ సూచించారు. గర్భిణీలు, వృద్ధులు, చిన్నారులు, దివ్యాంగులపై ప్రత్యేక దృష్టి సారించి అవసరమైతే ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని పేర్కొన్నారు. వరదల సమయంలో అత్యవసర వైద్య సేవల కోసం 108 అంబులెన్సులు, అవసరమైన మందులు, పాము కాటు, తేలు కాటు నివారణ వ్యాక్సిన్లు అందుబాటులో ఉంచాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ, డ్రెయిన్ల శుభ్రత, మంచినీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. వాగులు, వంకలు పొంగిపొర్లే సమయంలో ప్రజలు వాటిని దాటకుండా ప్రమాద హెచ్చరిక బోర్డులు, బారికేడ్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. అలాగే పశువుల రక్షణకు తగిన చర్యలు చేపట్టి పశువైద్య సేవలను అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. గోదావరిలో 73 అడుగుల వరకు వరదలు వచ్చినా ఎదుర్కొనే విధంగా అన్ని శాఖలు సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ మాట్లాడుతూ, ముంపు గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి ముందస్తు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. పునరావాస కేంద్రాలు, రెస్క్యూ బృందాలు, అవసరమైన సామగ్రి సిద్ధంగా ఉంచామని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలతో సమన్వయం చేస్తూ పనిచేస్తున్నామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రతను పాటించాలి

**- జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక.**

నారాయణపేట, జూన్ 6 (విజన్ ఆంధ్ర) : ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను పాటించాలనీ, వర్షాకాలంలో ప్రబలే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక సూచించారు. మొక్కలు నాటడం, ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా వాతావరణ సమతుల్యత ను కాపాడాలని కలెక్టర్ తెలిపారు. శనివారం మరికల్ మండలంలోని పెద్ద చింతకుంట గ్రామ సచివాలయం ఆవరణలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా ప్రత్యేక గ్రామ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ప్రియాంక ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల స్థాయి అధికారులు రోడ్డు భద్రత, వర్షాకాలం నేపథ్యంలో ఇంకుడు గుంతల ఏర్పాటు, పరిసరాల పరిశుభ్రత, సాలిడ్ వేస్ట్ మేనేజ్ మెంట్, వన మహోత్సవం, జల సంరక్షణ, పాఠశాలల్లో సౌకర్యాలు సహా తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సాలిడ్ వేస్ట్ మేనేజ్ మెంట్ లో భాగంగా ఇంతవరకు తడి,పొడి చెత్త నిర్వహణ మాత్రమే చేశారని, ఇప్పుడు సుప్రీం కోర్టు గైడ్ లెన్స్ ప్రకారం తడి, పొడి చెత్తతో పాటు శానిటరీ, మెడికల్ వెస్ట్ చెత్తతో నాలుగు రకాలుగా సేకరించాల్సి ఉంటుందని తెలిపారు. చెత్త సేకరణ విషయంలో గ్రామ సర్పంచి, కార్యదర్శి ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఇండ్లలో పోగయ్యే చెత్తను నాలుగు రకాలుగా నిల్వ చేసేలా గ్రామస్థులకు తెలియజేయాలని చెప్పారు. అలాగే ఉపాధి హామీ పథకం లో ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలన్నారు. ప్రతీ రోజు మురుగు కాల్వలను శుభ్రం చేయించాలని కలెక్టర్ తెలిపారు. వీటితో పాటు గ్రామస్థులకు ఎస్. ఐ ఆర్ పట్ల సంపూర్ణ అవగాహన అవసరమని అభిప్రాయ పడ్డారు. బీ ఎల్ వో లు కొత్త ఓటర్ల ను నమోదు చేస్తారని, గతంలో గ్రామాల్లో నివాసం ఉండి, ఇప్పుడు వేరే ఊర్లకు వెళ్లిన వారు, చనిపోయిన ఓటర్ల ను తొలగించడం జరుగుతుందన్నారు. ఈ ప్రక్రియ ఈ నెల 25 నుంచి మొదవుతుందని చెప్పారు. ఇండ్ల వద్దకు బి ఎల్ వో లు వచ్చి రెండు ఫారాలు ఇస్తారని, వాటిలో మన పూర్తి వివరాలను రాసి, సరైన ధృవ పత్రాలను జత చేసి బీ ఎల్ వోలకు తిరిగి ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఆ తర్వాత



ఈ ఆర్ వో స్థాయిలో కొత్త ఓటరు జాబితాలను ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయ వద్ద ప్రచురిస్తారని, ఏమైనా అభ్యంతరాలు ఉంటే అధికారులకు తెలియ చేయాలని కలెక్టర్ సూచించారు. 2002 లో ఉన్న మన ఓటరు సంఖ్య ను అనుసంధానం చేయాల్సి ఉంటుందని చెప్పారు. ప్రస్తుతం పెద్ద చింతకుంట గ్రామంలో ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ 80 శాతం పూర్తి అయిందని, పెండింగ్ లో ఉన్న మిగతా 20 శాతం కూడా వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే ఫార్మర్ రిజిస్ట్రేషన్ ను కూడా పూర్తి చేయాలన్నారు. వర్షాకాలం రాబోతోందని, అప్రమత్తంగా ఉండాలని, రోజు మురుగు కాల్వల ను శుభ్రం చేయించాలని, డెంగీ, మలేరియా ప్రబల కుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆమె అధికారులకు సూచించారు. మహిళలకు మొక్కలను పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణ లో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి తిరుపతమ్మ, జెడ్పీ సీ ఈ వో శ్రీనివాస్ రావు, డిఆర్డిఓ వెంకట్ రాములు, డిపివో సుధాకర్ రెడ్డి, తహసిల్దార్ రామ్ కోటి, ఎంపీడీవో పృథ్వీరాజ్, ఎంపీఓ పావని, గ్రామ కార్యదర్శి జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

# వేధింపులను మౌనంగా భరించకండి... ధైర్యంగా ఫిర్యాదు చేయండి

- మహిళల భద్రతకు షీ టీమ్ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుంది
- ఐదు నెలల్లో 14 ఎఫ్ఐఆర్‌లు, 16 పెట్టి కేసులు నమోదు
- జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే







రాజన్న సిరిసిల్ల , జూన్ 6 (విజన్ ఆంధ్ర బ్యూరో): మహిళలు, బాలికలు, విద్యార్థినులు ఎలాంటి వేధింపులకు గురైనా మౌనంగా భరించకుండా వెంటనే పోలీసులకు లేదా షీ టీమ్‌కు ఫిర్యాదు చేయాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే సూచించారు. ఫిర్యాదు అందిన వెంటనే బాధితులకు రక్షణ కల్పించడంతో పాటు నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలో మహిళల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని, షీ టీమ్ బృందం నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తోందని ఎస్పీ వెల్లడించారు. గత ఐదు నెలల కాలంలో షీ టీమ్‌కు అందిన ఫిర్యాదుల ఆధారంగా 14 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడంతో పాటు 16 పెట్టి కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. మహిళలు, విద్యార్థినులను వేధించిన వ్యక్తులను గుర్తించి వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించినట్లు చెప్పారు.

**ఒక్క ఫోన్ కాల్‌తో స్పందించే షీ టీమ్**

మహిళలు, బాలికలు, విద్యార్థినులు వేధింపులకు గురైనప్పుడు ఒక్క ఫోన్ కాల్ చేస్తే జిల్లా షీ టీమ్ రక్షణ కవచంలా నిలుస్తుందని ఎస్పీ పేర్కొన్నారు. బాధితులు నిర్భయంగా ఫిర్యాదు చేయాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

**సోషల్ మీడియాలో అప్రమత్తంగా ఉండాలి**

అపరిచిత వ్యక్తులతో వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవద్దని, ముఖ్యంగా సోషల్ మీడియాలో పరిచయమయ్యే వ్యక్తుల విషయంలో మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని మహిళలు, విద్యార్థినులకు సూచించారు.

**విస్తృత అవగాహన కార్యక్రమాలు**

జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థలు, మహిళలు పనిచేసే ప్రదేశాలు, రద్దీ ప్రాంతాల్లో షీ టీమ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, పోక్సో చట్టం, మహిళల రక్షణ చట్టాలు, సోషల్ మీడియా మోసాలపై విద్యార్థులు, మహిళలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు.

**హాట్‌స్పాట్ల వద్ద మఫ్టీలో నిఘా**

మహిళల భద్రతకు భంగం కలిగే అవకాశం ఉన్న హాట్‌స్పాట్ ప్రాంతాల్లో షీ టీమ్ సిబ్బంది మఫ్టీ దుస్తుల్లో నిత్యం నిఘా నిర్వహిస్తున్నారని తెలిపారు. మహిళలు, విద్యార్థినులను వేధించే ఆకతాయిలను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. విద్యాసంస్థలు, ఉద్యోగ ప్రదేశాలు, రహదారులపై ప్రయాణించే సమయంలో ఎవరైనా అవమానకరంగా ప్రవర్తించినా, ఉద్దేశపూర్వకంగా వెంబడించినా వెంటనే షీ టీమ్ హెల్ప్‌లైన్ నంబర్ 8712656425కు ఫిర్యాదు చేయాలని ఎస్పీ మహేష్ బి. గితే కోరారు. ఫిర్యాదు అందిన వెంటనే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు

- జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించిన పోలీసులు
- 84 మందిపై చట్టపరమైన చర్యలు
- జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే హెచ్చరిక



రాజన్న సిరిసిల్ల, జూన్ 6 (విజన్ ఆంధ్ర బ్యూరో): జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ లక్ష్యంగా పోలీసులు బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వారిపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ క్రమంలో శుక్రవారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో 84 మందిని గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకున్నట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. ప్రజలకు అసౌకర్యం కలిగించే విధంగా రహదారులు, పార్కులు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం చట్ట విరుద్ధమని ఎస్పీ పేర్కొన్నారు. ఇటువంటి చర్యలు శాంతిభద్రతలకు విఘాతం కలిగించడంతో పాటు ఇతర నేరాలకు దారితీసే అవకాశం ఉందని అన్నారు.

నేరాల నియంత్రణకు ప్రత్యేక డ్రైవ్‌లు

జిల్లాలో నేరాలను అరికట్టేందుకు తరచుగా ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నామని, ప్రజల భద్రతకు భంగం కలిగించే అంశాలపై నిరంతర నిఘా కొనసాగుతోందని ఎస్పీ వెల్లడించారు.

సున్నిత ప్రాంతాల్లో పెట్రోలింగ్ ముమ్మరం

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే ప్రాంతాలను గుర్తించి అక్కడ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో వెలుతురు తక్కువగా ఉండే ప్రాంతాల్లో పెట్రోలింగ్‌ను మరింత ముమ్మరం చేస్తున్నామని చెప్పారు.

శాంతియుత వాతావరణానికి ప్రజల సహకారం అవసరం

జిల్లాలో ప్రశాంత వాతావరణం కొనసాగేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని ఎస్పీ కోరారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, ప్రజలకు ఇబ్బందులు కలిగించే చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం ఇటువంటి ప్రత్యేక డ్రైవ్‌లు నిరంతరం కొనసాగుతాయని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే స్పష్టం చేశారు.

# గోధుమ వాగు వంతెన పై గుంతలు... వర్షం పడితే ప్రాణాలు గాల్లోనే

## ప్రమాదాలకు ఆహ్వానం పలుకుతున్న గొదుమవాగు వంతెన!



కొత్తగూడెం బ్యూరో జూన్ 07(విజన్ ఆంధ్ర) : రామవరంకొత్తగూడెం ప్రధాన రహదారిలోని కీలకమైన గొదుమవాగు వంతెన ప్రస్తుతం ప్రమాదకర పరిస్థితుల్లో ఉంది. వంతెనపై ఏర్పడిన భారీ గుంతలు రోజురోజుకూ విస్తరిస్తుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సమస్య మరింత తీవ్రమైందని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రామవరం, పాల్వంచ, కొత్తగూడెం ప్రాంతాలను అనుసంధానించే ఈ మార్గం అత్యంత రద్దీగా ఉంటుంది. ప్రతిరోజూ వందల సంఖ్యలో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు, బస్సులు, లారీలు ఈ వంతెన మీదుగా రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే వంతెనపై ఏర్పడిన గుంతలు ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యంతో పాటు ప్రమాదకర పరిస్థితులను సృష్టిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా గుంతలు మరింత పెద్దవిగా మారడంతో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. వర్షం పడిన సమయంలో గుంతల్లో నీరు నిల్వ ఉండటంతో వాటి లోతు అంచనా వేయడం కష్టంగా మారుతోంది. దీంతో ద్విచక్ర వాహనదారులు, విద్యార్థులు, మహిళలు, వృద్ధులు ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు పెరిగాయని స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో గుంతలు స్పష్టంగా కనిపించకపోవడంతో వాహనాలు అదుపుతప్పే ప్రమాదం ఉందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల కథనం ప్రకారం వంతెనపై గుంతల సమస్య కొత్తది కాదు. గత కొంతకాలంగా సమస్య కొనసాగుతున్నప్పటికీ శాశ్వత పరిష్కారం చూపడంలో సంబంధిత అధికారులు విఫలమయ్యారని ఆరోపిస్తున్నారు. గతంలో కొత్తగూడెం ఎమ్మెల్యే సందర్శన అనంతరం తాత్కాలిక మరమ్మతులు చేపట్టినా కొద్ది రోజులకే మళ్లీ గుంతలు ఏర్పడుతున్నాయని పేర్కొంటున్నారు. వర్షాకాలానికి ముందే సమగ్ర మరమ్మతులు చేపట్టాల్సి ఉన్నప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గొదుమవాగు వంతెనపై ఏర్పడిన గుంతలు కేవలం ప్రయాణ అసౌకర్యానికే కాకుండా ప్రాణాపాయ పరిస్థితులకు దారితీసే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఏదైనా ప్రమాదం సంభవించిన తర్వాత స్పందించడం కంటే ముందస్తుగా చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు. వెంటనే గుంతలను పూడ్చి, వంతెనకు అవసరమైన శాశ్వత మరమ్మతులు చేపట్టడంతో పాటు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి రాత్రి వేళల్లో ప్రత్యేక లైటింగ్ సౌకర్యం కల్పించాలని స్థానికులు, వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు. వర్షాకాలం మరింత ఉధృతం కాకముందే అధికారులు స్పందించి ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతున్నారు.

# చెత్తను నాలుగు రకాలుగా వేరు చేయాలి

- ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచాలి
- జల వనరుల సంరక్షణకు గ్రామాలు సిద్ధం కావాలి
- ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక ప్రత్యేక గ్రామసభలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు



తంగళ్లపల్లి రాజన్న సిరిసిల్ల, జూన్ 6 (విజన్ ఆంధ్ర): ప్రతి ఇంటిలో ఉత్పత్తి అయ్యే చెత్తను తడి, పొడి, సానిటరీ, ప్రత్యేక వ్యర్థాలుగా నాలుగు రకాలుగా వేరు చేసి గ్రామ పంచాయతీ పారిశుధ్య వాహనాలకు అందించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రజలకు సూచించారు. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా తంగళ్లపల్లి మండలం రామన్నపల్లి గ్రామంలోని ప్రగతి ప్రాంగణంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక గ్రామసభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వర్షాకాల సన్నద్ధత, వ్యవసాయం, బడి బాట, ఘన వ్యర్థాల నిర్వహణ, ఓటరు జాబితా సవరణ, పారిశుధ్యం, వనమహోత్సవం, జల సంరక్షణ, మహిళల భద్రత వంటి అంశాలపై గ్రామస్తులతో విస్తృతంగా చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల ద్వారా ప్రతి ఇంటికి నాలుగు చెత్త బుట్టలు పంపిణీ చేయాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు బట్ట సంచులు అందించాలని సూచించారు. గ్రామాల్లో స్టీల్ బ్యాంకులు ఏర్పాటు చేసి సామూహిక కార్యక్రమాల కోసం స్టీల్ ప్లేట్లు, గ్లాసులు, జగ్గులు అందుబాటులో ఉంచాలని ప్రతిపాదించారు.

**వర్షాకాలానికి ముందే డ్రైనేజీల శుభ్రత**

వర్షాకాలం ప్రారంభానికి ముందే డ్రైనేజీలను పూర్తిగా శుభ్రం చేయాలని, ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా ప్రజలు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**పంటల మార్పిడిపై రైతులకు సూచనలు**

ఎల్ నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకుని పంటల సాగు చేపట్టాలని సూచించారు. ఆయిల్ పామ్, సన్న వడ్లు, పప్పుధాన్యాలు, కూరగాయల వంటి లాభదాయక పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. పంటల మార్పిడి ద్వారా నేల సారాన్ని కాపాడుకోవచ్చని వివరించారు.

**ఓటరు జాబితా సవరణకు సహకరించాలి**

ఈ నెల 25 నుంచి ప్రారంభమయ్యే ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వచ్చే బీఎల్‌ఓలకు ప్రజలు పూర్తి సహకారం అందించాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని తెలిపారు.

**ప్రభుత్వ పాఠశాలల్లో చేరికలు పెంచాలి**

బడిబాట కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో ప్రభుత్వం మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పిస్తోందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు.

**జల వనరుల సంరక్షణకు చర్యలు**

గ్రామాల్లోని ఇంకుడు గుంతలు, చెరువులు, ఫామ్ పాండ్లు వర్షాకాలానికి ముందే సిద్ధం చేయాలని సూచించారు. జల వనరుల సంరక్షణ ద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయని తెలిపారు. అలాగే జిల్లా వ్యాప్తంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగంగా కొనసాగుతోందని, ఇటీవల 2,720 ఇళ్లకు గృహప్రవేశాలు నిర్వహించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా విద్యాధికారి జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి షరీఫుద్దీన్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, ఉద్యానవన శాఖ అధికారి శరత్, డిప్యూటీ తహసీల్దార్ మురళీకృష్ణ, సర్పంచ్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# మూఢ నమ్మకాలను నమ్మొద్దు

- బాల్య వివాహాలను ప్రోత్సహించవద్దు
- ప్రతి గ్రామాన్ని స్థానిక పోలీస్ స్టేషన్కు లింక్ చేయాలి
- మహిళలు బాలికలు అపరిచిత వ్యక్తులతో మాట్లాడరాదు
- తల్లిదండ్రులు తమ పిల్లలకు హెల్మెట్ పెట్టుకుంటేనే బైక్ కి ఇవ్వండి
- అత్వెల్లి గ్రామ సర్పంచ్ విజయలక్ష్మి మహేందర్ రెడ్డి
- ఎంపిడిఓ కేశ బోయిన వినయ్ కుమార్ సీఐ రఘు కుమార్ డీఎస్పీ అంజయ్య



వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 06 ( విజన్ ఆంధ్ర ) :'పోలీస్ మిత్ర ప్రజలకు పోలీస్ శాఖకు మధ్య అనుసంధానకర్తగా ఉంటుందని డి.ఎస్.పి అంజయ్య, సీఐ రఘు కుమార్ ఎంపిడిఓ కేశ బోయిన వినయ్ కుమార్ అన్నారు. మూఢ నమ్మకాలను నమ్మి కుటుంబాలను నాశనం చేసుకోవద్దని వారు హితవు పలికారు. శనివారం వికారాబాద్ మండల పరిధిలోగల అత్వెల్లి గ్రామంలో 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామ సర్పంచ్ విజయలక్ష్మి మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక గ్రామ సభకు డి.ఎస్.పి అంజయ్య సిఐ రఘుకుమార్ ఎంపిడిఓ కేశ బోయిన వినయ్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని వారు మాట్లాడుతూ తమ కుటుంబంలోని పిల్లలను సమాన దృష్టితో చూడాలని వారు సూచించారు. ప్రతి తల్లిదండ్రి మంచి నడవడికతో క్రమశిక్షణతో నడవగలిగితే తమ సంతానం కూడా అదే దారిలో వెళ్తారని వారు స్పష్టం చేశారు. పిల్లల ముందు బూతు మాటలు మాట్లాడరాదన్నారు. ప్రతి చిన్న విషయానికి కుటుంబంలో పిల్లల ముందు గొడవలకు దిగరాదని వారు తెలిపారు. ఆడపిల్లలకు 18 సంవత్సరములు నిండిన తర్వాతనే వివాహం చేయాలనే వారు సూచించారు. మహిళలు బాలికలు అపరిచిత వ్యక్తులతో గానీ అనుమానస్పద వ్యక్తులతో గాని ఎట్టి పరిస్థితుల్లో మాట్లాడరాదని వారు గట్టిగా హెచ్చరించారు. పిల్లలు బైక్ మీద బయటికి వెళ్లాలనుకుంటే హెల్మెట్ పెట్టుకుంటేనే బైక్ కి ఇస్తామని ప్రతి తల్లిదండ్రి గట్టిగా చెప్పాలన్నారు. నవ మాసాలు మోసి తమ సంతానం ప్రమాదవశాత్తు చనిపోతే ప్రతి తల్లికి కడుపుతో మిగులుతుందని వారు హెచ్చరించారు. పిల్లలకు అవసరం ఉన్నంత మేరకే ఫోన్ వాడాలని ప్రతి తల్లిదండ్రి మాటిమాటికి చెప్పాలని వారు సూచించారు. మానవ అక్రమ రవాణానికి ప్రతి వ్యక్తి బాధ్యతతో వ్యవహరించవలసి ఉంటుందని వారు తెలిపారు. అత్వెల్లి గ్రామాన్ని స్థానిక పోలీస్ స్టేషన్కు లింక్ చేయాలని సీఐ రఘు కుమార్ గ్రామ సర్పంచ్ కు ప్రత్యేకంగా సూచించారు. సభ్య సమాజంలో తమ సంతానం గౌరవంగా కీర్తి ప్రతిష్టలతో బ్రతికే విధంగా నేర్పించాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కలేటి పూర్ణిమ డాక్టర్ సౌమ్య ఉపసర్పంచ్ అమృత వార్డు మెంబర్లు గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు మహిళా సంఘాలు యువజన సంఘాలు ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

# నీకు పున పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేయాలి

- జిల్లా కలెక్టర్ దీపక్ తివారి




వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 06 ( విజన్ ఆంధ్ర ) : జూన్ 21న నిర్వహించే నీట్ పునః పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయం నుండి నీట్ పునః పరీక్ష, యోగా దినోత్సవం, వరి ధాన్యం సేకరణ, మహిళా సమాఖ్యల ద్వారా కొనుగోలు చేసిన బస్సులను ఆర్టీసీకి అద్దెకు ఇవ్వడం రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా పరేడ్ గ్రౌండ్ లో ప్రారంభోత్సవం, పాఠశాల విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ , ఆసుపత్రుల అభివృద్ధి సొసైటీ సమావేశాలు తదితర అంశాలపై ఉన్నతాధికారులతో కలిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడుతూ... జూన్ 21న నిర్వహించే పరీక్షను ఏంటిఏ ( నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ) మార్గదర్శకాలకు అనుగుణంగా చేపట్టాలన్నారు. అందుకు అనుగుణంగా జిల్లాలోని (5) పరీక్షల కేంద్రాల్లో అన్ని సదుపాయాలు సమకూర్చుకోవాలని కలెక్టర్ అధికారులకు తెలిపారు. రుతుపవనాల ప్రభావంతో వర్షాలు రావడం వల్ల వరి ధాన్యం తడిసే ప్రమాదం ఉందని, దానికి తగ్గట్టుగా జాగ్రత్తలు తీసుకొని వరి ధాన్యాన్ని త్వరితగతిన మిల్లులకు, గోదాములకు చేరవేయాలని ఆయన పౌరసరఫరాల అధికారులను ఆదేశించారు. అవసరాలను బట్టి ట్రాన్స్ పోర్ట్ లారీల సంఖ్యను పెంచుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని మొత్తం 19 మండల మహిళా సమాఖ్యల ద్వారా 19 బస్సులను కొనుగోలు చేసి ఆర్టీసీకి అద్దెకు ఇవ్వడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ప్రతి నెల మహిళా సమాఖ్యలు స్థిరమైన ఆదాయం పొందుతూ మహిళల ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు అందిస్తుందని ఆయన తెలిపారు. జనవరి 9న పరేడ్ గ్రౌండ్ లో జరిగే రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యక్రమంలో భాగంగా అద్దె బస్సులను ప్రారంభించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే మహిళా సమాఖ్య సభ్యులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, త్రాగునీరు సదుపాయంతో పాటు ఆశా వర్కర్ ప్రతి బస్సులో ఉండే విధంగా చూసుకోవాలని కలెక్టర్ సూచించారు. కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఉమా శంకర్ ప్రసాద్, అదనపు కలెక్టర్ ( రెవెన్యూ ) కే వెంకటాచారి, డిఆర్డిఓ శ్రీనివాస్, జిల్లా పౌర సరఫరాల అధికారి సుదర్శన్, జిల్లా మేనేజర్ మోహన్ కృష్ణ, జిల్లా విద్యాధికారి మహమ్మద్ అబ్దుల్ ఘని, నీట్ సిటీ కోఆర్డినేటర్ కే.సాయి లత, చీఫ్ సూపరింటెండెంట్ డి.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# సూర్యాపేటలో సామాన్యులకు ఇల్లు కట్టుకునే స్వేచ్ఛ లేదా...?

- రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారు
- మున్సిపల్ అనుమతులు ఉన్నా ఇల్లు కట్టనివ్వకుండా ఇబ్బందులపాలు చేస్తున్నారు
- ఉన్నత అధికారులు స్పందించి నిజానిజాలు నిగ్గు తేల్చాలి
- మీడియా ముందు ఆవేదన వ్యక్తం చేసిన బాధితురాలు దొంతగాని వసంత వెంకన్న



సూర్యాపేట జూన్ 06:(విజన్ ఆంధ్ర) : అన్ని అనుమతులతో ఇల్లు కట్టుకుంటుంటే పలువురు కోర్టులో కేసు ఉందని ఇల్లు ఎలా కడతారంటూ రాజకీయ ఒత్తిడితో అధికారుల ద్వారా ఇబ్బందుల పాలు చేస్తున్నారని సామాన్యులకు సూర్యాపేటలో ఇల్లు కట్టుకునే స్వేచ్ఛ లేదని సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 19వ వార్డుకు చెందిన దొంతగాని వసంత వెంకన్న రోధించారు. శనివారం వారు నూతనంగా నిర్మిస్తున్న ఇంటిముందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తమ ఆవేదనను వ్యక్తం చేశారు. 1980 నుంచి హక్కుదారులుగా ఉన్న యానాల మల్లారెడ్డి, అమృతా రెడ్డి, సురకంటి విజయమ్మలు అన్న చెల్లెళ్ళు 800 గజాల స్థలాన్ని కొనుగోలు చేశారని అన్నారు. సురకంటి విజయమ్మ కుమారుడు భీమర్జున్ రెడ్డి నుంచి దారోజు జానకి రాములు 2020లో 400 గజాల స్థలాన్ని కొనుగోలు చేశారని తెలిపారు. ఆ 400 గజాల స్థలంలో నుంచి దొంతగాని వసంత వెంకన్నలమైన మేము 160 గజాలు కొనుగోలు చేశామని తెలిపారు. నాటి నుంచి నేటి వరకు ఆ స్థలానికి సంబంధించిన అన్ని పత్రాలు ఉన్నాయని మున్సిపాలిటీకి టాక్సు కూడా చెల్లిస్తున్నామని తెలిపారు. తాము కొనుగోలు చేసిన స్థలంలోబిఇల్లు కట్టుకునేందుకు ప్రయత్నించగా ఆ స్థలం కోర్టులో ఉందని ఇంటి అనుమతికి అధికారులు నిరాకరించారన్నారు.

తమకు స్థలాన్ని విక్రయించిన వారు న్యాయపరంగా వెళ్లి 2025లో కోర్టు కేసును డిస్మిస్ చేయగా తాము ఇంటి అనుమతి తీసుకున్నామని తెలిపారు. ప్రస్తుతం కొందరు ఈ స్థలం కోర్టు కేసులో ఉందని అనుమతులు ఎలా ఇస్తారంటూ రాజకీయ ఒత్తిడితో అధికారులను ఇబ్బంది పెడుతుండగా వారు తమను ఇల్లు కట్టకుండా అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అసలు ఈ స్థలంపై కోర్టులో కేసు వేసిన వారు ఎవరనేది తమకు తెలియదని వారు ఇదంతా ఎందుకు చేస్తున్నారో అర్థం కావడం లేదని అన్నారు. నిరుపేదలమైన మేము పైసా పైసా పోగు చేసి స్థలాన్ని కొనుక్కొని ఇల్లు కట్టుకుంటున్నామని తమన ఇబ్బందులు పెట్టడం ఎంతవరకు సమంజసం అన్నారు. కోర్టులో కేసు వేసిన వారు తమ వద్ద ఉన్న డాక్యుమెంట్ తీసుకొని వస్తే న్యాయ పోరాటానికైనా తాము సిద్ధమని అన్నారు. ఈ స్థలంపై కోర్టులో కేసు వేసిన వారు కనీసం కోర్టుకు ఏ ఒక్కనాడు కూడా హాజరు కాలేదని దీంతో వారు ఎవరు ఎందుకు ఇదంతా చేస్తున్నారో అర్థం కావడం లేదని వాపోయారు. ఉన్నత అధికారులు స్పందించి రాజకీయ వత్తిళ్లను నివారించి నిజానిజాలు నిగ్గు తేల్చి నిరుపేదలమైన తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. వారి వెంట సురకంటి భీమార్జున్ రెడ్డి, దారోజు భాగ్యరాజ్, సురకంటి విజయమ్మ, దొంతగాని వెంకన్న తదితరులు ఉన్నారు.

# షీ టీం ఆధ్వర్యంలో మహిళలు, బాలికల భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించిన పోలీస్ లు..

భూపాలపల్లి జిల్లా : 6 జూన్ ( విజన్ ఆంధ్ర ) భూపాలపల్లి పట్టణ కేంద్రంలో ఆడపిల్లలను కాపాడుదాం దేశాభివృద్ధికి తోడ్పడుదాం. షీ టీం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ ఆదేశాల మేరకు, జిల్లా కేంద్రంలోని ఐటీ మాస్టర్ ఇన్స్టిట్యూట్ మరియు భూపాలపల్లి బస్టాండ్‌లో షీ టీం ఆధ్వర్యంలో మహిళలు, బాలికల భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీం సిబ్బంది విద్యార్థినులతో మాట్లాడుతూ సోషల్ మీడియా ద్వారా తెలియని వ్యక్తులతో పరిచయాలు పెంచుకోవద్దని, అపరిచితులకు వ్యక్తిగత వివరాలు తెలియజేయవద్దని సూచించారు. సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగిస్తూ తమ బంగారు భవిష్యత్తును కాపాడుకోవాలని తెలిపారు. మహిళలు, బాలికలు వేధింపులు ఎదురైనప్పుడు ఎలాంటి భయం లేకుండా ధైర్యంగా ఫిర్యాదు చేయాలని, ఫిర్యాదుదారుల వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. మహిళల భద్రతే షీ టీం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. అలాగే విద్యార్థినులు ౧-ాఖుటవ టి సేఫ్ యాప్ వినియోగించడం ద్వారా తమ ప్రయాణాలను మరింత సురక్షితంగా చేసుకోవచ్చని, సోషల్ మీడియాలో వ్యక్తిగత సమాచారం పంచుకోవద్దని, అనుమానాస్పద లింకులను క్లిక్ చేసి సైబర్ నేరాల బారిన పడకూడదని సూచించారు. ఆడపిల్లలకు ఏదైనా ఇబ్బంది ఎదురైతే వెంటనే షీ టీం హెల్ప్‌లైన్ నంబర్ 8712658162 ను సంప్రదించాలని, సైబర్ నేరాల బారిన పడినట్లయితే





సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నంబర్ 1930 కు వెంటనే ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా గుడ్ టచ్ బ్యాడ్ టచ్ అవగాహన, పోక్సో చట్టం, మహిళా మరియు బాలల రక్షణకు సంబంధించిన చట్టాలపై విద్యార్థులు, విద్యార్థినులకు నిజ జీవిత సంఘటనలను ఉదాహరణలుగా తీసుకుని అవగాహన కల్పించారు. మహిళలు, బాలికలు తమ హక్కులు, భద్రతపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# బడిబాట కార్యక్రమం ద్వారా పిల్లలందరినీ ప్రభుత్వ స్కూల్లో చేర్చాలి

**- ఆదేశించిన జిల్లా కలెక్టర్**

సిద్దిపేట జిల్లా ప్రతినిధి 06జూన్ : సిద్దిపేట జిల్లా కేంద్రంలో అన్ని స్కూల్నందుబడిబాట కార్యక్రమం ద్వారా ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల ఎన్రోల్మెంట్ పెంచాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధికారులను శుక్రవారం ఐడిఓసి సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ వివిధ శాఖల సంక్షేమ అధికారులు, విద్యాశాఖ అధికారులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్ లు, ఎంఈఓ లతో సమావేశం నిర్వహించి బడిబాట కార్యక్రమంపై సమీక్షించి తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 3 వ తేదీ నుండి బడిబాట కార్యక్రమం ప్రారంభమైందని 20వ తేదీ వరకు సాగుతుందని అన్నారు. బడిబాట కార్యక్రమం ద్వారా ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల ఎన్రోల్మెంట్ పెంచాలని అన్నారు. ఈ విద్యా సంవత్సరంలో బడిబాట కార్యక్రమం ద్వారా 8500విద్యార్థులను ప్రభుత్వపాఠశాలలలోచేర్పించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని అదేవిధంగా 1వ తరగతి, 6వతరగతి మరియు 8వ తరగతిలో అదనంగా మరో 8500 మంది విద్యార్థులను చేర్పించాలని అన్నారు. ముఖ్యంగాప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, అమ్మా ఆదర్శ పాఠశాలల కమిటీ సభ్యులు, యువత మరియు గ్రామస్తులను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చెయ్యాలని అలా చేస్తే ఎన్రోల్మెంట్ బాగా జరుగుతదని తెలిపారు. విద్యార్థుల సంఖ్య లేక మూతపడిన 61 ప్రభుత్వ పాఠశాలలను మళ్లీ



తెరిపించేలాఉపాధ్యాయులు విద్యార్థుల ల్లిదండ్రులను మోటివేట్ చేయాలని అన్నారు. ప్రస్తుతం తక్కువ విద్యార్థులతో నడుస్తున్న ఏకోపాధ్యాయ పాఠశాలలలో విద్యార్థుల సంఖ్యను పెంచితేఅదనంగాఉపాధ్యాయులను డిప్యూటేషన్ పై పంపిస్తానని అన్నారు. ఇందిరానగర్ జెడ్పీ హైస్కూల్ లాగా అన్ని ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యాబోధన చేసి విద్యార్థులను అధిక సంఖ్యలో ఆకర్షించాలని అన్నారు. పాఠశాలలు పునఃప్రారంభం అయిన వెంటనే పాఠ్యపుస్తకాలను అందించాలని, ఏ సబ్జెక్టు లో విద్యార్థులు వీకుగ ఉన్నారో గురించి ఆయా సబ్జెక్టు లలో ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు. లెర్నింగ్ అవుట్ కమ్ లో ముందుండాలనీ, అన్ని పారామీటర్లలో ముందుండాలనఅన్నారు. అన్నిఇప్పటి వరకు జిల్లాలో గల 34 భవిత కేంద్రాలలో 296 మంది ప్రత్యేక అవుసరాలుగల విద్యార్థులు ఉండగా ఈ రోజు ప్రత్యేక డ్రైవ్ ద్వారా మరో 63 మంది విద్యార్థులను గుర్తించడం జరిగిందని అన్నారు. పాఠశాలలలో మౌలిక వసతులు కల్పన కోసం చేపట్టిన నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని అన్నారు. ఈ విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ కళాశాలలో ఉదయం అల్పాహారం మరియు మధ్యాహ్న భోజనం కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టినందున ఇంటర్మీడియట్ విద్యార్థుల ఎన్రోల్మెంట్ పెంచాలని అన్నారు. జిల్లాలో గల 20 ప్రభుత్వాలు ఇంటర్మీడియట్కళాశాలలోగతసంవత్సరం 2891 అడ్మిషన్స్ జరగా ఈ సంవత్సరం అదనంగా మరో 50% అడ్మిషన్స్ పెరిగేలా చూడాలని అన్నారు. అదేవిధంగా ఇంటర్మీడియట్ పూర్తి అయిన విద్యార్థులు జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశం పొందేలా చూడాలన్నారు. డిగ్రీ కాలేజీలలో 1 ఇయర్ కోర్సులను ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిందని ఆయా కోర్సులలో ఎన్రోల్మెంట్ పెంచాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్స్ కు సూచించారు. దుబ్బాకలో ప్రస్తుతం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నడుస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనం సరిగా లేకపోవడం మూలంగా విద్యార్థుల ఎన్రోల్మెంట్ జరగడంలేదని కెసిఆర్ పాఠశాలలో రెండో అంతస్తును ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు అందించాలని ఎంఈఓను ఆదేశించారు డిమాండ్ అధికంగా ఉన్న పోస్ట్ మెట్రిక్ హాస్టల్లలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఆయా సంక్షేమ శాఖల అధికారులు చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఇఒ వరగంటి శాస్త్రి, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి హమీద్, జిల్లా బీసీ సంక్షేమ అధికారి సయ్యద్ రఫీక్, సిద్దిపేట ఉమెన్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ జీవన్, సిద్దిపేట డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ అయోధ్య రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

**- కారుకొండ రామవరం గ్రామసభలో ప్రజల సమస్యలు విన్న జిల్లా కలెక్టర్ అంకిత్**

**- తక్షణ పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు**

కొత్తగూడెం బ్యూరో జూన్ 07(విజన్ ఆంధ్ర) : ప్రజా సమస్యల పరిష్కారం, గ్రామాల సమగ్రాభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా పాలన ప్రగతి



ప్రణాళిక ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా లక్ష్మీదేవిపల్లి మండలం కారుకొండ రామవరం గ్రామపంచాయతీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన గ్రామసభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై గ్రామస్థులను ఉద్దేశించి ప్రసంగించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం మార్చి 6వ తేదీ నుంచి అన్ని శాఖల సమన్వయంతో విజయవంతంగా అమలవుతోందన్నారు. గ్రామస్థాయిలో ప్రజలకు ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు చేరువ చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు.

గ్రామసభలు ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చే సమర్థవంతమైన వేదికలుగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, పారిశుద్ధ్యం, వర్షాకాలంలో వ్యాధుల నివారణ, ప్రజారోగ్య పరిరక్షణ వంటి అంశాలపై గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ద్వారా ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజలకు మరింత చేరువవుతున్నాయని చెప్పారు.

**రైతులు శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులు అనుసరించాలి**

రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు పంటల మార్పిడి విధానాలను పాటించాలని కలెక్టర్ సూచించారు. వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు, సూచనల మేరకు శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టాలని, ఎరువులు, పురుగుమందుల వినియోగంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఆధునిక వ్యవసాయ సాంకేతికతలను వినియోగించడం ద్వారా దిగుబడులు పెంచుకోవచ్చని రైతులకు సూచించారు.

**పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి**

గ్రామాల్లో సాలిడ్ అండ్ లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి కుటుంబం తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించే అలవాటు అలవరుచుకోవాలని కోరారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా అంటువ్యాధులను నివారించవచ్చని తెలిపారు. ముఖ్యంగా వర్షాకాలంలో పారిశుద్ధ్య చర్యలు మరింత బలోపేతం చేయాలని సూచించారు.

**ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి**

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ఎస్ఐఆర్‌ను సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు తెలిపారు. అర్హులైన వారికి ఓటు హక్కు కల్పించడం, అనర్హుల పేర్లను తొలగించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని వివరించారు.

**ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు పెరగాలి**

బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు పెరిగేలా అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక మౌలిక వసతులు, డిజిటల్ విద్య, మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు తదితర సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు.

**గ్రామ సమస్యలపై స్పందించిన కలెక్టర్**

ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్, రైతులు, గ్రామస్థులు పంట పొలాలకు వెళ్లే రహదారుల అభివృద్ధి, గ్రామంలో అదనపు విద్యుత్ లైన్ల ఏర్పాటు, అంతర్గత రహదారుల నిర్మాణం, తాగునీటి అవసరాల కోసం ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు వంటి సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలపై స్పందించిన కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులను వెంటనే చర్యలు చేపట్టి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. ప్రజల అవసరాలను గుర్తించి త్వరితగతిన పరిష్కారం చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాలోత్ భారతి, ఎంపీడీఓ జి. సుస్మిత, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# క్రమశిక్షణ, సరైన మార్గదర్శకత్వం విజయానికి మూలం

**- మాజీ ఐపీఎస్ అధికారి జేడీ లక్ష్మీనారాయణ**

**- కరీంనగర్‌లో 'రెసోనెన్స్ ఫౌండేషన్ సెంటర్' ప్రారంభం**

కరీంనగర్,( విజన్ ఆంధ్ర) జూన్ 5, 2026: క్రమశిక్షణ, సరైన మార్గదర్శకత్వం విజయానికి మూలమని మాజీ ఐపీఎస్ అధికారి జేడీ లక్ష్మీనారాయణ తెలిపారు. దేశంలో ఐఐటీ–జేఈఈ, నీట్ శిక్షణలో అగ్రగామిగా ఉన్న రెసోనెన్స్ విద్యాసంస్థలు జగిత్యాల్ – కరీంనగర్ రోడ్డు, ఐసీఐసీఐ బ్యాంక్ పక్కన, రేకుర్తిలో ఉన్న ఎలైట్ హోటల్ వేదికగా 'రెసోనెన్స్ ఫౌండేషన్ సెంటర్'ను ప్రారంభించింది. మాజీ ఐపీఎస్ అధికారి జేడీ లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా హాజరై ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే బలమైన విద్యా పునాది నిర్మించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కరీంనగర్‌లో ఫౌండేషన్ కోచింగ్‌ను అందుబాటులోకి తీసుకువస్తున్న రెసోనెన్స్ విద్యా సంస్థలను అభినందించారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. క్రమశిక్షణతో కూడిన అభ్యాసం, స్పష్టమైన అవగాహన, సరైన మార్గదర్శకత్వం విద్యార్థుల భవిష్యత్తు విజయాలకు కీలకమన్నారు. విద్యార్థులు చిన్న వయస్సులోనే క్రమబద్ధమైన విద్యా శిక్షణ ద్వారా భవిష్యత్తు పోటీ పరీక్షలకు బలమైన పునాదిని ఏర్పరచుకోవచ్చని తెలిపారు. ఈ ఫౌండేషన్ కోర్సు ద్వారా విద్యార్థులకు గణితం, భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, జీవశాస్త్రం, మెంటల్ ఎబిలిటీ అంశాల్లో సమగ్ర శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ఈ అంశాలపై ప్రారంభ దశలోనే బలమైన పట్టు సాధించడం ద్వారా విద్యార్థులు భావనాత్మక అవగాహన, విశ్లేషణాత్మక





ఆలోచన, సమస్యల పరిష్కార నైపుణ్యాలను పెంపొందించుకోగలరని చెప్పారు. దీంతో ఇంటర్ అనంతరం ఐఐటీ–జేఈఈ, నీట్ వంటి పోటీ ప్రవేశ పరీక్షలలో సులభంగా విజయం సాధించవచ్చని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రెసోనెన్స్ మేనేజింగ్ డైరెక్టర్ పూర్ణచంద్రరావు నర్రా మాట్లాడుతూ అనుభవజ్ఞులైన అధ్యాపకులు, క్రమబద్ధమైన బోధనా పద్ధతులు, నిరంతర విద్యా పర్యవేక్షణతో ఫలితాల ఆధారిత విద్యను అందించడానికి రెసోనెన్స్ కట్టుబడి ఉందన్నారు. ఈ ఫౌండేషన్ సెంటర్ విద్యార్థులకు ప్రాథమికాంశాలను బలోపేతం చేసుకోవడానికి, ఐఐటీ–జేఈఈ, నీట్, ఒలింపియాడ్స్ వంటి పోటీ పరీక్షలకు ఆత్మవిశ్వాసంతో సిద్ధమవడానికి సహాయపడుతుందని తెలిపారు. అనంతరం నిర్వహించిన అవగాహన సదస్సులో ప్రారంభ దశలోనే ప్రిపరేషన్ మొదలుపెట్టడం, సంపూర్ణ అవగాహనతో కూడిన అభ్యాసం, కెరీర్ ఆధారిత విద్యా ప్రణాళిక ప్రాముఖ్యతను వివరించారు. రెసోనెన్స్ విద్యాసంస్థలు, తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ గురించి రెసోనెన్స్ అనేది ఐఐటీ మద్రాస్ పూర్వ విద్యార్థి ఆర్కే వర్మ 2001లో రాజస్థాన్‌లోని కోటాలో స్థాపించారు. ఇది దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఒక ప్రతిష్టాత్మక విద్యాసంస్థ. గత రెండు దశాబ్దాలుగా రెసోనెన్స్ 87 నగరాల్లోని 150 పైగా కేంద్రాల ద్వారా 10 లక్షల (1 మిలియన్) పైగా విద్యార్థులకు శిక్షణ ఇచ్చింది. ఇందులో 3.3 లక్షల పైగా విద్యార్థులు ఐఐటీలు, ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, ప్రముఖ సాంకేతిక విశ్వవిద్యాలయాలు, టాప్ మెడికల్ కాలేజీలలో ప్రవేశాలు పొందారు. దేశవ్యాప్తంగా ఉన్న ఈ బలమైన వారసత్వంతో, పూర్ణచంద్రరావు నర్రా దూరదృష్టితో కూడిన నాయకత్వంలో రెసోనెన్స్ 2018లో హైదరాబాద్‌లో ఒకే ఒక్క క్యాంపస్‌తో ప్రస్థానాన్ని ప్రారంభించింది. ఎంపీసీ, బైపీసీ గ్రూపులపై ప్రత్యేక దృష్టి సారిస్తూ.. ఐఐటీ–జేఈఈ, నీట్, ఇతర పోటీ పరీక్షలకు సమగ్రమైన శిక్షణ, అనుభవజ్ఞులైన అధ్యాపకులు, క్రమశిక్షణతో కూడిన ప్రిపరేషన్, ఫలితాల ఆధారిత విధానంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో నిరంతర విజయాలకు, విద్యా నైపుణ్యానికి రెసోనెన్స్ విద్యాసంస్థలు ఒక చిహ్నంగా మారాయి. కేవలం ఏడు సంవత్సరాలలోనే, రెసోనెన్స్ విద్యాసంస్థలకు చెందిన 6,100 పైగా విద్యార్థులు ఐఐటీలు, ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, ఎయిమ్స్, ఇతర అగ్రశ్రేణి విశ్వవిద్యాలయాలలో సీట్లు సాధించారు. ఈ అద్భుతమైన విజయాల స్ఫూర్తితో, రెసోనెన్స్ ఇప్పుడు ఫౌండేషన్ సెంటర్లు, పాఠశాలలు, ఈ–లెర్నింగ్, గ్లోబల్ స్టడీస్ రంగాలలోకి విస్తరించింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా 50 పైగా క్యాంపస్‌లతో విజయవంతంగా దూసుకుపోతోంది.

# గ్రామసభలతో ప్రజా సమస్యలు పరిష్కారం

**పచ్చదనం, పారిశుద్ధ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలి**

**కలెక్టర్ చిత్రా మిశ్రా**

కరీంనగర్ (విజన్ ఆంధ్ర బ్యూరో) జూన్ 05..పచ్చదనం , పారిశుద్ధ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలని.. గ్రామ సభలతో ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని కలెక్టర్ చిత్రా మిశ్రా పేర్కొన్నారు. శనివారం కొత్తపల్లి మండలం బద్దిపల్లి గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా గ్రామసభ నిర్వహించారు. దీనికి కలెక్టర్ హాజరై మాట్లాడారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొస్తే పరిష్కారమవుతాయని గ్రామస్తులకు సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యత నివ్వాలన్నారు. పైపులైన్ల మరమ్మత్తులు, ఓ నీటి ట్యాంకులను శుభ్రం చేయించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిథిలావస్థకు చేరిన భవనాలను గుర్తించి తొలగించాలన్నారు. ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకుంటూ వర్షపు నీటిని సంరక్షించాలన్నారు.




పచ్చదనం, పారిశుద్ధ్యం, తాగునీరు, వైద్యం వంటి వంటి చిన్న అంశాలపై ప్రత్యేక దృష్టి సారించిన గ్రామాలే జాతీయస్థాయిలో అవార్డులు సాధిస్తున్నాయని వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు , వసతులను సద్వినియోగం చేసుకొని సుస్థిర అభివృద్ధికి బాటలు వేయాలని సూచించారు. నిబంధనల మేరకు చెత్త నిర్వహణ చేపట్టాలన్నారు. అవెన్యూ ప్లాంటేషన్, బడిబాట గురించి వివరించారు. హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి గ్రామస్తుల సమస్యలు పరిష్కరించాలని కార్యదర్శిని ఆదేశించారు. ఇన్చార్జి ఆర్డీవో వెంకటరెడ్డి మాట్లాడుతూ సర్ లో భాగంగా ఓటరు నమోదు జాబితా, మ్యాపింగ్ ప్రక్రియ గురించి వివరించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈఓ ఆనందం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజల వద్దకే ప్రజాదర్బార్

భూపాలపల్లి జిల్లా : 6 జూన్ ( విజన్ ఆంధ్ర ) : భూపాలపల్లి మండలం గుర్రంపేట రెవెన్యూ పరిధిలోని గుర్రంపేట, రామ్ నాయక్ తండా, పెద్దాపూర్, బావుసింగ్‌పల్లి, సుబ్బక్కపల్లి గ్రామాల ప్రజల సమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేసిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఐటిడిఎ పి.ఓ లెనిన్ వత్సల్ టొప్పోతో కలిసి పాల్గొన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వారి వద్దకే వెళ్లి తెలుసుకుని త్వరితగతిన పరిష్కరించడమే ప్రజా దర్బార్ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ములుగు నియోజకవర్గంలో ఇప్పటివరకు 70 గ్రామాల్లో ప్రజా దర్బార్ కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను సంబంధిత అధికారులతో సమీక్షించి నాలుగు రోజులలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్న మంత్రి తెలిపారు. ములుగు నియోజకవర్గంలో ఇప్పటికే లక్షకు పైగా పెన్షన్లు అందించామని, రాబోయే రోజుల్లో మరో రెండు నుండి మూడు లక్షల మందికి పెన్షన్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. మహిళల ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, గత రెండేళ్లలో మహిళా సంఘాలకు రూ.61 వేల కోట్ల రుణాలు అందించామని, ప్రస్తుతం రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు ఇస్తున్నామని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం ప్రారంభమై రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించే మహిళా సదస్సులో 554 బస్సులను మహిళా సంఘాలకు అందజేయనున్నట్లు తెలిపారు. అలాగే మహిళా సంఘాలకు సంబంధించిన రూ.600 కోట్ల వడ్డీ బకాయిలను కూడా విడుదల చేయనున్నట్లు చెప్పారు. గతంలో మహిళలు అవసరాల కోసం అధిక వడ్డీకి అప్పులు తీసుకునే పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం మహిళా



సంఘాల ద్వారా సులభంగా రుణాలు అందుబాటులోకి వచ్చాయని పేర్కొన్నారు. ఐటిడిఎ ఆధ్వర్యంలో "అమ్మకు అక్షరమాల" కార్యక్రమం ద్వారా మహిళల్లో అక్షరాస్యత పెంపొందిస్తున్నామని తెలిపారు. మహిళా సంఘాల్లో సభ్యులుగా ఉండి మరణించిన మహిళల కుటుంబాలకు రూ.5 లక్షల బీమా, రేషన్ కార్డు కలిగిన కుటుంబాలకు ఆసరాగా రూ.5 లక్షల బీమా పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారని చెప్పారు. రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని, రైతులు పండించిన ధాన్యాన్ని ఒకటి రెండు రోజులు ఆలస్యం అయిన పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు. మహిళల కోసం సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు చేపడుతున్నామని, మేడారం జాతర సందర్భంగా రూ.6 కోట్ల వ్యయంతో మహిళా సంఘాలకు వ్యాపారాలు ఏర్పాటు చేయగా వారు రూ.3 కోట్ల లాభాలు ఆర్జించారని వెల్లడించారు. మహిళలకు వ్యాపార అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం రుణ సదుపాయాలు అందిస్తోందన్నారు. రామ్ నాయక్ తండా పేరు మార్పు అంశంపై గ్రామసభ తీర్మానం చేసి ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులను పరిశీలించి 10 రోజుల్లో మంజూరు చేస్తామని, అవసరమైతే అదనపు ఇళ్లు కూడా మంజూరు చేస్తామని తెలిపారు. "ఇందిరమ్మ ఇల్లు లేని గ్రామం ఉండకూడదు" అనేది ముఖ్యమంత్రి లక్ష్యమని పేర్కొన్నారు. ఒంటరి మహిళలు, వృద్ధులకు తొలి విడతలోనే పెన్షన్లు మంజూరు చేస్తామని, గ్రామాల్లో రహదారుల అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. రైతులు, పేదలు, కార్మికులు, కర్షకుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మంత్రి సీతక్క పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రణాళిక కార్యక్రమం ద్వారా గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనుల అమలుకు ప్రత్యేక కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 4, 6, 8, 10 తేదీలలో వార్డు, గ్రామ సభలు నిర్వహించి గ్రామాల్లోని సమస్యలపై ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు, భూ భారతి, పెన్షన్లు, రేషన్ కార్డులు తదితర అంశాలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించి పరిష్కార చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తూ అవసరమైన సూచనలు అందిస్తున్నారని అన్నారు. ఓటరు జాబితా నమోదు ప్రక్రియ కొనసాగుతోందని, జూలై 31వ తేదీ వరకు ప్రాథమిక ఓటరు జాబితా సిద్ధం చేయనున్నట్లు చెప్పారు. జాబితాపై ఏవైనా అభ్యంతరాలు లేదా సూచనలు ఉంటే ప్రజలు తెలియజేయవచ్చని, వాటిని పరిశీలించిన అనంతరం అక్టోబర్ నెలలో తుది ఓటరు జాబితాను విడుదల చేస్తామని పేర్కొన్నారు. 99 రోజుల ప్రణాళిక కార్యక్రమం జూన్ 12వ తేదీతో ముగియనున్న నేపథ్యంలో ప్రజల సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించి ప్రభుత్వ సేవలను అర్హులందరికీ అందించేందుకు కృషి చేస్తున్నామని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ స్పష్టం చేశారు. అనంతరం ప్రజల నుండి అర్జీలు స్వీకరించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి నవీన్ రెడ్డి, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఆర్డీవో హరికృష్ణ పలు శాఖల జిల్లా అధికారులు, స్థానిక తహసిల్దార్ లక్ష్మి రాజయ్య, ఎంపీడీవో తరుణ్ ప్రసాద్, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విత్తనాలపై రాజీ లేదు

**- నకిలీ విత్తనాల విక్రేతలపై కఠిన చర్యలు - మంత్రి సీతక్క**



ములుగు జూన్ 06 , విజన్ ఆంధ్ర ప్రతినిధి : శనివారం కలెక్టరేట్‌లో విత్తన, ఎరువుల డీలర్ల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడిన మంత్రి, రైతుల నష్టాలకు కారణమయ్యే నకిలీ, నాసిరకం విత్తనాల విక్రయాన్ని సహించబోమని స్పష్టం చేశారు. విత్తనాల చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. వర్షాకాల సీజన్‌కు రైతులకు ఎరువులు, విత్తనాల కొరత లేకుండా ముందస్తు ప్రణాళికతో సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో పట్టాలు లేని రైతులకు కూడా సౌకర్యాలు అందించాలని సూచించారు. అనంతరం ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించిన మంత్రి సీసీ రోడ్లు, మహిళా సంఘ భవనాల పనులు నాణ్యతతో, గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి., సంపత్ రావు, జిల్లా వ్యవసాయ అధికారి సురేష్ కుమార్, డీలర్లు పాల్గొన్నారు.

## చల్వాయి గ్రామపంచాయతీకి రాష్ట్ర అవార్డు.



ములుగు జూన్ 06, విజన్ ఆంధ్ర ప్రతినిధి : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఘన వ్యర్థాల నిర్వహణలో ఉత్తమ పనితీరుకు ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం చల్వాయి గ్రామపంచాయతీ రాష్ట్రంలో టాప్-3లో ఎంపికైంది. హైదరాబాద్‌లో మంత్రి కొండా సురేఖ సర్పంచ్ మేకల రాధ, కార్యదర్శి బి. రాజశేఖర్‌లకు అవార్డు ఇచ్చారు. మంత్రి సీతక్క జిల్లా అధికారులను, సర్పంచ్‌ను అభినందించారు.

# ఏటూరునాగారం 7వ వార్డులో ప్రమాదకర కల్వర్టు నిర్మాణం ప్రారంభం

**- సర్పంచ్ శ్రీలత లక్ష్మణ్ బాబు చేతుల మీదుగా శంకుస్థాపన**



ములుగు జూన్ 06 , విజన్ ఆంధ్ర ప్రతినిధి : ఏటూరునాగారం మేజర్ గ్రామపంచాయతీ పరిధి 7వ వార్డులో దీర్ఘకాలంగా ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు సమస్యకు పరిష్కారం లభించింది. పూర్తిగా ధ్వంసమైన కల్వర్టు వల్ల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు ఫిర్యాదు చేయడంతో సర్పంచ్ లికాకులమ్రి శ్రీలత లక్ష్మణ్ బాబులి తక్షణమే స్పందించారు. ప్రమాద తీవ్రతను స్వయంగా పరిశీలించిన సర్పంచ్, ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ నూతన కల్వర్టు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. శనివారం స్థానిక వార్డు ప్రతినిధులు, గ్రామ ప్రముఖులతో కలిసి పూజా కార్యక్రమాలు నిర్వహించి నిర్మాణ పనులను అధికారికంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తుమ్మ మల్లారెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ కూనూరు అశోక్ గౌడు, తాడూరి రఘు, ఎండి ఖాజా పాషా, ఉప సర్పంచ్ పర్వతాల ఎల్లయ్య, వార్డు సభ్యులు మాదరి మధు, కుమ్మరి చంద్రబాబు, ఎండి బాబా, కొండాయి చిన్ని, పెద్దబోన బాలకృష్ణ, ఎర్రల సారయ్య తదితరులు పాల్గొన్నారు. గ్రామపంచాయతీ కార్యదర్శి, ఏటూరునాగారం, షార్ట్ న్యూస్ – 4 లైన్లు, ఏటూరునాగారం 7వ వార్డులో కొత్త కల్వర్టు నిర్మాణం, సర్పంచ్ శ్రీలత లక్ష్మణ్ బాబు శంకుస్థాపన ఏటూరునాగారం, జూన్ 06: 7వ వార్డులో ధ్వంసమైన కల్వర్టు వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులపై సర్పంచ్ కాకులమర్రి శ్రీలత లక్ష్మణ్ బాబు తక్షణమే స్పందించారు. నూతన కల్వర్టు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించారు. స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## మృతుని కుటుంబాన్ని పరామర్శించిన BRS నేత బడే నాగజ్యోతి

**ఆర్థిక సహాయం అందజేత**



ములుగు, జూన్ 06, విజన్ ఆంధ్ర ప్రతినిధి : పంచోత్కులపల్లి గ్రామానికి చెందిన ఆగబోయిన నిరోష మృతి చెందడంతో బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి బడే నాగజ్యోతి జగదీష్ కుటుంబాన్ని పరామర్శించారు. ఆర్థిక సహాయం అందజేసి, కష్టకాలంలో పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

# పర్యావరణ దినోత్సవం :

## జిల్లా జడ్జి చేతుల మీదుగా మొక్కలు నాటడం.

**- ప్రతి ఒక్కరూ ఒక్కో మొక్క పెంచాలి" - జిల్లా జడ్జి ఎస్.వి.పి సూర్యచంద్ర కళ.**




ములుగు జూన్ 06, విజన్ ఆంధ్ర ప్రతినిధి : పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం కొత్తగా నిర్మించిన బాల సదన్ భవన ఆవరణలో ములుగు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. డిఎల్ఎస్ఎ చైర్‌పర్సన్ కమ్ జిల్లా జడ్జి లిఎస్.వి.పి సూర్యచంద్ర కళలి ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ పర్యావరణాన్ని రక్షించుకోవడం మానవ జీవనశైలికి ఎంతో ఉపయోగపడుతుందని కొనియాడారు. చెట్లు నాటడం వల్ల కాలుష్య నివారణ, అధిక వర్షపాతం, పంటల సమృద్ధికి ఉపయోగపడుతుందని తెలిపారు. "ప్రతి ఒక్కరూ ఒక్కొక్క మొక్క పెంచినట్లయితే భవిష్యత్తు తరాలకు మంచి ఆరోగ్యాన్ని ఇచ్చిన వాళ్లమౌతాం" అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ కమ్ సీనియర్ సివిల్ జడ్జి టి. కన్నయ్య లాల్, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి జి. జ్యోష్ణ, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి డి. మధులిక తేజ, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు బాలుగు చంద్రయ్య, ఉపాధ్యక్షులు రంగోజు బిక్షపతి, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు మేకల మహేందర్, బానోత్ స్వామిదాస్, సంయుక్త కార్యదర్శి రాచర్ల రాజ్ కుమార్, క్రీడా సంస్కృతిక కార్యదర్శి కె. ప్రణయ్ ప్రసాద్, న్యాయవాదులు కె. సునీల్ కుమార్, ఎండీ. మన్సూర్ అలీ తదితర కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రాజెక్టుల భూసేకరణ పనులు వేగవంతం చేయాలి

**- తెలంగాణ ఆర్ అండ్ ఆర్ కమిషనర్ కే.శివకుమార్ నాయుడు ఆదేశం**

**- కలెక్టర్‌తో కలిసి ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో సుదీర్ఘ సమీక్ష**




వనపర్తి జిల్లా ప్రతినిధి, జూన్ 6 (విజన్ ఆంధ్ర) : జిల్లాలోని నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్లో ఉన్న భూసేకరణ పనులు అత్యంత వేగంగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఆర్ అండ్ ఆర్ కమిషనర్ కే శివకుమార్ నాయుడు ఆదేశించారు. తెలంగాణ ఆర్ అండ్ ఆర్ కమిషనర్ శివకుమార్ నాయుడు శనివారం నాడు వనపర్తి జిల్లాలో ఆకస్మికంగా పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన ఐడిఓసి కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి ఇరిగేషన్ మరియు రెవెన్యూ శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లాలో కొనసాగుతున్న పలు నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణకు సంబంధించిన పెండింగ్ అంశాలపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ పాలమూరు ప్రాజెక్టుల విషయంలో భూసేకరణ పనులు పూర్తి చేయడం ప్రథమ ప్రాధాన్యతగా పనిచేయాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల ఉమ్మడి పాలమూరు జిల్లా పర్యటనలో భాగంగా సూచించినట్లు తెలిపారు. ఆ దిశగా జిల్లాలోని రెవెన్యూ, నీటి పారుదల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రాజెక్టులకు కీలకమైన ప్రాంతాల్లో భూసేకరణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆర్ అండ్ ఆర్ కమిషనర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి ఆదేశాల అనుసారంగా ఉమ్మడి పాలమూరు జిల్లాలోని అన్ని జిల్లాల్లో పర్యటించి నీటిపారుదల ప్రాజెక్టులపై సమీక్షించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా ప్రాజెక్టులను పూర్తి చేసే విధంగా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. జిల్లాలో గణపసముద్రం ప్రాజెక్టులో భాగంగా పెండింగ్లో ఉన్న 197 ఎకరాల భూసేకరణకు గాను 164 ఎకరాలకు ప్రిలిమినరీ నోటిఫికేషన్ జారీ చేయడం జరిగిందని, రైతులను ఒప్పించి అవార్డు కూడా త్వరగా జారీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా కర్నె తాండ లిఫ్ట్ ఇరిగేషన్ కు సంబంధించి పెండింగ్ 17 ఎకరాల భూసేకరణకు సంబంధించి సోమవారంలోగా ప్రతిపాదనలు పంపాలని నీటిపారుదల శాఖ అధికారులకు ఆదేశించారు. మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద ప్యాకేజ్ 29 కు సంబంధించి మైనర్ కెనాల్స్ 77 ఎకరాల భూసేకరణకు పెగ్ మార్కింగ్ త్వరగా పూర్తిచేసి ప్రిలిమినరీ నోటిఫికేషన్ జారీ చేయాలన్నారు. ఘనపూర్ బ్రాంచ్ కెనాల్ కు సంబంధించి 30 ఎకరాల భూమికి సంబంధించి పెగ్ మార్కింగ్ పూర్తిచేసి, ఎస్ డి ఆర్ స్టేజి లో ఉన్న 60 ఎకరాలకు కూడా త్వరగా నోటిఫికేషన్ జారీ చేయాలని ఆదేశించారు. బుద్ధారం పెద్ద చెరువుకు సంబంధించి నోటిఫికేషన్ జారీచేసిన 101 ఎకరాల భూమికి సంబంధించిన రైతులతో మాట్లాడి అవార్డు వేగంగా జారీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఖాన్ చెరువుకు సంబంధించి చందాపూర్, సవాయిగూడెం, పెద్దగూడెం గ్రామాల పరిధిలో అటవీ భూమి అంశంపై అటవీశాఖ అధికారులతో సమన్వయం చేసుకొని పర్వేష్ పోర్టల్ లో త్వరగా అనుమతులు పొందే విధంగా చూసుకోవాలన్నారు. ఇప్పటికే జిల్లాలో భూసేకరణలో భాగంగా అవార్డ్స్ జారీ చేసిన వాటికి సంబంధించి టోకెన్స్ రైస్ చేస్తే త్వరితగతిన నగదు బదిలీ అయ్యే అవకాశం ఉంటుందని తెలియజేశారు. సమావేశంలో నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ రహీముద్దీన్ , ఎస్ ఈ చంద్రశేఖర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిరుపతయ్య, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, సర్వే ఏడి శ్రీనివాసులు, ఇతర రెవెన్యూ అధికారులు, ఇతర నీటిపారుదల శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# లోక్ అదాలత్‌తో వివాదాలకు శాశ్వత ముగింపు

**- న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని బలోపేతం చేసే వేదిక**

**- కక్షలు కాదు.. సామరస్యమే ముఖ్యం**

**- జూన్ 20 వరకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక కార్యాచరణ**

**- సమన్వయ సమావేశంలో ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కళార్చన**




వనపర్తి జిల్లా ప్రతినిధి, జూన్ 6 (విజన్ ఆంధ్ర) వివాదాలు కొనసాగాలంటే జీవితకాలం పడుతుంది.. కానీ పరస్పర అవగాహనతో రాజీకి సిద్ధమైతే క్షణాల్లో పరిష్కారం లభిస్తుంది" అని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి, ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కళార్చన అన్నారు. ప్రజలకు తక్కువ ఖర్చుతో, సత్వర, సులభ న్యాయం అందించడమే జాతీయ మెగా లోక్ అదాలత్ ముఖ్య లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు. శనివారం వనపర్తి జిల్లా న్యాయస్థానంలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో పోలీసు అధికారులు, కోర్టు సిబ్బందితో ఆమె సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి కళార్చన మాట్లాడుతూ.. జూన్ 20వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న జాతీయ మెగా లోక్ అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

సమయం, ధనం ఆదా.. మానసిక ప్రశాంతత! కోర్టుల్లో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న కేసులను పరస్పర అంగీకారంతో పరిష్కరించుకోవడం ద్వారా కక్షిదారులకు మానసిక ప్రశాంతత లభించడంతో పాటు సమయం, ధనం, శ్రమ ఆదా అవుతాయని జడ్జి వివరించారు. రాజీ అనేది ఓటమి కాదని.. పరస్పర గౌరవం, అవగాహనతో సమస్యలకు శాశ్వత పరిష్కారం కనుగొనే గొప్ప విజయమని ఆమె పేర్కొన్నారు. లోక్ అదాలత్‌లు కేవలం కేసుల పరిష్కార వేదికలు మాత్రమే కాకుండా, సమాజంలో శాంతి, సామరస్య వాతావరణాన్ని నెలకొల్పే ప్రజా న్యాయ వేదికలని కొనియాడారు.

రాజీపడదగ్గ కేసులపై ప్రత్యేక దృష్టి పోలీసు, న్యాయస్థానాల సమన్వయంతో ప్రతి కేసుకు సామరస్య పరిష్కారం చూపాలన్నారు. క్రిమినల్ కంపౌండబుల్ కేసులు కుటుంబ వివాదాలు, ఆస్తి తగాదాలు రోడ్డు ప్రమాద పరిహార కేసులు చెక్ బౌన్స్, బ్యాంకు రికవరీ కేసులు డ్రంక్ అండ్ డ్రైవ్, టౌన్ న్యూసెన్స్ కేసులు లాంటి రాజీ మార్గంలో పరిష్కారమయ్యే ప్రతి కేసును గుర్తించి, కక్షిదారులకు లోక్ అదాలత్ ప్రయోజనాలను వివరించి మెగా లోక్ అదాలత్‌కు తరలించేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కోర్టుల చుట్టూ తిరుగుతూ న్యాయం కోసం ఎదురుచూసే సామాన్య ప్రజలకు ఇది ఒక గొప్ప అవకాశమని, అందరూ దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమన్వయ సమావేశంలో జిల్లా న్యాయమూర్తులు కవిత, కార్తీక్ రెడ్డి, శ్రీలత, అశ్విని, వనపర్తి డీఎస్పీ గిరిబాబు, వనపర్తి సీఐ సుగంధరత్నం, ఆత్మకూరు సీఐ శివకుమార్, జిల్లాలోని ఎస్సైలు, కోర్టు కానిస్టేబుళ్లు, న్యాయస్థాన సిబ్బంది మరియు ఇతర ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

# నీట్ పరీక్షలను పూర్తి బందోబస్తు మధ్య నిర్వహించాలి

**- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు**




ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 6, విజన్ ఆంధ్ర : రాష్ట్రంలో జరగనున్న నీట్ పరీక్షలను పోలీసు బందోబస్తు మధ్య పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్, ఆరోగ్య కార్యదర్శి క్రిష్టియానా, శాంతి భద్రతల డి.జి. మహేష్ భగవత్, పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, సెర్ప్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి దివ్య దేవరాజన్ లతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్.పి.లు, అదనపు కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో నీట్ పరీక్ష నిర్వహణ, మాసంగి వరి ధాన్యం కొనుగోలు వేగవంతం, జూన్ 9న హైదరాబాద్ లోని పరేడ్ గ్రౌండ్ లో స్వయం సహాయక సంఘాలకు బస్సుల పంపిణీ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ జూన్ 21వ తేదీన దేశవ్యాప్తంగా నిర్వహించనున్న నీట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని, అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని తెలిపారు. నైరుతి రుతుపవనాలు త్వరలో రాష్ట్రంలో ప్రవేశిస్తున్నందున యాసంగి వరి ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని, కొనుగోలు ప్రక్రియ చివరి దశలో ఉన్నందున రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు. ఈ నెల 9వ తేదీన హైదరాబాద్ లోని పరేడ్ మైదానంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు బస్సులు అందజేసే కార్యక్రమం ఉన్నందున మహిళలను బస్సులలో జాగ్రత్తగా హైదరాబాద్ కు తీసుకురావాలని, అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ కార్యక్రమాలను సమర్థవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ కె.హరిత, ఎస్.పి. నితికా పంత్, అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం.డేవిడ్ లతో కలిసి హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అధికారులతో కార్యక్రమాల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 21న నిర్వహించే నీట్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని జనకాపూర్ లో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/ కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, అవసరమైన ఏర్పాట్లు చేయడం జరుగుతుందని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిబంధనల ప్రకారం పరీక్ష నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. యాసంగి మరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ చివరి దశలో ఉన్నందున తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులకు తరలించాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు. ఈ నెల 9న హైదరాబాద్ లోని పరేడ్ మైదానంలో స్వయం సహాయక సంఘాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా బస్సుల పంపిణీ కార్యక్రమానికి జిల్లా నుండి మండలానికి ఒక బస్సు చొప్పున 15 బస్సులలో స్వయం సహాయక సంఘాల మహిళలను తరలించడానికి చర్యలు తీసుకోవాలని, హైదరాబాద్ కు బస్సులు సురక్షితంగా చేరుకునేలా పూర్తిస్థాయి ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, నీట్ పరీక్షల ముఖ్య పర్యవేక్షకులు, జిల్లా పౌర సరఫరాల మేనేజర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులందరూ వరి కోయ్యలను కాల్చొద్దు జిల్లా కలెక్టర్ సూచన

సిద్దిపేట జిల్లా ప్రతినిధి 06జూన్ : సిద్దిపేటజిల్లాలో రైతు రైతులు ఎవరు కూడాపంట పొలాల్లో పంట అవశేషాలు కాల్చకూడదని, దాని వాళ్ళ అనేక నష్టాలు వస్తాయని జిల్లా కలెక్టర్ కె. హైమావతి జిల్లాలోని రైతాంగానికి విజ్ఞప్తి చేశారు. జిల్లాలో 3 లక్షల 65 వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం, 50 వేల మెట్రిక్ టన్నుల మక్కలు కొనుగోలు చేశామని, ఈ పంటలు కోసిన తర్వాత పంట అవశేషాలను (వరి గడ్డి, మొక్కజొన్న కాండాలు, పత్తి కట్టెలు మొదలైనవి) కాల్చడం వల్ల నేలలోని సేంద్రియ పదార్థాలు మరియు ఉపయోగకరమైన సూక్ష్మజీవులు నశిస్తాయి. గాలి కాలుష్యం పెరిగి ఆరోగ్య సమస్యలు వస్తాయి. కార్బన్ డైఆక్సైడ్ వంటి హానికర వాయువులు విడుదల అవుతాయి. నేల సారవంతత తగ్గుతుంది. అక్కడక్కడ రైతులు ప్రాణాలు సైతం పోగొట్టుకుంటున్నారని దీనికి ప్రత్యామ్నాయా మార్గాలు వెతకాలని అవశేషాలను కంపోస్ట్‌గా మార్చాలని, నేలలో కలిపి సేంద్రియ ఎరువుగా ఉపయోగించడం. పశువుల మేతగా వినియోగించడం. అవశేషాలతో సహా దుక్కి దున్నడం చెయ్యాలని తెలిపారు.పంట అవశేషాలు కాల్చవద్దు నేల సారాన్ని కాపాడండి,పర్యావరణాన్ని రక్షించండనీ" జిల్లా రైతాంగానికి పిలుపు నిచ్చారు.

## జర్నలిస్టులకు రెయిన్‌కోట్లు పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



కామారెడ్డి బ్యూరో జున్ 6(విజన్ఆంధ్ర) : వర్షాకాలంలో విధులు నిర్వహించే జర్నలిస్టులకు ఉపయోగపడేలా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ రెయిన్‌కోట్లను పంపిణీ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు రెయిన్‌కోట్లు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఎండలు, వర్షాలు, ఇతర ప్రతికూల పరిస్థితుల్లోనూ ప్రజలకు సమయానుకూలంగా సమాచారాన్ని చేరవేస్తూ జర్నలిస్టులు కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని అన్నారు. వర్షాకాలంలో వార్తల సేకరణ కోసం క్షేత్రస్థాయిలో పర్యటించే మీడియా ప్రతినిధులకు రెయిన్‌కోట్లు ఉపయుక్తంగా ఉంటాయని తెలిపారు. జిల్లా అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, ప్రజా సమస్యలను ప్రజల దృష్టికి తీసుకురావడంలో మీడియా పాత్ర ఎంతో ముఖ్యమని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా పరిపాలనకు మీడియా ఎల్లప్పుడూ సహకరిస్తోందని, అదే స్ఫూర్తితో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎన్.వి గిరి, డి పి ఆర్ ఓ తిరుమల, డిపిఓ మురళి, జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు, ప్రింట్ అండ్,ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, సమాచార శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఈవీఎంల గోదామును తనిఖీచేసిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 6(విజన్ ఆంధ్ర): మహబూబాబాద్ జిల్లా లోని కురవి రోడ్ కలెక్టరేట్ దగ్గరలో ఉన్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్లు (ఈవీఎంలు), వివిప్యాట్‌లు భద్రపరిచిన గోదామును జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ శనివారం గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేశారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సాధారణ తనిఖీలలో భాగంగా ఈ పరిశీలన చేపట్టారు. గోదాములో పటిష్ట భద్రత నడుమ భద్రపరిచిన ఈవీఎంలు, వివిప్యాట్‌లు, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, ఎన్నికల సామగ్రి నిల్వ ఉంచిన గదులను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. భద్రతా చర్యల్లో భాగంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరు, గోదాం భద్రతా వ్యవస్థలను సమీక్షించారు. ఈవీఎంల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నిర్వహణకు సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించి సంతకాలు చేశారు. తనిఖీలో జిల్లా అదనపు కలెక్టర్ కె. అనిల్ కుమార్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ పవన్ కుమార్, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పక్షులు,వన్యప్రాణుల సంరక్షణలో ప్రజల భాగస్వామ్యం కీలకం

**-ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పారుపల్లిలో బర్డ్ వాక్ కార్యక్రమం**

**-అటవీ రేంజ్ అధికారి ఎం.వినయ్ నాయక్**



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి జూన్-06(విజన్ ఆంధ్ర) : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా ముత్తారం (మంథని) మండలంలోని పారుపల్లి గ్రామ పరిధిలో ఉన్న పెద్ద చెరువు వద్ద శనివారం "బర్డ్ వాక్స్ అండ్ వైల్డ్ లైఫ్ అవేర్‌నెస్" కార్యక్రమాన్ని అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. మైదంబండ బీట్, బేగంపేట సెక్షన్ పరిధిలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా అడవుల్లో నివసించే వివిధ రకాల పక్షులు, వన్యప్రాణులు, జీవ వైవిధ్యం ప్రాధాన్యంపై అటవీ శాఖ అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మంథని అటవీ రేంజ్ అధికారి ఎం.వినయ్ నాయక్ మాట్లాడుతూ, ప్రకృతి సమతుల్యతను కాపాడడంలో పక్షులు, వన్యప్రాణులు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. జీవ వైవిధ్య పరిరక్షణ ద్వారా భావితరాలకు ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించవచ్చని పేర్కొన్నారు. అడవులు, చెరువులు, సహజ వనరుల సంరక్షణలో ప్రజల భాగస్వామ్యం అత్యంత అవసరమని ఆయన తెలిపారు. కార్యక్రమంలో భాగంగా బర్డ్ వాచింగ్, ట్రెక్కింగ్ నిర్వహించడంతో పాటు పర్యావరణ పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. పాల్గొన్న యువతకు ప్రకృతి సంపదను కాపాడాల్సిన బాధ్యతపై వివరించారు. పారుపల్లి గ్రామ సర్పంచ్ చొప్పరి సంపత్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రకృతి సంపద పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం పెరిగితేనే జీవ వైవిధ్యాన్ని కాపాడగలమని అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామస్థుల్లో పక్షులు, వన్యప్రాణుల సంరక్షణతో పాటు పర్యావరణ పరిరక్షణపై చైతన్యం పెంపొందిందని అటవీ శాఖ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి జె. తిరుపతి, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఎస్.కే. నహీదా పర్వీన్ (బేగంపేట), ఎస్.డి. రహమతుల్లా, ఫారెస్ట్ బీట్ అధికారులు ఎస్. మేఘరాజ్, టి. రామ్‌సింగ్, ఎ. మాధురి, పి. రంజిత, బయాలజిస్ట్ చంద్రకాంత్, పారుపల్లి గ్రామ సర్పంచ్ చొప్పరి సంపత్, పోతారం, పారుపల్లి గ్రామాల ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, యువతతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# భైంసా అభివృద్ధికి సమష్టి కృషి అవసరం



**- ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలి**

**- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**

నిర్మల్ జిల్లా,జూన్ 06,(విజన్ ఆంధ్ర); భైంసా మున్సిపాలిటీని అన్ని రంగాల్లో ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమిష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సూచించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శనివారం భైంసా మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన మున్సిపాలిటీ అభివృద్ధి సమీక్ష సమావేశంలో ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, జిల్లా ఎస్పీ జానకి షర్మిల, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రధాన లక్ష్యమన్నారు. ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకొని వెంటనే పరిష్కరించేలా అధికారులు పనిచేయాలని సూచించారు. అభివృద్ధి కార్యక్రమాల అమలులో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ప్రజా అవసరాలకు అనుగుణంగా కార్యాచరణ రూపొందించి పట్టణ అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో వరదల నివారణ చర్యలు, ఘన వ్యర్థాల నిర్వహణ, పట్టణ పరిశుభ్రత, మొక్కల నాటకం, ఎస్ఐఆర్ ప్రక్రియ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ అంశాలపై సమగ్ర కార్యాచరణ రూపొందించేందుకు త్వరలోనే మరో సమావేశం నిర్వహిస్తామని కలెక్టర్ వెల్లడించారు.

**అభివృద్ధి కోసం అందరూ కలిసి పనిచేయాలి – ఎమ్మెల్యే**

మున్సిపాలిటీ అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు పరస్పర సమన్వయంతో ముందుకు సాగాలని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎటువంటి విభేదాలకు తావు లేకుండా అందరూ కలిసి పనిచేయాలని సూచించారు. ప్రతి వార్డులో నెలకొన్న సమస్యలను గుర్తించి పరిష్కరించే దిశగా కౌన్సిలర్లు చొరవ చూపాలని కోరారు. సమస్యలు ఎదురైతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించాలని పేర్కొన్నారు.

**సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారాలపై కఠిన చర్యలు – ఎస్పీ**

ప్రజలంతా సామరస్య వాతావరణంలో కలిసి మెలిసి జీవించాలని జిల్లా ఎస్పీ జానకి షర్మిల పిలుపునిచ్చారు. సామాజిక మాధ్యమాలను బాధ్యతాయుతంగా వినియోగించాలని సూచించారు. వ్యక్తిగత దూషణలు, విద్వేషపూరిత వ్యాఖ్యలు లేదా కల్లోలాలు సృష్టించే విధంగా వ్యవహరించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏవైనా సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే పోలీసులను సంప్రదించాలని ప్రజలకు సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఏఎస్పీ సాయి కిరణ్, మున్సిపల్ చైర్మన్ దత్తాత్రి, మున్సిపల్ కమిషనర్ యాదయ్య, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆదిలాబాద్ జిల్లాలో రికార్డు స్థాయిలో జొన్నల కొనుగోళ్లు

**- జిల్లా కలెక్టర్ రాజర్షి షా**



ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 06, (విజన్ ఆంధ్ర) ఆదిలాబాద్ జిల్లా లో యాసంగి 2025-26 సీజన్‌కు సంబంధించిన జొన్నల కొనుగోలు ప్రక్రియ విజయవంతంగా, పారదర్శకంగా కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధర అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టగా, జిల్లా యంత్రాంగం సమన్వయంతో కొనుగోళ్లు సమర్థవంతంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సీజన్‌లో జిల్లావ్యాప్తంగా సుమారు 1.12 లక్షల ఎకరాల్లో జొన్నల సాగు జరిగి, గతంలో ఎన్నడూ లేనివిధంగా దాదాపు 16 లక్షల క్వింటాళ్ల దిగుబడి నమోదైనట్లు తెలిపారు. రైతుల స్వీయ వినియోగం మినహాయించి సుమారు 7 లక్షల క్వింటాళ్ల జొన్నలు మార్కెట్‌కు వచ్చే అవకాశం ఉందని వెల్లడించారు. గత యాసంగి సీజన్‌లో 13 కొనుగోలు కేంద్రాల ద్వారా 56 వేల మెట్రిక్ టన్నుల జొన్నలు సేకరించగా, ఈసారి రైతులకు మరింత చేరువగా సేవలు అందించేందుకు కొనుగోలు కేంద్రాల సంఖ్యను 26కు పెంచినట్లు తెలిపారు. దీంతో రైతులు తమ సమీప కేంద్రాల్లోనే పంటను విక్రయించే అవకాశం పొందారని పేర్కొన్నారు. ప్రస్తుతం జిల్లాలోని 26 కొనుగోలు కేంద్రాల ద్వారా 19,889 మంది రైతుల నుంచి సుమారు 5.87 లక్షల క్వింటాళ్ల జొన్నలను కొనుగోలు చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. కొనుగోలు ప్రక్రియ తుది దశలో ఉందని, మరో రెండు మూడు రోజుల్లో పూర్తయ్యే అవకాశం ఉందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, విశ్రాంతి సౌకర్యాలు తదితర మౌలిక వసతులు కల్పించామని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను చెల్లించడంతో పాటు కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన నగదు రైతుల బ్యాంకు ఖాతాల్లో సకాలంలో జమయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

# నేషనల్ యోగా పోటీల్లో రామగుండం పోలీస్ మార్క్!!

**- జాతీయ స్థాయిలో మెరిసిన పెద్దపల్లి కానిస్టేబుల్**

**- ఆలిండియా పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో 'శ్రీలత'కు బ్రాంజ్ మెడల్**

**- విధులతో పాటు క్రీడల్లోనూ రాణించడం తోటి సిబ్బందికి స్ఫూర్తిదాయకం**

**- సీపీ అంబర్ కిశోర్ ఝా**



పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూన్ 6 (విజన్ ఆంధ్ర) : రామగుండం పోలీస్ కమిషనరేట్ కీర్తిపతాకాన్ని జాతీయ స్థాయిలో ఎగురవేసిన మహిళా కానిస్టేబుల్ శ్రీలతకు శనివారం కమిషనరేట్ కార్యాలయంలో ఘనమైన సత్కారం లభించింది. హర్యానా రాష్ట్రం కర్నాల్ వేదికగా ఈ సంవత్సరం మే 23న అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన '3వ ఆలిండియా పోలీస్ స్పోర్ట్స్ మీట్'లో ఆమె అద్భుత ప్రతిభ కనబరిచారు. ముఖ్యంగా 35 నుంచి 45 సంవత్సరాల వయో విభాగంలో జరిగిన హోరాహోరీ యోగా పోటీల్లో శ్రీలత తన అసాధారణ నైపుణ్యంతో రాణించి, కాంస్య పతకాన్ని (బ్రాంజ్ మెడల్) కైవసం చేసుకున్నారు. పెద్దపల్లి జోన్‌కు చెందిన ఈ మహిళా కానిస్టేబుల్ సాధించిన ఈ చారిత్రాత్మక విజయం పట్ల రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. జాతీయ స్థాయిలో పోలీస్ రంగానికి చెందిన క్రీడా పోటీల్లో మెడల్ సాధించి, కమిషనరేట్ ప్రతిష్టను హిమగిరి శిఖరాలంత ఎత్తుకు తీసుకెళ్లిన శ్రీలతను సీపీ తన చాంబర్‌లో శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ, పోలీస్ విధుల్లో ఉండే మానసిక ఒత్తిడిని, పనిభారాన్ని అధిగమిస్తూ క్రమశిక్షణతో కూడిన యోగా సాధన ద్వారా ఈ పతకాన్ని కైవసం చేసుకోవడం మిగతా సిబ్బంది అందరికీ ఒక గొప్ప స్ఫూర్తి అని అన్నారు. విధి నిర్వహణతో పాటు క్రీడల్లోనూ ఇంతటి ప్రతిభ కనబరిచిన శ్రీలతను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను అని తెలిపారు. భవిష్యత్తులో ఆమె జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని మెడల్స్ సాధించి, పోలీస్ శాఖకు మరింత పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షిస్తూ, కమిషనరేట్ తరపున ఆమెకు పూర్తి మద్దతు ఉంటుంది అని అన్నారు. ఈ అపురూప సత్కార కార్యక్రమంలో గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, కమాన్‌పూర్ ఎస్ఐ ప్రసాద్‌లతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొని శ్రీలతకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# రుతుపవనాల రాక నేపథ్యంలో వరి కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలి

**రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు**



నిర్మల్ జిల్లా,జూన్ 06,(విజన్ ఆంధ్ర);మరో రెండు రోజుల్లో రుతుపవనాలు తెలంగాణ రాష్ట్రాన్ని తాకనున్న నేపథ్యంలో జిల్లాల్లో మిగిలి ఉన్న వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన హైదరాబాద్ నుండి వరి కొనుగోలు ప్రక్రియ, ఈ నెల 9న నిర్వహించనున్న మండల మహిళా సమాఖ్య సభ్యులకు ఆర్టీసీ బస్సుల పంపిణీ కార్యక్రమం, అలాగే నీట్ పరీక్ష నిర్వహణ ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. భైంసా సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతోందని తెలిపారు. తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే లారీల ద్వారా మిల్లులు, గోదాములకు తరలిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే పలు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఖాళీ అయ్యాయని, మిగిలిన ధాన్యం కొనుగోలు ప్రక్రియను కూడా త్వరితగతిన పూర్తి చేస్తామని పేర్కొన్నారు. జూన్ 9న హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న మండల మహిళా సమాఖ్యలకు ఆర్టీసీ బస్సుల పంపిణీ కార్యక్రమానికి జిల్లా నుంచి లబ్ధిదారులను తరలించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# బాలల బాల్యం బడులకు అంకితం కావాలి

**- భవిష్యత్ భారతదేశం బాలలదే**

**- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**

**- బాల కార్మికులు, బాల్య వివాహాలు, బిక్షాటన, పిల్లల అక్రమ రవాణా నిర్మూలనకు సమష్టి కృషి**

**- కపర్ల గ్రామంలో నిర్వహించిన బాల పంచాయత్ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఎస్పీ**

**- సమస్యలను తెలియజేస్తున్న చిన్నారులు**



ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 06, (విజన్ ఆంధ్ర) ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలంలోని కపర్ల గ్రామంలో శనివారం నిర్వహించిన బాల పంచాయత్ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాల కార్మికులు, వ్యభిచార గృహాలు, బిక్షాటన, బాల్య వివాహాలు, పిల్లల అక్రమ రవాణా వంటి సామాజిక సమస్యలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని సూచించారు. బాల పంచాయత్ ద్వారా పిల్లల సమస్యలను నేరుగా తెలుసుకునే అవకాశం లభిస్తుందని తెలిపారు. పిల్లలను చదువుకు దగ్గర చేయడం, విద్య యొక్క ప్రాధాన్యతను గుర్తించి వారి భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దడం ప్రతి తల్లిదండ్రుల బాధ్యత అని పేర్కొన్నారు. ముఖ్యంగా బాలికల విద్య పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పాఠశాలల్లో వేధింపులు, వివక్షకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. బాల బాలికలను సమానంగా చూడాలని, బాలికల పట్ల వివక్ష చూపకూడదని తెలిపారు. గ్రామాల్లో చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీలను ఏర్పాటు చేసి బాలల సంక్షేమం, భద్రతపై నిరంతర సమీక్ష నిర్వహించాలని తెలిపారు. ఇళ్లలో, పాఠశాలల్లో చైల్డ్ ఫ్రెండ్లీ విధానాలను అమలు చేయాలని, సమస్యలను నిర్భయంగా తెలియజేసిన విద్యార్థులను అభినందించారు. సమస్యల పరిష్కారంతో పాటు భవిష్యత్తులో సరైన నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్ రాజేశ్వర్ మాట్లాడుతూ, బాల బాలికలకు సమాన విద్యా అవకాశాలు కల్పించాలని తెలిపారు. గ్రామాల్లో బాల్య వివాహాల నివారణకు ప్రత్యేక తీర్మానాలు చేపట్టాలని, తల్లిదండ్రులు గంజాయి, గుట్కా వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండేలా కుటుంబ సభ్యులను పర్యవేక్షించాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా అవకాశాలు, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విద్యార్థులు బాల్య వివాహాలు, సోషల్ మీడియా వినియోగంపై అప్రమత్తత, చెడు అలవాట్లు, ఉపాధి అవకాశాలు, చదువు పట్ల ఆసక్తి, తల్లిదండ్రుల మధ్య సమస్యలు పిల్లలపై చూపుతున్న ప్రభావం, క్రీడల ప్రాధాన్యత, గ్రామంలో మరుగుదొడ్ల సమస్యలు తదితర అంశాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి. మౌనిక , అదనపు కలెక్టర్ రాజేశ్వర్, డీఈవో మాధవి, ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, డిసిపిఓ రాజేంద్ర ప్రసాద్, ష్యూర్ ఎన్జీవో కోఆర్డినేటర్ వినోద్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ సీసీఎస్ సీఐ చంద్రశేఖర్, ఉమెన్ సేఫ్టీ వింగ్ సీఐ దాసు, కపర్ల సర్పంచ్ అరుణ్, ఆదిలాబాద్ రూరల్ సీఐ రహీం పాషా, తాంసి ఎస్ఐ ఎస్. జీవన్ రెడ్డి, గ్రామ పెద్దలు, అధికారులు, విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలోనే పల్లి (బి) ఆదర్శ గ్రామంగా నిలవాలి

**-జిల్లా కలెక్టర్ రాజర్షిషా**



ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి,జూన్ 06, (విజన్ ఆంధ్ర )ఆదిలాబాద్ జిల్లా లోనే తలమడుగు మండలంలోని పల్లి(బి) గ్రామం ఆదర్శ గ్రామంగా నిలవాలని, జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ప్రజాపాలన -ప్రగతిప్రణాళిక లో భాగంగా తలమడుగు మండలం పల్లి(బి) గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా వివిధ శాఖల అధికారులు ఆయా శాఖల అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు వివరాలను గ్రామసభలో వివరించారు. ఈ సందర్భంగా గ్రామస్తుల నుంచి నేరుగా వినతులు స్వీకరించి, ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి తక్షణ పరిష్కారానికి క్షేత్రస్థాయిలోనే అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాబోయే వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో నీటి సంరక్షణ, వ్యవసాయ ప్రణాళికలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున, రైతులు వ్యవసాయ అధికారుల సూచనల మేరకు సాగు దిగుబడి పెంచే ట్రైకోడెర్మా వంటి పద్ధతులు పాటించాలని కోరారు. అలాగే, భూగర్భ జలాల పునరుద్ధరణకు ప్రతి బోర్ వెల్‌తో పాటు ఒక రీఛార్జ్ స్ట్రక్చర్‌ను తప్పనిసరిగా నిర్మించుకోవాలని సూచించారు. పారిశుధ్య నిర్వహణలో భాగంగా తడి, పొడి చెత్త సేకరణను పక్కాగా అమలు చేయాలని, హరితహారంలో భాగంగా ప్రతి ఇంటి పరిధిలోనూ, అటవీ ప్రాంతాలలోనూ పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో మహిళా భద్రత, సురక్షిత ప్రయాణాలపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆదర్శవంతమైన గ్రామాలుగా నిలవాలంటే యువత మత్తు పదార్థాలు, గంజాయి, ప్రాణాంతక క్యాన్సర్లకు దారితీసే తంబాకు, జర్దా వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని, వాటికయ్యే ఖర్చును పౌష్టికాహారం, ఆరోగ్యం కోసం ఉపయోగించుకోవాలని హితవు పలికారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై బి.ఎల్.ఓలు జూన్ 24 లోగా 100% ఓటరు జాబితా మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని, జూన్ 25 నుండి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేయాలని ఆదేశించారు. గ్రామ అభివృద్ధి పనులైన మిషన్ భగీరథ పైప్‌లైన్ విస్తరణ, సిసి రోడ్లు, వైకుంఠ ధామాలు, అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి సంబంధించిన అంచనాలను పరిశీలించి త్వరలోనే నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే, నవంబర్ చివరి నాటికి 'గ్రామ సంఘం భవనం' నిర్మాణాన్ని పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని, 'మన ఊరు – మన బడి' కింద పెండింగ్‌లో ఉన్న నిధులను త్వరలోనే విడుదల చేస్తామని స్పష్టం చేశారు. విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీష్, గణితం, సైన్స్ సబ్జెక్టులలో నాణ్యమైన విద్యనందించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యుత్ సమస్యల పరిష్కారంలో భాగంగా 'దాజుగా' స్కీమ్ కింద అర్హులైన ప్రతి ఎస్టీ (రా) కుటుంబానికి ఉచితంగా కరెంట్ మీటర్లు అందించాలని, గ్రామాల్లో వంగిపోయిన, తుప్పు పట్టిన విద్యుత్ స్తంభాలను, లూజ్ లైన్లను యుద్ధప్రాతిపదికన సరిచేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో భాగంగా భూగర్భ జలాల పునరుద్ధరణకు ప్రతి బోర్ వెల్‌తో పాటు ఒక రీఛార్జ్ స్ట్రక్చర్‌ను తప్పనిసరిగా నిర్మించుకోవాలని గ్రామసభలో కలెక్టర్ సమక్షంలో తీర్మానం చేశారు. ఈ గ్రామ సభ కార్యక్రమంలో తహసీల్దార్ రాజ్ మోహన్, ఎంపీడీవో శంకర్, సర్పంచ్ కట్కం సంజీవ్, పంచాయతీ కార్యదర్శి బాలాజీ, మండల విద్యా, వైద్య, వ్యవసాయ, విద్యుత్, గృహ నిర్మాణ, పంచాయతీ, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలలో అవగాహన పెంపొందించేందుకే గ్రామ, వార్డు సభలు

**- తాగునీటి అవసరాల కోసం త్వరలో నిజాంసాగర్ ద్వారా నీటి విడుదల**

**- ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలి పంటల మార్పిడి ఆవశ్యకతను గుర్తించాలి**

**- హుమ్నాపూర్ గ్రామ సభలో కలెక్టర్ ఇలా త్రిపాఠి వెల్లడి**






నిజామాబాద్, జూన్ 06 :( విజన్ ఆంధ్ర) సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు వివిధ అంశాలపై ప్రజలలో అవగాహన పెంపొందించాలనే సదుద్దేశ్యంతో ప్రభుత్వం ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా గ్రామ పంచాయతీలలో గ్రామ సభలను, మున్సిపల్ పట్టణాలలో వార్డు సభలను నిర్వహిస్తోందని కలెక్టర్ ఇలా త్రిపాఠి వెల్లడించారు. వర్ని మండలం హుమ్నాపూర్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో శనివారం స్థానిక సర్పంచ్ అప్పిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన గ్రామ సభకు కలెక్టర్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. జయజయహే తెలంగాణ గీతాలాపనతో సభకు శ్రీకారం చుట్టి, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సందేశాన్ని చదివి వినిపించారు. పంటల మార్పిడి, సరైన మోతాదులో ఎరువుల వినియోగం, రక్షిత మంచినీటి సరఫరా, వర్షపు నీటిని ఒడిసిపట్టడం, భూగర్భ జలాల సంరక్షణ, విరివిగా మొక్కల పెంపకం, పర్యావరణ సమతుల్యాన్ని కాపాడడం, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ, వానాకాలంలో సీజనల్ వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వ్యవసాయ రంగంలో నిజామాబాద్ జిల్లా అరుదైన ఘనతను కలిగి ఉన్నదని గుర్తు చేశారు. పరిస్థితులకు అనుగుణంగా పంటల మార్పిడి విధానాన్ని అవలంభిస్తూ సాగు రంగంలో ప్రత్యేకతను చాటాలని రైతులకు సూచించారు. ఎల్ నినో ప్రభావం వల్ల తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నందున, తక్కువ సాగు నీటి అవసరం కలిగిన పంటలను విత్తుకోవాలని హితవు పలికారు. ప్రభుత్వం నోటిఫై చేసిన ఆయా పంట రకాలనే సాగు చేయాలని, నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. నకిలీ, నాసిరకం విత్తనాలను విక్రయించే డీలర్ల లైసెన్సులు రద్దు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలని, అర్హులైన రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వ సబ్సిడీలు, ఇతర ప్రయోజనాలు పొందేందుకు ఫార్మర్ రిజిస్ట్రీ దోహదపడుతుందని తెలిపారు. కాగా, వర్షాభావ పరిస్థితులు తలెత్తినా కూడా బోధన్, నిజామాబాద్ పట్టణాలు, నిర్దేశిత గ్రామాలకు తాగునీటి ఇబ్బందులు ఏర్పడకుండా ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇందులో భాగంగానే రానున్న రెండు రోజులలో నిజాంసాగర్ నీటిని విడుదల చేయించి, బెల్లాల్ చెరువులోకి మళ్లించడం జరుగుతుందన్నారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని, పరిసరాల పరిశుభ్రతను పాటించడం ద్వారా ఈగలు, దోమల వ్యాప్తిని నివారించవచ్చని, తద్వారా వ్యాధులు సోకకుండా కాపాడుకోవచ్చని సూచించారు. ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలను గ్రామ పంచాయతీలు తప్పనిసరిగా అమలు చేయాలని అన్నారు. తడి, పొడి, శానిటరీ, ప్రత్యేక వ్యర్థాలను వేర్వేరుగా సేకరించాలన్నారు. ప్రత్యేక ఓటరు సవరణ(ఎస్.ఐ.ఆర్) కార్యక్రమం గురించి ప్రజలకు సులభంగా అర్థమయ్యే రీతిలో కలెక్టర్ బోర్డుపై ముఖ్యమైన తేదీలు, ఇతర వివరాలు రాస్తూ అవగాహన కల్పించారు. జూన్ 25 నుండి బీ.ఎల్.ఓలు ఇంటింటికి తిరుగుతూ ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ నిర్వహిస్తారని, వారికి సహకరించాలని ప్రజలను కోరారు. ప్రతి ఒక్కరు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని, మహిళలు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించుకుంటూ ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ హితవు పలికారు. అర్హులైన వారు ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ది పొందేలా చొరవ చూపాలన్నారు. గ్రామ సభలో బోధన్ ఆర్డీఓ విజయలక్ష్మి, మండల ప్రత్యేక అధికారి మధుసూదన్, ఏసీపీ శ్రీనివాస్, డీ.ఎల్.పీ.ఓ శ్రీనివాస్, తహసిల్దార్ ప్రశాంత్, స్థానిక అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలు నిర్మూలించి..

**- ఉన్నత చదువులు చదివించాలి**

**- ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలి**

**- అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్**

**- పిన్నంచెర్లలో 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' గ్రామ సభ**



వనపర్తి జిల్లా ప్రతినిధి, జూన్ 6 (విజన్ ఆంధ్ర) : జిల్లాలో బాల్య వివాహాలను నిర్మూలించి, అమ్మాయిలను ఉన్నత చదువులు చదివించాలని అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్యా నాయక్ సూచించారు. శనివారం ఆత్మకూరు మండలంలోని పిన్నంచెర్ల గ్రామ పంచాయతీలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా ప్రత్యేక గ్రామ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్యా నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల స్థాయి అధికారులు రోడ్డు భద్రత, బాల్యవివాహాల నిర్మూలన, వర్షాకాలం నేపథ్యంలో ఇంకుడు గుంతల ఏర్పాటు, పరిసరాల పరిశుభ్రత, వన మహోత్సవం, జల సంరక్షణ, పాఠశాలల్లో సౌకర్యాలు సహా తదితరాంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో బాల్య వివాహాలను నిర్మూలించి, అమ్మాయిలను ఉన్నత చదువులు చదివించాలని సూచించారు. ప్రస్తుతం జిల్లాలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలు ఉన్నాయని కాబట్టి తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి చదివించాలని సూచించారు. అమ్మాయిలకు బాల్యవివాహాలు చేయకుండా ఉన్నత చదువులు చదివించాలని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు మంచి ఫలితాలు వచ్చాయని కాబట్టి ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం అర్హులైన ఓటర్లందరినీ జాబితాలో చేర్చేందుకు ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ కార్యక్రమం నిర్వహిస్తుందని ఇందులో ప్రతి ఒక్కరూ పాల్గొని అధికారులకు సహకరించాలని సూచించారు. అదేవిధంగా గ్రామంలో గత ఐదేళ్ల వ్యవధిలో 18 ఏళ్ల నుండి 59 ఏళ్లలోపు వ్యక్తులు ఎవరైనా మరణిస్తే జాతీయ కుటుంబ ప్రయోజన పథకం ద్వారా దరఖాస్తు చేసుకొని రూ. 20 వేల లబ్ధి పొందవచ్చని తెలిపారు. ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా గ్రామంలో భూగర్భ జలాలు పెరిగి మంచినీటి సదుపాయాలు కలుగుతాయి అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్పీఓ రఘునాథ్, మండల స్థాయి అధికారులు, గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ స్థాయి సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# నన్నెవరూ ఆపలేరు..!

- ఇసుక మాఫియా డాన్ అలియాస్ పండు ఆగడాలు మితిమీరాయా..?
- ఏసీబీ పేరు చెప్పి అధికారులను బెదిరిస్తున్నాడా..?
- బూర్గంపహాడ్‌లో అక్రమ ఇసుక దందాకు అండ ఎవరిది..?




**పాల్వంచ ప్రతినిధి, జూన్ 6 (విజన్ ఆంధ్ర) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా అక్రమ ఇసుక రవాణాపై పోలీసులు, రెవెన్యూ అధికారులు కఠిన చర్యలులి లిచేపడుతున్నప్పటికీ బూర్గంపహాడ్ మండలంలో మాత్రం ఇసుక మాఫియా దందా యథేచ్ఛగా కొనసాగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగాలి లి"పండు" అలియాస్‌గా గుర్తింపు పొందిన వ్యక్తి పేరు స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పాల్వంచ పట్టణ పరిధిలో అధిక లోడ్‌తో వెళ్తున్న ఇసుక లారీని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకోవడంతో అక్రమ ఇసుక రవాణా వ్యవహారం మరోసారి వెలుగులోకి వచ్చింది. అయితే ఈ అక్రమ వ్యాపారానికి మూలాలు బూర్గంపహాడ్ మండలంలోనే ఉన్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. స్థానికుల కథనం ప్రకారం, అనుమతి ఉన్న ర్యాంపుల పేరుతో ఇసుకను తరలించి, రాత్రివేళల్లో బూర్గంపహాడ్ మండల కేంద్రం నుండి బుడ్డగుడేం ప్రాంతాల్లో డంప్ చేసి, ఉదయం వేళల్లో ఓవర్‌లోడ్ వాహనాలతో కొత్తగూడెం ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారానికి పండే కీలక సూత్రధారి అని పలువురు పేర్కొంటున్నారు. ముఖ్యంగా ఏసీబీ పేరు ప్రస్తావిస్తూ అధికారులనే బెదిరించే ధోరణితో వ్యవహరిస్తున్నాడనే ఆరోపణలు ఇప్పుడు చర్చకు దారితీస్తున్నాయి. "ఎవరైనా అడ్డొస్తే ఏసీబీకి ఫిర్యాదు చేస్తా", "అధికారులపై కేసులు పెట్టిస్తా" అంటూ భయపెట్టడం ద్వారా తన అక్రమ కార్యకలాపాలకు అడ్డంకులు లేకుండా చేసుకుంటున్నాడని స్థానిక వర్గాలు ఆరోపిస్తున్నాయి. ఇంతటి ఆరోపణలు వినిపిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కొందరు అధికారుల అండదండలు, మరికొందరి నిర్లక్ష్యం కారణంగానే అక్రమార్కులు రెచ్చిపోతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా ఎస్పీ అక్రమ ఇసుక రవాణాపై ఉక్కుపాదం మోపుతున్న నేపథ్యంలో బూర్గంపహాడ్ మండలంలో జరుగుతున్న ఈ వ్యవహారాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. ఏసీబీ పేరును అడ్డంగా పెట్టుకుని అధికారులను భయపెడుతున్నారనే ఆరోపణల్లో ఎంత నిజం ఉందో విచారించి, అక్రమ ఇసుక రవాణా వెనుక ఉన్న అసలు నెట్‌వర్క్‌ను బట్టబయలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. "చట్టాన్ని గౌరవించే వారిని బెదిరించడం సులభమే కావచ్చు... కానీ చట్టం చేతిలో పడితే తప్పించుకోవడం అంత సులభం కాదు" అని ప్రజలు హెచ్చరిస్తున్నారు.

## గౌడ్ ఆఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (గోపా) 1975 మహబూబ్‌నగర్ జిల్లా సన్నాహక సమావేశం ఘన విజయం.

మహబూబ్‌నగర్ జూన్ 06, (విజన్ ఆంధ్ర) : గౌడ్ ఆఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (గోపా) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈరోజు సాయంత్రం 5 గంటలకు మహబూబ్‌నగర్ పట్టణంలోని లక్ష్మీ గార్డెన్స్‌లో జిల్లా సన్నాహక సమావేశం ఘనంగా నిర్వహించబడింది. ఈ సమావేశాన్ని " గోపా " మాజీ జిల్లా అధ్యక్షులు బాగన్న గౌడ్ (విశ్రాంత పోలీసు అధికారి) మరియు పీఆర్‌టీయూ జిల్లా గౌరవాధ్యక్షులు రాజశేఖర్ గౌడ్ లు నిర్వహించిన ఈ సమావేశానికి 50 మంది సభ్యులు హాజరు కావడం జరిగినది. ఈ కార్యక్రమానికి " గోపా " రాష్ట్ర కమిటీ తరపున ఆర్గనైజింగ్ సెక్రటరీ యల్మకంటి మీరయ్య గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై, 1975 " గోపా " స్థాపన నుంచి నేటి వరకు సంస్థ చేపట్టిన సామాజిక, విద్యా మరియు ఉద్యోగ సంబంధిత కార్యక్రమాలను వివరించారు. అలాగే భవిష్యత్తులో గౌడ్ సమాజ అభ్యున్నతి, యువత ప్రోత్సాహం, విద్యా అవకాశాల విస్తరణ, ఉద్యోగ మార్గదర్శక కార్యక్రమాలు మరియు సంఘటిత కార్యాచరణపై సంస్థ చేపట్టబోయే కార్యక్రమాలను సభ్యులకు వివరించారు. సమావేశంలో జిల్లా వ్యాప్తంగా



ఉన్న గౌడ్ ఆఫీషియల్స్, ప్రొఫెషనల్స్ మరియు ప్రముఖులు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు. ముఖ్యంగా సత్యనారాయణ గౌడ్, పబ్బ శశిధర్ గౌడ్, రాజయ్య గౌడ్, శ్రీధర్ గౌడ్, పురుషోత్తమ్ గౌడ్, నారాయణ గౌడ్, వెంకటేష్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, మోహన్ గౌడ్, తిరుపతయ్య గౌడ్ తదితరులు మాట్లాడారు. హాజరైన సభ్యులు మాట్లాడిన తర్వాత జిల్లా స్థాయిలో "గోపా " కమిటీని త్వరలో ఏర్పాటు చేయాలని, సంస్థ కార్యక్రమాలను గ్రామ స్థాయి వరకు విస్తరించాలని ఏకగ్రీవంగా నిర్ణయించారు. జిల్లా కమిటీ ఏర్పాటు విషయంలో అందరూ తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ ఏకగ్రీవ సమ్మతి తెలిపారు. ఈ సమావేశం ఉత్సాహభరిత వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.

# రికార్డు స్థాయిలో తగ్గిన బొగ్గు నిల్వలు!!

- పదేళ్లలో అత్యల్పంగా 26.51 లక్షల టన్నుల నిల్వలు
- పనులు మధ్యలో ఆగిపోకుండా ముందస్తు అంచనా కోసం సైట్ విజిట్
- మెడికల్ బోర్డు అక్రమాలపై ఏసీబీ, విజిలెన్స్ విచారణ
- సింగరేణి యాజమాన్యం వెల్లడి




**హైదరాబాద్, జూన్ 6:** దక్షిణాది రాష్ట్రాల విద్యుత్ అవసరాలను తీర్చడంలో కీలక పాత్ర పోషిస్తున్న సింగరేణి సంస్థలో బొగ్గు నిల్వలు గణనీయంగా తగ్గాయి. గత పదేళ్ల చరిత్రలోనే అత్యల్పంగా ఈ నెల 4వ తేదీ నాటికి కేవలం 26.51 లక్షల టన్నుల బొగ్గు నిల్వలు మాత్రమే ఉన్నట్లు సింగరేణి యాజమాన్యం శనివారం ఒక ప్రకటనలో తెలిపింది.

గతంలో (2014 నుండి 2024 మధ్య) గనులు, సీహెచ్పీల వద్ద సగటున 50 లక్షల టన్నుల నిల్వలు ఉండేవి. 2015–16లో 70 లక్షల టన్నులు, 2016–17లో 74 లక్షల టన్నుల బొగ్గు నిల్వలు రికార్డయ్యాయి. వీటికి విరుద్ధంగా ప్రస్తుతం స్టాక్ సగానికి పడిపోయింది. సాధారణంగా వర్షాకాలంలో థర్మల్ కేంద్రాలకు నిరాటంకంగా సరఫరా చేయడానికి కనీసం 15 రోజులకు సరిపడా (30 లక్షల టన్నులు) బొగ్గు నిల్వలు ఉండటం అత్యవసరమని, తాజా పరిస్థితిని గమనిస్తూ రవాణాను క్రమబద్ధీకరిస్తున్నట్లు సంస్థ వివరించింది.

### 'సైట్ విజిట్ సర్టిఫికేట్' ఎందుకు?

ఓవర్ బర్డెన్ (పై మట్టి) తొలగింపు టెండర్లలో 'సైట్ విజిట్ సర్టిఫికేట్' నిబంధనను ప్రవేశపెట్టడంపై యాజమాన్యం స్పష్టతనిచ్చింది.

### పనులు మధ్యలో ఆపేయడం వల్లే:

గతంలో కొందరు కాంట్రాక్టర్లు స్థానిక భౌగోళిక, సామాజిక పరిస్థితులపై అవగాహన లేకుండా టెండర్లు దక్కించుకొని, పనులను మధ్యలోనే వదిలేశారు (ఉదాహరణకు: శ్రీరాంపూర్ ఓసీ–2, ఐకే ఓసీ ప్రాజెక్టులు). దీనివల్ల సంస్థ ఉత్పత్తి లక్ష్యాలు దెబ్బతిన్నాయి.

### ఆరోగ్యకరమైన పోటీ కోసమే:

టెండర్ దారులు పని ప్రదేశం, భద్రతా ప్రమాణాలను ముందే అంచనా వేసి కచ్చితమైన రేట్లు కోట్ చేయడానికే మే 2025 నుండి ఈ నిబంధన తెచ్చారు. ఇది పోటీని తగ్గించడానికి కాదని స్పష్టం చేసింది. మంచి ఫలితాలు:లి ఎన్ఎండిసి, జిఎండిసి వంటి ప్రభుత్వ సంస్థల్లో ఇప్పటికే అమల్లో ఉన్న ఈ విధానం వల్ల ప్రస్తుతం సింగరేణిలో ఓబీ పనులు ఎలాంటి ఆటంకాలు లేకుండా విజయవంతంగా సాగుతున్నాయి.

### మెడికల్ బోర్డు అక్రమాలపై ఏసీబీ విచారణ తీవ్రం

కారుణ్య, డిపెండెంట్ ఉద్యోగాల నియామకాలకు సంబంధించి మెడికల్ బోర్డులో జరుగుతున్న అక్రమాలపై యాజమాన్యం కఠినంగా వ్యవహరిస్తోంది. కార్మికులను మోసం చేస్తున్న దళారులపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో, సింగరేణి యాజమాన్యమే స్వయంగా రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కు లిఖితపూర్వక ఫిర్యాదు చేసింది. ఈ కేసులో ఇప్పటికే ఇద్దరు ఉద్యోగులను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేయగా, వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం ఏసీబీ విచారణతో పాటు సింగరేణి విజిలెన్స్ విభాగం అంతర్గత విచారణను కూడా వేగవంతం చేసినట్లు చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ వెల్లడించారు.

**గడ్డం రాజు**
స్పెషల్ కరస్పాండెంట్ (విజన్ ఆంధ్ర)

# నోటి కంట్రోల్... లైఫ్ సూపర్ కూల్!!

- టాక్ లిమిట్... బాండ్స్ అన్‌లిమిటెడ్
- మాటల్లో, తిండిలో బ్యాలెన్స్
- ఈట్ రైట్.. ఫీల్ లైట్
- మైండ్‌ఫుల్ ఈటింగ్... హెల్దీ లివింగ్
- నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుంది.. నిజమే కదా బాసు
- పెద్దల మాటలు ఓల్డ్ ఫ్యాషన్ కాదు... గోల్డెన్ గైడెన్స్!




*"విజన్ ఆంధ్ర" అందిస్తున్న జీవిత సత్యం చదివేయండి.... అలాగే కొంతలో కొంత ఫాలో అవ్వండి*

**హైదరాబాద్, జూన్ 6 :** *నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుంది. చిన్నప్పుడు అమ్మమ్మలు, తాతయ్యలు పదే పదే చెప్పిన ఈ ముక్క వెనుక ఎంత నిగూఢమైన సత్యం ఉందో కదా! కానీ, ఇవాళ్టి మన 2జీ,3జీ,4జీ,5G స్పీడు జీవితంలో ఆ నిదానం ఎక్కడో తప్పిపోతోంది. ఉదయం లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు ఏదో తెలియని పరుగు. ఆ పరుగులో మనం ఏం మాట్లాడుతున్నామో, ఏం తింటున్నామో గమనించే టైమే ఉండట్లేదు. కాస్త ఆలోచించండి... మన లైఫ్‌ను హ్యాపీగా, పీస్‌ఫుల్‌గా మార్చుకోవడానికి పెద్దగా కష్టపడక్కర్లేదు. కేవలం మన నోటినిఅదుపులో పెట్టుకుంటే చాలు. అది తినడంలో అయినా, మాట్లాడటంలో అయినా!!*

### మాటల్లో కంట్రోల్.. హార్ట్ ఫుల్ కనెక్షన్స్..

ఈ రోజుల్లో ప్రతి ఒక్కరికీ స్ట్రెస్ ఎక్కువే. బాస్ మీద కోపమో, ట్రాఫిక్ వల్ల వచ్చిన చిరాకో... ఇంట్లో వాళ్ల మీదో లేదా కొలీగ్స్ మీదో చూపించేస్తుంటాం. అనరాని మాట అనేసి, ఆ తర్వాత సారీ బాస్, ఫ్లోలో వచ్చేసింది అంటే పోయిన బంధాలు తిరిగి వస్తాయా?

### స్మార్ట్ టిప్

ఎవరైనా మిమ్మల్ని కోప్పెట్టేలా మాట్లాడితే... వెంటనే రియాక్ట్ అవ్వకండి. ఒక్క క్షణం గ్యాప్ ఇచ్చి, ఒక దీర్ఘ శ్వాస తీసుకోండి. మౌనం కంటే పవర్ ఫుల్ వెపన్ మరొకటి లేదు. మనం మాట్లాడే ప్రతి మాట ఒకరి మనసును గాయపరిచేలా కాకుండా, గాయాన్ని మాన్పేలా ఉండాలి. మన మాటల్లో వైబ్స్ ఎప్పుడూ పాజిటివ్‌గా ఉండేలా చూసుకుందాం.

### తినడంలో కంట్రోల్.. మైండ్‌ఫుల్ ఈటింగ్..

ఇక రెండోది... తిండి! వీకెండ్ వస్తే చాలు 'చీట్ డే' పేరుతో జంక్ ఫుడ్‌పై పడిపోతాం. రీల్స్ చూస్తూ, టీవీ చూస్తూ ప్లేట్ ఖాళీ చేసేస్తాం. నాలుక రుచిని అదుపు చేయకపోతే... అది నేరుగా మన హెల్త్‌కే ఎఫెక్ట్ ఇస్తుంది. 'అతి సర్వత్ర వర్జయేత్' అన్నారు పెద్దలు.

### క్వాంటిటీ కాదు, క్వాలిటీ!!

ఎంత తింటున్నామనేది కాదు, ఏం తింటున్నామనేది ముఖ్యం. పొట్ట నింపుకోవడం కోసం తినడం కాదు, ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కోసం తినాలి. ఎక్కువగా తినడం కంటే, పోషకాలు ఉన్న ఆహారం తీసుకోవడం ఎంతో మేలు చేస్తుంది.

నాలుక రుచికన్నా శరీర అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. మితమైన ఆహారం మనసుకు ప్రశాంతతను, శరీరానికి శక్తిని అందిస్తుంది. క్వాంటిటీ తగ్గించి, క్వాలిటీ పెంచితే ఆరోగ్యమే అసలైన సంపదగా మారుతుంది.




### గ్యాడ్జెట్స్‌కు నో చెప్పండి

తినేటప్పుడు ఫోన్‌ను పక్కన పెట్టేసి, ఆ ఆహారాన్ని ఎంజాయ్ చేస్తూ తిందాం. అదే నిజమైన 'మైండ్‌ఫుల్ ఈటింగ్'. టీవీ కూడా చూడకుండా తినేద్దాం.

### ప్రశాంతత వైపు అడుగులు

ఈ ఉరుకుల పరుగుల జీవితంలో సక్సెస్ వెనుక పరిగెత్తడం తప్పు లేదు. కానీ ఆ ప్రయాణంలో మన ప్రశాంతతను పణంగా పెట్టకూడదు. నోటిని అదుపులో పెట్టుకోవడం అంటే మన స్వేచ్ఛను కోల్పోవడం కాదు... మనల్ని మనం మరింతగా ప్రేమించుకోవడం. పెద్దల మాటలను ఓల్డ్ ఫ్యాషన్ అని కొట్టేయకుండా, వాటిని మన మోడర్న్ లైఫ్‌స్టైల్‌కు అడాప్ట్ చేసుకుందాం. తినడంలో అయినా, మాటల్లో అయినా... కంట్రోల్ చేద్దాం, ప్రశాంతంగా ఆనందంగా జీవిద్దాం.

**- గడ్డం రాజు**
స్పెషల్ కరస్పాండెంట్ (విజన్ ఆంధ్ర)

# ప్రొహిబిటెడ్ భూమి క్లియర్... తహసీల్దారు లీవ్...?

- కోట్ల భూమి ఫైల్‌కు వేగం...ప్రజల ఫైళ్లకు బ్రేకులా...?
- సెలవు వెనుక సాధారణ కారణమా... లేక అసాధారణ పరిణామాలా...?
- మేడిపల్లి తహసీల్దార్ కార్యాలయంలో అసలేం జరుగుతోంది..?




మేడిపల్లి తహసీల్దార్ కార్యాలయం చుట్టూ జరుగుతున్న పరిణామాలు స్థానికంగా తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. చెంగిచెర్ల సర్వే నంబర్ 33కు సంబంధించిన వివాదాస్పద భూమి ఫైల్‌కు క్లియరెన్స్ లభించిందనే సమాచారం వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో, అదే సమయంలో తహసీల్దారు సెలవుపై వెళ్లినట్లు తెలుస్తుండటంతో పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇప్పటికే దేవాదాయ శాఖ భూములు, ప్రొహిబిటెడ్ లిస్ట్, సర్వే వ్యత్యాసాలు, రికార్డుల భిన్నత, అధికారుల బదిలీలతో వార్తల్లో నిలిచిన సర్వే నంబర్ 33 వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది.

**బోడుప్పల్,జూన్ 7(విజన్ ఆంధ్ర ప్రతినిధి) :**

### 'ఇక ఆర్ఐలు, సర్వేయర్ వంతా..?' కథనం గుర్తు చేస్తున్న తాజా పరిణామాలు

చెంగిచెర్ల సర్వే నంబర్ 33 వ్యవహారంపై గతంలో విజన్ ఆంధ్ర దినపత్రికలో "ఇక ఆర్ఐలు, సర్వేయర్ వంతా..?" అనే శీర్షికతో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. ఆ కథనంలో సర్వే నివేదికలు, రెవెన్యూ రికార్డులు, ఫీల్డ్ స్థాయి పరిశీలనలు, భూముల హద్దుల నిర్ధారణలో అధికారుల పాత్రపై పలు ప్రశ్నలు లేవనెత్తబడ్డాయి. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు, సర్వే నంబర్ 33 చుట్టూ కొనసాగుతున్న చర్చలు, అధికార స్థాయిలో తీసుకుంటున్న నిర్ణయాలు ఆ కథనంలో వ్యక్తమైన సందేహాలను మరోసారి గుర్తు చేస్తున్నాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

### కోట్ల భూమి ఫైల్‌కు ప్రాధాన్యత లభించిందా...?

చెంగిచెర్ల సర్వే నంబర్ 33 భూముల విలువ ప్రస్తుతం వందల కోట్ల రూపాయలకు చేరుకుందని స్థానికంగా ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఆ ఫైల్ పరిశీలనకు ప్రాధాన్యత లభించిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే అదే సమయంలో కుల, ఆదాయ, నివాస, ఈడబ్ల్యూఎస్ ధ్రువపత్రాలు, మ్యుటేషన్ దరఖాస్తులు, ఇతర రెవెన్యూ సేవలకు సంబంధించిన ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నాయని పలువురు దరఖాస్తుదారులు చెబుతున్నారు. దీంతో "ప్రజల ఫైళ్లకు ఒక విధానం... విలువైన భూముల ఫైళ్లకు మరో విధానమా?" అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

### పెండింగ్ ఫైళ్లపై స్పష్టత ఏది...?

తహసీల్దారు సెలవుపై వెళ్లే ముందు కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న ఫైళ్ల పరిష్కారంపై ఎలాంటి మార్గదర్శకాలు ఇచ్చారా? ప్రజా సేవలకు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు జరిగాయా? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. కొంతమంది దరఖాస్తుదారులు తమ ఫైళ్లు ముందుకు కదలడం లేదని చెబుతుండగా, దీనిపై అధికారుల వివరణ కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు.

### తిరిగి బాధ్యతలు స్వీకరిస్తారా...?

తహసీల్దారు సెలవుపై వెళ్లడాన్ని సాధారణ పరిపాలనా ప్రక్రియగా కొందరు చూస్తుండగా, మరికొందరు దీనిపై పలు ఊహాగానాలు వ్యక్తం చేస్తున్నారు. సెలవు అనంతరం తిరిగి అదే కార్యాలయంలో బాధ్యతలు స్వీకరిస్తారా? లేక పరిపాలనా కారణాలతో బదిలీ జరుగుతుందా? అనే చర్చ రెవెన్యూ వర్గాల్లో కొనసాగుతోంది. అయితే ఈ అంశాలపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక సమాచారం వెలువడలేదు.

### ప్రజల్లో నెలకొన్న అనుమానాలు?

- సర్వే నంబర్ 33 ఫైల్‌కు క్లియరెన్స్ ఏ ఆధారాలపై లభించింది?
- సర్వే నివేదికలు, రికార్డుల మధ్య ఉన్న వ్యత్యాసాలపై స్పష్టత ఏమిటి?
- దేవాదాయ శాఖ అభిప్రాయం ఏమిటి?
- పెండింగ్‌లో ఉన్న ప్రజా సేవల ఫైళ్ల పరిస్థితి ఏమిటి?
- ప్రజల్లో నెలకొన్న సందేహాలకు అధికారులు ఎప్పుడు సమాధానం చెబుతారు?

### పారదర్శకతే అనుమానాలకు ముగింపు

చెంగిచెర్ల సర్వే నంబర్ 33 వ్యవహారంపై ప్రజల్లో నెలకొన్న సందేహాలకు ముగింపు పలకాలంటే సంబంధిత అధికారులు పూర్తి వివరాలను వెల్లడించాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. అధికారిక సమాచారం వెలువడినప్పుడే వాస్తవ పరిస్థితిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

## నూతన పైప్ లైన్ పనుల్లో వేగం పెంచాలి

**- మంచి నీటి పైప్ లైన్ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే...**



నిజామాబాద్ జూన్06:( విజన్ ఆంధ్ర) : మిర్చి కాంపౌండ్ కి వెళ్లే దారిలో నూతనంగా వేస్తున్న మంచినీటి పైప్ లైన్ పనుల్లో వేగం పెంచాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. శనివారం నగరంలోని మార్వాడి గల్లీ మిర్చి కాంపౌండ్ వద్ద కొనసాగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... మంచినీటి పైప్ లైన్ లీకేజీ కావడంతో మురికి నీరు చేరి కలుషితం అవుతున్నాయన్నారు దీంతో నూతన పైప్ లైన్ పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. గత 30 ఏళ్లుగా ఉన్న పైప్ లైన్ శిథిలావస్థకు చేరడంతో దెబ్బతిన్నాయన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న నూతన పైప్ లైన్ పనులను నాణ్యతతో చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, వీలైనంత తొందరగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షించాలన్నారు. ఎమ్మెల్యే వెంట కార్పొరేటర్లు బంటు ప్రీతి ప్రవీణ్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగోల్ల లక్ష్మీనారాయణ, మఠం పవన్, నాయకులు పవన్ ముందడ తదితరులు ఉన్నారు.

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.

# జిల్లాలో గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఏర్పాటుకు చర్యలు వేగవంతం చేయాలి

## నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాల కల్పన లక్ష్యం

### జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ జిల్లా,జూన్ 06 (విజన్ ఆంధ్ర); జిల్లాలో గ్రామీణ ప్రాంతాల నిరుద్యోగ యువతీ, యువకులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (RSETI) ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఏర్పాటుకు సంబంధించి శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత యువతకు మార్కెట్ అవసరాలకు అనుగుణంగా వివిధ రంగాల్లో నైపుణ్య శిక్షణ అందించడం ద్వారా ఉపాధి అవకాశాలు పెంపొందించవచ్చని తెలిపారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లీడ్ బ్యాంక్ సహకారంతో జిల్లాలో ఆధునిక సదుపాయాలతో కూడిన ఆర్‌సెటీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ శిక్షణ సంస్థ ద్వారా సంప్రదాయ కోర్సులతో పాటు తేనెటీగల పెంపకం, పుట్టగొడుగుల సాగు, మత్స్య సంపద అభివృద్ధి, పాడి పరిశ్రమ, కంప్యూటర్, ఇతర సాంకేతిక ఆధారిత కోర్సులు, చిన్న వ్యాపారాల నిర్వహణ, సేవారంగానికి సంబంధించిన నైపుణ్య శిక్షణలను అందించే అవకాశాలను పరిశీలించాలని అధికారులకు





సూచించారు. ఈ శిక్షణలు యువతకు స్వయం ఉపాధి అవకాశాలను కల్పించడమే కాకుండా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉట్నూర్, నిజామాబాద్ జిల్లాల్లోని ఆర్‌సెటీ శిక్షణ సంస్థల ద్వారా నిర్వహిస్తున్న కోర్సులు, శిక్షణా విధానాలు, లబ్ధిదారుల ఎంపిక, ఉపాధి కల్పన అవకాశాలు తదితర అంశాలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయా కేంద్రాల విధానాలను అధ్యయనం చేసి నిర్మల్ జిల్లాలో కూడా సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.జిల్లాలో ప్రతిపాదిత శిక్షణ సంస్థ కోసం అవసరమైన స్థలం, మౌలిక సదుపాయాలు, శిక్షణా కార్యక్రమాల రూపకల్పన, నిర్వహణ విధానాలపై సంబంధిత శాఖల అధికారులు పనిచేసి త్వరితగతిన ప్రతిపా దనలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రాంగోపాల్, కార్మిక శాఖ అధికారి రాజలింగు, ఉపాధి కల్పన అధికారి విజయలక్ష్మి, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రైవేట్ ట్రావెల్స్ ప్రతినిధులతో సైబరాబాద్ సీపీ సమావేశం

## విద్యార్థుల భద్రత, ట్రాఫిక్ నిర్వహణ, సాంకేతిక పర్యవేక్షణపై ప్రత్యేక దృష్టి: సైబరాబాద్ సీపీ

శేరిలింగంపల్లి జూన్ 6 విజన్ ఆంధ్ర: విద్యార్థుల రవాణాను మరింత సురక్షితంగా, పారదర్శకంగా, సాంకేతిక ఆధారితంగా తీర్చిదిద్దే లక్ష్యంతో చేపట్టిన స్టూడెంట్ మొబిలిటీ ప్రోగ్రామ్ అమలుపై సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్, ఐపీఎస్., ప్రైవేట్ ట్రావెల్స్ యజమానులు, ప్రతినిధులు మరియు సంబంధిత శాఖల అధికారులతో శనివారం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయ ఆడిటోరియంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రవాణా శాఖ అధికారులు, ఆర్టీసీ ప్రతినిధులు, ట్రాఫిక్ పోలీసులు, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (రాజూజ) సభ్యులు, విద్యా సంస్థల రవాణా నిర్వాహకులు మరియు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ విద్యార్థుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. విద్యార్థులను తరలించే ప్రతి వాహనం భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించడంతో పాటు సీసీటీవీ కెమెరాలు, జీపీఎస్ ఆధారిత రియల్‌టైమ్ లొకేషన్ ట్రాకింగ్ వ్యవస్థలు, అత్యవసర భద్రతా పరికరాలతో ఉండాలని తెలిపారు. వాహనాల నిర్వహణ, డ్రైవర్ల అర్హతలు, లైసెన్సులు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు తదితర అంశాలపై కఠిన పర్యవేక్షణ అవసరమని పేర్కొన్నారు. సమావేశంలో సైబరాబాద్ పోలీసులు మరియు రాజూజ సంయుక్తంగా రూపొందించిన స్టూడెంట్ మొబిలిటీ ప్రోగ్రామ్పై ప్రత్యేక ప్రజెంటేషన్ నిర్వహించారు. విద్యార్థుల రవాణాలో ట్రాఫిక్ రద్దీతగ్గించడం, నిబంధనల అమలు , భద్రత ( అందుబాటు ధరల్లో రవాణా సేవలు కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యాలని వివరించారు. స్టూడెంట్ మొబిలిటీ ప్రోగ్రామ్‌లో భాగంగా ప్రత్యేక మొబైల్ అప్లికేషన్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు సీపీ వెల్లడించారు. ఈ యాప్ ద్వారా విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలు ప్రయాణిస్తున్న వాహనానికి సంబంధించిన కీలక సమాచారాన్ని నేరుగా తెలుసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. వాహనంలో విద్యార్థుల సంఖ్య నిర్దేశిత పరిమితికి మించి ఉందా లేదా , వాహనం



నడుపుతున్న డ్రైవర్ వివరాలు, డ్రైవింగ్ లైసెన్స్ స్థితి, వాహనం ఫిట్‌నెస్, ప్రయాణ మార్గం, ప్రస్తుత లొకేషన్ వంటి వివరాలు యాప్‌లో అందుబాటులో ఉంటాయని చెప్పారు. అదేవిధంగా కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా విద్యార్థుల రవాణా వాహనాలను రియల్‌టైమ్‌లో పర్యవేక్షించే విధానాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. దీనివల్ల అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించే అవకాశం ఉండటంతో పాటు విద్యార్థుల భద్రత మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. విద్యార్థుల డ్రాపింగ్, పికప్ సేవలు, పాఠశాలలు, కళాశాలలు, కోచింగ్ సెంటర్లు, క్రీడా శిక్షణా కేంద్రాలకు వెళ్లే సమయంలో ఎదురయ్యే రవాణా సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని సీపీ తెలిపారు. ట్రాఫిక్ రద్దీ తగ్గించడం, భద్రతా ప్రమాణాల అమలు, సమర్థవంతమైన రవాణా వ్యవస్థ ఏర్పాటు ఈ ప్రాజెక్ట్ ప్రధాన లక్ష్యాలని పేర్కొన్నారు. సమావేశంలో పాల్గొన్న ప్రైవేట్ ట్రావెల్స్ ప్రతినిధులు ట్రాఫిక్ నిర్వహణ, ఆర్టీఓ అనుమతులు, లైసెన్సులు, వాహనాల రిజిస్ట్రేషన్ మరియు ఇతర కార్యనిర్వహణ అంశాలకు సంబంధించిన సమస్యలను సీపీ దృష్టికి తీసుకువచ్చారు. వాటిపై స్పందించిన సీపీ, సంబంధిత శాఖలతో సమన్వయం చేసి సాధ్యమైన పరిష్కారాలను అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్, శేరిలింగంపల్లి ఎడిసిపి హనుమంతరావు, ట్రాన్స్పోర్ట్ ఇన్స్పెక్టర్ శీతల్ సోహన్, మేడ్చల్ డిటిఓ శ్రీనివాస్, ఆర్టీసీ డిఎం మియాపూర్-1 ప్రశాంత్ మియాపూర్ -2 వెంకటేశం ఇతర ఉన్న అధికారులు పాల్గొన్నారు.

# జూన్ 9న పోలీసు వాహనాల పాత విడిభాగాల బహిరంగ వేలం

**-వ్యాపారులు, కొనుగోలుదారులకు సువర్ణావకాశం**


**-పారదర్శకంగా వేలం నిర్వహిస్తాం**

**- ఎం.టి.ఓ, ఆర్.ఐ. శ్రీనివాస్**

వనపర్తి జిల్లా ప్రతినిధి, జూన్ 6 (విజన్ ఆంధ్ర): జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో పోలీసు వాహనాలకు సంబంధించిన పాత టైర్లు, బ్యాటరీలు, ఇతర విడిభాగాల బహిరంగ వేలాన్ని ఈ నెల 9న నిర్వహించనున్నట్లు జిల్లా పోలీసు వాహనాల అధికారి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎజిల్లా ఎస్పీ సునిత రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా పోలీసు కార్యాలయం సమీపంలోని జిల్లా సాయుధ దళ పోలీసు కార్యాలయ మైదానంలో ఈ వేలం ప్రక్రియ జరగనుంది. ప్రభుత్వ నిబంధనలు, మార్గదర్శకాలకు లోబడి పూర్తి పారదర్శకంగా ఈ వేలాన్ని నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. ఆసక్తి గల వ్యాపారులు, కొనుగోలుదారులు ముందుగానే ఇక్కడికి చేరుకుని పాత టైర్లు, బ్యాటరీలు, ఇతర విడిభాగాలను పరిశీలించుకుని వేలం పాటలో పాల్గొనవచ్చని సూచించారు. పోలీసు శాఖలో వినియోగంలో లేని వస్తువులను కొనుగోలు చేయడానికి ఇది మంచి అవకాశమని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వేలానికి సంబంధించిన పూర్తి వివరాలు, షరతులు, నిబంధనల కోసం జిల్లా సాయుధ దళ పోలీసు కార్యాలయాన్ని సంప్రదించవచ్చు. సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: 8712670604, 9949167450.


# ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

## జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి హెచ్చరిక



వనపర్తి జిల్లా ప్రతినిధి, జూన్ 6(విజన్ ఆంధ్ర): వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు రైతులు తెచ్చిన ధాన్యాన్ని కాంటా చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించి ఆలస్యం చేస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి హెచ్చరించారు. శనివారం కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ పురోగతిపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు రైతులు తెచ్చిన ధాన్యాన్ని కాంటా చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించి ఆలస్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు ధాన్యం తెచ్చిన వెంటనే కాంటా చేసి బస్తాలను లారీల్లో తరలించేందుకు సిద్ధంగా ఉంచాలన్నారు. ఆయా కొనుగోలు కేంద్రాలకు ట్యాగ్ చేసిన మిల్లు లేదా గోదాముకు మాత్రమే ధాన్యాన్ని తరలించాలని ఆదేశించారు. అదేవిధంగా, కొనుగోలు కేంద్రాల వారీగా ఇంకా ఎన్ని లారీలు అవసరం ఉన్నాయని ఆరా తీసిన కలెక్టర్, లారీ ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లు సైతం అవసరమైన అన్ని లారీలను రేపటిలోగా అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఈ పది రోజులు అధికారులకు సహకరించి ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తయ్యే విధంగా ముందుకు వెళ్లాలన్నారు. కావలసినన్ని లారీలు సమకూర్చకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ట్రాన్స్పోర్ట్ లారీల విషయంపై పర్యవేక్షణ ఉంచాలని జిల్లా రవాణా శాఖ అధికారిని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్, పౌరసరఫరాల శాఖ డిఎం ఆంజనేయులు, డిటిఓ సురేష్, లారీ ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లు, ఇతర అధికారులు ఉన్నారు.


# ప్రజావాణి రద్దు కలెక్టర్ ఆదర్శ్ సురభి



వనపర్తి జిల్లా ప్రతినిధి, జూన్ 6 (విజన్ ఆంధ్ర): ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జూన్ 8వ తేదీన గ్రామాల్లో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించనున్న నేపథ్యంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా వాణి కార్యక్రమం రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి నేడొక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రత్యేక గ్రామసభల కార్యక్రమం కారణంగా కలెక్టరేట్, ఆర్డీవో కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమం ఉండదని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని జిల్లాలోని ప్రజలంతా గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఫిర్యాదులు, అర్జీలు ఇచ్చేందుకు ఎవరూ రావొద్దని తెలిపారు. తిరిగి జూన్ 15వ తేదీన యధావిధిగా కొనసాగుతుంది.


# పాఠశాలల పునః ప్రారంభం నాటికి మరమ్మతు పనులు పూర్తి చేయాలి

**- జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక**



నారాయణపేట, జూన్ 6 (విజన్ ఆంధ్ర) : పాఠశాలల పునః ప్రారంభం నాటికి మరమ్మతు పనులన్నింటినీ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక ఆదేశించారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో జిల్లాలోని కస్తూర్బా గాంధీ పాఠశాలల ఎస్. వో లు, ఇంజినీరింగ్ విభాగం అధికారులు, ఎస్సీ, ఎస్టీ వసతి గృహ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 12 పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయని, అంతలోపు జిల్లాలోని 11 కేజీబీవిలలో మైనర్ రిపేర్ పనులన్నీ పూర్తి కావాలన్నారు. మేజర్ రిపేర్ పనులను రెండు నెలల్లో పూర్తి చేయించాలని అధికారులకు సూచించారు. జిల్లాలోని ఉట్కూర్ కేజీబీవీ పాఠశాల ప్రహరీ నిర్మాణం వివాదాన్ని వీలైనంత త్వరగా పరిష్కరించి పనులు ప్రారంభింప చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఉట్కూర్ కేజీబీవీ లో ఇంటర్ పూర్తయిన విద్యార్థినులు ఎవరెవరు ఎక్కడెక్కడ చదువు తున్నారో వివరాలు సేకరించి ఇవ్వాలని కలెక్టర్ ఎస్. వో కు సూచించారు. అలాగే మద్దూరు, మాగనూరు, మక్తల్ కేజీబీవీ పాఠశాలల మరమ్మతు పనులు గురించి అధికారులు, ఎస్.వో లను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల పునః ప్రారంభం నాటికి అన్ని కేజీబీవీలు, ఎస్సీ ఎస్టీ వసతి గృహాలను శు భ్రం చేయించి, అవసరమైన పాఠశాలలో పెయింటింగ్ పనులు, చిన్న చిన్న ఎలక్ట్రికల్ పనులను, తాగునీటి పైప్ లైన్ పనులను వెంటనే చేయించాలన్నారు. మళ్ళీ రెండు నెలల్లో సమావేశం నిర్వహిస్తానని, ఆ సమావేశానికి పూర్తి వివరాలతో రావాలని ఎస్.వో లను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీ సీ డీ వో సంగీత, సాంఘిక సంక్షేమ శాఖ,వెనుక బడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి అబ్దుల్ ఖలీల్, సెక్టోరల్ అధికారి శ్రీనివాస్, ఇంజనీరింగ్ అధికారులు, ఎస్. వో లు పాల్గొన్నారు.

# మాన్‌సూన్ రెగట్టాలో తెలంగాణకు 15 పతకాలు




హైదరాబాద్, జూన్ 06 (విజన్ ఆంధ్ర) : హుస్సేన్‌సాగర్‌లో జరిగిన 17వ మాన్‌సూన్ రెగట్టా నేషనల్ ర్యాంకింగ్ సెయిలింగ్ చాంపియన్ షిప్‌లో ఆతిథ్య తెలంగాణ జట్టు అద్భుత ప్రదర్శనతో 4 స్వర్ణాలు సహా మొత్తం 15 పతకాలు సాధించింది. అండర్-16 గర్ల్స్ విభాగంలో రమీజా భాను స్వర్ణ పతకం గెలుచుకోగా, అండర్-16 బాయ్స్ విభాగంలో రవికుమార్ బెన్నెవోలు గోల్డ్ మెడల్‌తో పాటు ప్రతిష్ఠాత్మక మాన్‌సూన్ రెగట్టా ట్రోఫీ, ఎస్.హెచ్.బాబు మెమోరియల్ ట్రోఫీలను కైవసం చేసుకున్నాడు. అండర్-18 ఇంటర్నేషనల్ 420 మిక్స్‌డ్ క్లాస్‌లో భద్రీనాథ్ నిరుడు-రిశ్విక జోడీ స్వర్ణం సాధించింది. సముద్ర తీరం లేని తెలంగాణ రాష్ట్రం సెయిలింగ్‌లో 15 పతకాలు సాధించడం విశేషమని యాచ్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ చీఫ్ కోచ్ సుహైమ్ షేక్ పేర్కొన్నారు. ఆదివారం జరిగే ముగింపు వేడుకల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నారు.

# నీట్-2026 పరీక్ష ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలి

## రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు

మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 06,(విజన్ ఆంధ్ర ): రాష్ట్రంలో నీట్-2026 పరీక్ష ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి అదనపు డి జి పి మహేష్ భగవత్, పౌరసరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, ఇతర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, సి.పి.లు, ఇతర అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నీట్-2026 పరీక్ష నిర్వహణ ఏర్పాట్లు, వరి ధాన్యం కొనుగోలు, జూన్ 9న సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో నిర్వహించనున్న రాష్ట్ర ముఖ్యమంత్రి సభ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 21వ తేదీన జరగనున్న నీట్-2026 పరీక్షకు 24 పట్టణాలలో 208 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, 72 వేల 956 మంది విద్యార్థులు హాజరు కాను న్నారని, ఇందుకు తగిన ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. పరీక్ష నిర్వహణకు పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేయాలని, రాష్ట్ర, జిల్లా సమన్వయ కమిటీలు అందుకు అనుగుణంగా పని చేయాలని తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులపై తక్షణమే స్పందించాలని, వదంతులు వ్యాప్తి కాకుండా చూడాలని తెలిపారు. ప్రభుత్వ సంస్థలలో మాత్రమే పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయాలని, పరీక్ష కేంద్రాలలో సి సి కెమెరాలు ఏర్పాటు చేయాలని, అంతర్జాతీయ యోగా దినోత్సవం దృష్ట్యా పరీక్ష నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని తెలిపారు. పరీక్ష రోజున ప్రశ్న పత్రాల తరలింపు, అభ్యర్థుల రిజిస్ట్రేషన్, బయోమెట్రిక్




వెరిఫికేషన్, అభ్యర్థుల తనిఖీ, బందోబస్తు తదితర ఏర్పాట్లను ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేపట్టాలని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 71 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేసి 4 వేల 488 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మూసి వేయడం జరిగిందని తెలిపారు. ఇప్పటి వరకు 10 లక్షల 58 వేల మంది రైతుల ఖాతాలలో 13 వేల 577 కోట్ల రూపాయల కనీస మద్దతు ధర జమ చేయడం జరిగిందని, మిగిలిన ధాన్యాన్ని కూడా త్వరితగతిన కొనుగోలు చేసి కొనుగోలు ప్రక్రియ ఎలాంటి ఆటంకాలు లేకుండా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి మండల మహిళా సమాఖ్యకు 1 చొప్పున 553 బస్సులను మంజూరు చేయడం జరిగిందని, ఈ బస్సులను జూన్ 9వ తేదీన సికింద్రాబాద్ లోని పరేడ్ గ్రౌండ్స్ లో రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా మహిళా సమాఖ్య సభ్యులకు లాంఛనంగా అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సభకు సంబంధించిన ఏర్పాట్లు, సభకు మహిళా సమాఖ్య సభ్యుల తరలింపుపై ఆయా జిల్లాల గ్రామీణ అభివృద్ధి అధికారులు, ఆర్ టి సి రీజినల్ మేనేజర్లు సమన్వయంతో పని చేసి సభను విజయవంతం చేయాలని తెలిపారు. జూన్ 12న రాష్ట్రంలోని పాఠశాలల పునః ప్రారంభానికి విద్యార్థులకు అందజేయవలసిన యూనిఫామ్ లతో సిద్ధంగా ఉండాలని తెలిపారు.అదనపు డి జి పి మాట్లాడుతూ పరీక్షా కేంద్రాలలో సి సి కెమెరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని, సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలకు ఎప్పటికప్పుడు స్పందించి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మహిళా అభ్యర్థుల తనిఖీలో మహిళ కానిస్టేబుల్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలో 1 వేయి 204 మంది అభ్యర్థులు నీట్-2026 పరీక్షకు హాజరు కానున్నారని, పరీక్ష నిర్వహణ కొరకు జిల్లాలో 5 కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, పరీక్షకు సంబంధించి అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసుకొని విజయవంతంగా నిర్వహించేందుకు అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, వర్షాల దృష్ట్యా కొనుగోలు కేంద్రాలలో టార్పాలిన్లు అందుబాటులో ఉంచడం జరిగిందని, రవాణా సంబంధిత ఏర్పాట్లు చేయడం జరిగిందని, తడిసిన ధాన్యాన్ని వెంటనే బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిపి భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, జిల్లా విద్యాశాఖాధికారి లలిత, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీకళ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడుల నాణ్యత చెప్పాలి

## ప్రభుత్వ బడుల పటిష్టత మనందరి బాధ్యత

## తపస్ బడిబాట పోస్టర్ ఆవిష్కరణలో జిల్లా కలెక్టర్ ప్రియాంక


నారాయణపేట, జూన్ 6 (విజన్ ఆంధ్ర) : జిల్లా కలెక్టర్ ప్రియాంక చేత శనివారం తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) జిల్లా శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన ప్రభుత్వ బడిబాట భవితకు బంగారు బాట పోస్టర్ ఆవిష్కరణ ఘనంగా జరిగింది. జిల్లా అధ్యక్షులు నరసింహ అధ్య ర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ బడుల నాణ్యతను కిందిస్థాయిలో అందరికీ అవగాహన కల్పించి, ప్రభుత్వ బడుల్లో నూతన ప్రవేశాలను పెంచాలని తెలియజేశారు. విద్యా రంగ అభివృద్ధి, ప్రభుత్వ బడుల బలోపేతం, విద్యార్థుల ప్రతిభ ప్రోత్సాహం లక్ష్యంగా రూపొందించిన బడిబాట పోస్టర్ ఎంతో అభినందనీయమని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యా బోధన, ఆధునిక బోధనా పద్ధతులు, డిజిటల్ టీవీ తరగతులు, ఇంగ్లీష్ మీడియం విద్యా విస్తరణ, నో బ్యాగ్ డే వంటి కార్యక్రమాల అమలుతో విద్యా ప్రమాణాలు మరింత మెరుగవుతాయని ఆమె



పేర్కొన్నారు. తపస్ అదనపు ప్రధాన కార్యదర్శి షేర్ కృష్ణారెడ్డి, రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ గుంపు బాలరాజ్ మాట్లాడుతూ ప్రభుత్వ బడిలో ప్రవేశాలు పెంచడం, ప్రభుత్వ బడుల పటిష్టత కోసం కృషి చేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి కిషోర్ కుమార్, జిల్లా నాయకులు సీతారాములు తిరుపతయ్య శ్రీనాథ్ ,మహిళా విభాగం నర్మద, సౌభాగ్య లక్ష్మి వెంకటమ్మ కృష్ణవేణి ప్రియాంక మండల నాయకులు చిన్న నరసింహులు వెంకటేష్ వాజ్పాయ్ బీరప్ప పాల్గొన్నారు.

# ఆకాంక్షిత బ్లాక్‌లో విద్య అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి

**- జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్**



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 6, (విజన్ ఆంధ్ర): జిల్లాలోని ఆకాంక్షిత బ్లాక్ తిర్యాణి మండలంలో విద్య అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ అన్నారు. శనివారం జిల్లా విద్యాధికారి సచ్చిదానంద చారి, మండల విద్యాధికారి లతో కలిసి జిల్లాలోని తిర్యాణి మండలంలో ప్రభుత్వ పాఠశాలలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మాణిక్యపూర్ లోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం లను సందర్శించి పాఠశాలలలోని తరగతి గదులు, త్రాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఆదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్య అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని, ఈ క్రమంలో ఆకాంక్షిత బ్లాక్ లోని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు సకల సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఇంటర్‌ఆక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ పనితీరును పరిశీలించి సమర్థవంతమైన వినియోగంపై సిబ్బందికి సూచనలు చేశారు. పాఠశాలల అభివృద్ధి, సదుపాయాల మెరుగుదల, డిజిటల్ బోధన పద్ధతుల అమలుపై అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన మున్సిపల్ కార్యాలయాలకు సీఎం చేతుల మీదుగా శంకుస్థాపన

**కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్**

మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా జూన్ 6, (విజన్ ఆంధ్ర ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవ ఏర్పాటుచేసిన మున్సిపల్ కార్పొరేషన్లకు నూతనంగా కార్యాలయాలను నిర్మించాలని సంకల్పించింది . ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయా కార్యాలయాలకు శంకుస్థాపన చేయనున్నారు. మేడ్చల్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయానికి ఉప్పల్ భగాయత్ లో , ఆదివారం సాయంత్రం 5 గంటలకు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయానికి ,మియాపూర్ లో సోమవారం సాయంత్రం 5 గంటలకు సీఎం , శంకుస్థాపన చేస్తారు. ముఖ్యమంత్రి రాకను పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ భారీ ఏర్పాట్లు చేస్తోంది. సీఎం,కి ఘనంగా స్వాగతం చెప్పాలని కార్యకర్తలు ఉత్సాహంతో ఉన్నారు. ఈ మేరకు టిపిసిసి ఉపాధ్యక్షుడు కమ్మ కార్పొరేషన్ చైర్మన్ కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్, శుక్రవారం స్థానిక నాయకులతో కలిసి మియాపూర్ లో శంకుస్థాపన చేయనున్న స్థలాన్ని పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఏర్పాట్లు ఘనంగా నిర్వహించాలని ఇప్పటికే అయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి యూత్ విభాగంతో సహా పార్టీకి చెందిన అన్ని విభాగాల నాయకులు కార్యకర్తలు మహిళా సంఘాలు మహిళా నాయకురాళ్లు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు.